


కిల్లర్స్ గ్యాంగ్
A.S.Murti
MB
మధుబాబు

# కిల్లర్స్ గాంగ్

ఆరిపోయిన సిగార్‌ని వెలిగించుకోవటానికి ప్రయత్నించేస్తూ, హోమ్ మినిస్టర్ గారి బంగ్లాలో నుంచి బయటికి వచ్చారు కులకర్ణి.

పాతిక గజాల దూరంలో వున్న ఒక నిద్రగన్నేరు చెట్టుక్రింద పార్క్ చేయబడి వున్నది ఆయన వుపయోగించే వైట్ అంబాసిడర్.

బోనెట్‌ని ఆనుకుని హాయిగా బీడీ కాల్చుకుంటున్నాడు డ్రయివర్ చంద్ర. అదిరిపడి అవతలకు విసిరేశాడతను ఆ బీడీని. నోటిలో వుండిపోయిన పొగను భుజంమీదినించి వెనక్కి వూదుతూ, గబగబా ముందుకు పోయాడు.

"సులోచన... సులోచన ఎక్కడికి పోయింది??" కనుబొమలు ముడివేసి సీరియస్‌గా చూస్తూ ప్రశ్నించారు కులకర్ణి.

ఎక్కడికీ పోలేదు ఆయన సెక్రటరీ సులోచన. అంబాసిడర్ వెనుక సీటులోనే కూర్చుని వున్నది. ఆయన కంఠాన్ని వినగానే చటుక్కున క్రిందికి దిగి అటెంక్షన్‌లో నిలబడింది.

"ఐ వాన్ట్ అవర్ బిగ్ మంకీ టూ బీ ప్రజెంట్ హియర్ వితిన్ ఆఫ్ యనవర్. ఎక్కడ వున్నా, ఏ పని చేస్తున్నా వెంటనే లాక్కువచ్చేయ్. ఐ డోన్ట్ వాన్ట్ టూ హియర్ ఎనీ ఎక్స్‌క్యూజెస్."

అనవసరమైన అభ్యంతరాలను తను వినదలుచుకోలేదని క్లియర్‌కట్‌గా నొక్కి చెపుతూ ఆర్డర్స్ పాస్ చేశారు కులకర్ణి చేతిలో వున్న సిగార్ వంక అసహ్యాకరంగా చూసి అవతలకు విసిరేశారు. ఎంత స్పీడ్‌గా బయటికి వచ్చారో అంతే వేగంతో లోపలికి వెళ్ళిపోయారు.

నుదుటిమీద ప్రత్యక్షం అయిన స్వేద బిందువుల్ని అరిచేత్తో అద్దుకుంటూ చంద్ర వైపు చూసింది సులోచన. వంటికి సరిపడని ఆహార పదార్థమేదో నోటిలో పెట్టుకున్నట్లు కనులు చిట్లించింది.

బిగ్ మంకీ అంటే ఎవరో బాగా తెలుసు చంద్రకి.

"అస్సాం నుంచి గంగారం సాట్ వచ్చాడు... ఈ సాయంత్రం దాకా ఢిల్లీలోనే వుంటాడని నాకు తెలిసింది." డోర్‌ని తెరిచి అంబాసిడర్ స్టీరింగ్ ముందు కూర్చుంటూ మెల్లిగా చెప్పాడతను.

"గంగారాం వచ్చినా, గంగూభాయ్ పటేల్ వచ్చినా మనం చేయగలిగింది ఏమీలేదు. బాస్ ఆర్డర్స్‌ని వినిపించి వచ్చేద్దాం..." అంటూ వెనుక సీటులోకి చేరుకున్నది సులోచన.

టైట్‌గా టర్న్ కొట్టి, వేగంగా బయలుదేరింది అంబాసిడర్. నాలుగే నాలుగు క్షణాల్లో మెయిన్ రోడ్డుమీదికి చేరుకున్నది.

"కొంపలు అంటుకుపోతున్నట్లు కళ్ళు తిరిగిపోయే వేగంతో పోవాల్సిన అవసరం లేదు. నెమ్మదిగా నడుపు...లేనిపోని తలనొప్పుల్ని

తెచ్చుకోకు..." ఎందుకైనా మంచిదని ముందు సీటుని గట్టిగా పట్టుకుంటూ చంద్రను హెచ్చరించింది సులోచన.

ఆ మాటలు అసలు తనకు వినిపించనట్లు యాక్సిలేటర్‌ని మరింత గట్టిగా అదిమాడు అతను.

గాలిలో ఎగురుతున్నట్లు పరుగులు ప్రారంభించింది అంబాసిడర్. అడ్డువచ్చిన పాదచారుల్ని హారన్ మ్రోతలతో అదరగొడుతూ,పన్నెండు నిముషాల వ్యవధిలో ఢిల్లీ నగరాన్ని దాటి, నిర్మానుష్యంగా వున్న ఒక ఘాట్ రోడ్డు మీదికి పోయింది.

రోడ్డుకు అటూ ఇటూ అగుపిస్తున్న లోతైన గోతుల్ని చూసేసరికి చెమటలు పట్టేశాయి సులోచన అరచేతులు. ముందు సీటును మరింత గట్టిగా పట్టుకున్నదామె. కళ్ళను గట్టిగా మూసుకున్నది.

ఆమె ఊహించినట్లు అదుపు తప్పి ఆ గోతుల్లోకి పల్టీ కొట్టలేదా కారు. రెట్టించిన వేగంతో ముందుకు పోయింది. ఒక చిన్న కొండగుట్టమీద కట్టబడి వున్న అందమైన చిన్న బంగ్లాముందు ఆగింది.

బంగ్లా చుట్టూ పెంచబడి వున్న రకరకాల పూపొదల ఉనికిని పసికట్టిన తర్వాత కళ్ళుతెరిచింది సులోచన.

ముసి ముసిగా నవ్వుతున్న చంద్ర వంక కోరగా చూస్తూ డోర్ తెరుచుకుని క్రిందికి దిగింది.

దిగిన మరుక్షణం ఆమె చెవులకు చేరాయి పెద్ద పెద్ద నవ్వు... నాలుగు అడుగులు కూడా వేయకముందే అగుపించాడామెకు మాస్టర్ షాడో.

గంగారాం భుజాలమీద కూర్చుని వున్నాడతను... వత్తుగా పెరిగివున్న గంగారాం జుట్టును పట్టుకుని ఇష్టం వచ్చినట్లు హింస పెడుతున్నాడు... పట్టరాని ఆనందంతో కేరింతలు కొడుతున్నాడు.

"నొప్పి పెడుతున్నది వదిలేయమ్మా... మా బంగారానివి కదూ ... వదిలెయ్..." భుజాలమీదినించి అతను వెనక్కి దొర్లకుండా గట్టిగా పట్టుకుందా,బ్రతిమాలుకుంటున్నాడు గంగారాం... అతను పెట్టే బాధల్ని ఓపికగా భరిస్తున్నాడు.

తన వంటి మీద చేయి వేసిన వారి చేతుల్ని రెండు ముక్కలు చేయందే నిద్రపోని ఆ పెద్దమనిషి... తన వంక కోరగా చూస్తే చాలు. ఆకాశం బ్రద్దలై పోయేటట్లు అరిచి ఫైటింగ్‌కి రెడీ అయి పోయే ఆ వీరాధి వీరుడు ఆ విధంగా మాట్లాడటం, అంత నెమ్మదిగా కూర్చుని వుండటం అమితమైన ఆశ్చర్యాన్ని - కలిగిస్తుండగా పోర్టికోని దాటి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లింది సులోచన .

చిన్న చిన్న బియ్యపు గింజల మాదిరి అప్పుడప్పుడే బయటికి తొంగి చూస్తున్న పళ్ళు కనపడే నోటిని తెరిచి మరింత గట్టిగా నవ్వాడు మాస్టర్ షాడో. గంగారాం తలను వదిలేసి ఆమె మీదికి దుమికాడు.

అతనికి, తనకు వున్న ఆరడుగుల మధ్య దూరాన్ని రెండే రెండు అంగల్లో అధిగమించింది సులోచన. గంగారాం చేతుల్లోనుంచి జారి, ముక్కుముఖం ఏకమై పోయేటట్లు ముందుకు పడిపోకముందే గట్టిగా పట్టుకొని గుండెలకు అదుముకున్నది.

చిటికెలో తప్పిపోయిన ఆ ప్రమాదాన్ని గురించి తెలుసుకోగలిగిన వయస్సు కాకపోవటం వల్ల, కొంచెం కూడా బెదరలేదు మాస్టర్ షాడో... అదేదో విచిత్రమైన ఆటగా భావించి మరింత పెద్దగా కేరింతలు కొట్టాడు.

ఆ సవ్వడిని ఆలకించి కిచెన్‌లో నుంచి బయటికి వచ్చిన బిందుకు కులకర్ణిగారి ఆర్డర్స్‌ని వినిపించింది సులోచన.

"అర్జంటుగా వెంటబెట్టుకు రమ్మన్నారు. అభ్యంతరాలు ఎటువంటివైనా సరే వినదలుచుకోలేదని చెప్పమన్నారు" అంటూ ఒక సోఫాలో కూర్చున్నది.

నొసలు ముడివేసి ఏదో కామెంట్ చేయబోయిన బిందును వెంటనే ఆపివేశాడు ఆమె వెనుకే డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చిన షాడో.

గంగారాం భుజం తట్టి, మాస్టర్ షాడో బుగ్గమీద చిటికె వేశాడు. పాంటు జేబులో వున్న పనామా పాకెట్‌ని బయటికి తీసి సిగరెట్ వెలిగించుకుంటూ పోర్టికోలోకి పోయాడు.

మాస్టర్ షాడో బుగ్గల్ని ముద్దాడి బిందుకు అప్పచెప్పింది సులోచన. వడివడిగా అడుగులు వేస్తూ షాడోని అనుసరించింది.

ఆమె హెచ్చరించవలసిన అవసరం లేకుండానే ఇంజన్ స్టార్ట్ చేసి తిరుగు ప్రయాణానికి సిద్ధంగా వున్నాడు చంద్ర. వారిద్దరూ ఎక్కి కూర్చున్న మరుక్షణం వేగంగా రోడ్డుమీదికి తీసుకుపోయాడు.

*****

"...స్పెషల్ బ్రాంచివారు మొదలుపెట్టిన ఇన్వెస్టిగేషన్స్‌లో తలలు దూర్చి గతంలో చాలాసార్లు ఎన్నెన్నో ఎదురుదెబ్బలు తిన్నాం మేము... నమ్మక ద్రోహానికి గురై ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన సిచ్యుయేషన్స్‌లో చిక్కు పడ్డాము... వాటన్నిటినీ మరిచిపోవటానికి మేము ఇప్పుడు సిద్ధంగా లేము..."

హోమ్ మినిస్టర్ గారి బంగ్లా ముందు భాగంలోని విశాలమైన పెద్ద హాలులో కూర్చుని గుర్రుగా చూస్తూ అన్నారు కులకర్ణి.

సూటిగా ఆయన ముఖంలోకి చూసే ధైర్యం లేకపోవటంవల్ల తలల్ని ప్రక్కకు తిప్పుకున్నారు అక్కడ సమావేశమై వున్న స్పెషల్ బ్రాంచి అధికారులు.

వాళ్ళ తరపున మాట్లాడటానికి వచ్చి వున్నారు అరడజనుమంది మిలటరీ ఇంటలిజెన్స్ ఆఫీసర్లు... కులకర్ణి గారి యాటిట్యూడ్ వారిని బాగా ఖంగారు పెట్టింది కాబోలు, తలల్ని వంచుకుని కాళ్ళవంక, చేతిగోళ్ళవంకా చూసుకోవటం మొదలుపెట్టారు.

చెప్పదలుచుకున్న మాటల్ని సూటిగా చెంపమీద లాగి పెట్టి కొట్టినట్లు చెప్పటంతో ఆగిపోలేదు కులకర్ణిగారు.

"ఈ దేశపు శాంతిభద్రతల్ని పరిరక్షించటం కోసం ఈ దేశపు సార్వభౌమాధికారాన్ని ఛాలెంజి చేసే దుష్టశక్తుల్ని అంతమొందించటం కోసం పాటుపడే హక్కు తమకు ఒక్కరికే వున్నట్లు బిహేవ్ చేస్తున్నారు ఈ స్పెషల్ బ్రాంచివారు మా సి.ఐ.బి. ఏజెంట్లకు హక్కులు లేనట్లు, అసలు మేము ఈ దేశానికి చెందినవారం కాదని అన్నట్లు మాట్లాడుతున్నారు. స్పెషల్ బ్రాంచివారి దృష్టిలో మేము పరాయి దేశాలనుంచి దొంగతనంగా ఈ దేశంలోకి వచ్చి సెటిల్ అయిన కిరాయి మనుష్యుల మాదిరిగా కనిపిస్తున్నామని నా అభిప్రాయం..."

పదునైన కత్తితో గుండెలమీద పొడిచినట్లు ఊపిరి తీసుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా ఎడా పెడా వెక్కిరింపుల వర్షం కురిపిస్తున్న కులకర్ణిగారి దగ్గిరికి వచ్చి భుజంమీద చెయ్యి వేశారు హోమ్ మినిస్టర్.

"ప్లీజ్ కులకర్ణి... ఎప్పుడో జరిగిపోయిన ఎగ్గుల్ని మనసులో పెట్టుకొని నువ్వు ఇలా ఎత్తి పొడవటం ఏమీ బాగోలేదు.. దయ చేసి కాస్తంత ప్రశాంతంగా కూర్చుంటే చాలా బాగుంటుంది ... ప్లీజ్..." అంటూ భుజాన్ని అదిమి వారెవరూ చూడకుండా కనులతో సైగ చేశారు.

సి.ఐ.బి.కి స్పెషల్ బ్రాంచికి మధ్య అనవరతమూ క్షణం కూడా విశ్రాంతి లేకుండా కొనసాగుతూ వుండే కోల్డ్ వార్ గురించి పూర్తిగా తెలుసు హోమ్ మినిస్టర్ గారికి.

తాము పూర్తిచేయలేని ఎస్సైన్‌మెంట్స్‌ని సి.ఐ.బి.కి అప్పగించి, ఆఖరి క్షణంలో సి.ఐ.బి. ఏజెంట్స్ ప్రాణాలకు ముప్పును కలిగించే పరిస్థితుల్ని క్రియేట్ చేయటం చాలా బాగా అలవాటు అయింది స్పెషల్ బ్రాంచ్ అధికారులకు.

ఆ విషయాల్ని అందరిముందు బయట పెట్టే అవకాశం కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు కులకర్ణి... ఆయన్ను మాట్లాడవద్దని భుజం తడితే మౌనంగా వుండిపోతారా??

హోమ్ మినిస్టర్‌గారి సైగను గమనించి మరింతగా రెచ్చిపోయారు కులకర్ణి. చేతిలో వున్న సిగార్‌ని అవతలకు విసిరికొట్టి,ఛివాలున కుషన్ ఛైర్లో నుంచి లేచి నిలబడ్డారు.

ఆ రోజునుంచీ స్పెషల్ బ్రాంచికి సి.ఐ.బి.కి మధ్య ఎటువంటి సంబంధ బాంధవ్యాలు వుండటానికి వీలులేదని, వారు మొదలుపెట్టిన ఎస్సైన్‌మెంట్స్ జోలికి సి.ఐ.బి. పొరపాటున కూడా వెళ్లటం జరుగదనీ ఖచ్చితమైన మాటలతో కరాఖండీగా ఎనౌన్స్ చేయబోతుండగా, ఎటువంటి హెచ్చరికా లేకుండా హాలువంటి ఆ గదిలోకి ఎంటర్ అయ్యారు ప్రధానమంత్రి[1].

అదిరిపడి కుర్చీలోనుంచి లేచారు అక్కడి వారందరూ... అటెంక్షన్‌లో నిలబడి స్టిఫ్‌గా శాల్యూట్స్ చేశారు మిలటరీ ఇంటలిజెన్స్ అధికారులు.

"చెప్పా పెట్టకుండా వచ్చి మీకు ఇబ్బందిని కలుగచేస్తున్నందుకు మన్నించాలి... ఎటువంటి ప్రమాదకరమైన పనుల్ని అప్పచెప్పినా, పెదవులు కూడా కదిలించకుండా పూర్తిచేసుకువచ్చే సి.ఐ.బి. ఈ రోజు

---

[1] ఎటువంటి హెచ్చరికా లేకుండా అర్ధాంతరంగా హోమ్ మినిస్టర్‌గారి బంగ్లాకు ప్రధానమంత్రి రావటం అది రెండవసారి... మొదటిసారి రాకను సూచించే సందర్భం "టెర్రా -205" అనే నవలలో వివరించబడింది.

అందరి మాటలకు ఎదురు చెప్తున్నట్లు, ఈ సమావేశాన్ని బహిష్కరించబోతున్నట్లు మాకు ఒక వార్త అందింది..." అత్యవసరమైన పనులు ఎన్ని వున్నా మేము ఇక్కడికి రావటానికి కారణం అదే..." అంటూ కులకర్ణిగారి వైపు చూశారు ప్రధానమంత్రి.

టాప్ పిచ్‌కి చేరిపోయి వున్నది కులకర్ణిగారి ఆగ్రహం... ప్రధానమంత్రిని చూసిన తర్వాత కూడా క్రిందికి దిగలేదది.

"మీకు కబురు అందించిన వారెవరోగాని చాలా కరెక్టుగా ఎస్సెస్ చేయగలిగారు... ఈ సమావేశాన్ని వదిలి వెళ్ళి పోవాలన్నదే నా ఆశయం..." నిర్భయంగా, నిర్మొహమాటంగా తమ మనసులోని మాటను బయటపెట్టి, ముఖద్వారం వైపు తిరగబోయారాయన.

అత్యవసరమైన పనులు ఎన్ని వున్నా, కేవలం ఆయన్ను శాంతింప చేయటం కోసం మాత్రమే తాము అక్కడికి వచ్చినట్లు వెల్లడించిన తర్వాత కూడా ఆయన ఆ విధంగా మాట్లాడటాన్ని చూసి కోపగించుకోలేదు ప్రధానమంత్రి. కనీసం కనుబొమ్మల్ని ముడివేయను కూడా వేయలేదు.

"ఏ మాత్రం ఆలస్యం చేసినా మనం తట్టుకోలేనంత ప్రమాదాన్ని కలిగించే సంఘటనలు మన బంగ్లాదేశ్ బోర్డర్స్‌లో జరుగుతున్నాయి. దయచేసి ఈ ఒక్కసారికి నువ్వు అభ్యంతరాల్ని వెలువరించకుండా స్పెషల్ బ్రాంచి రిక్వెస్టును మన్నించాలి... ప్లీజ్ కులకర్ణీ... ఈ ఒక్కసారికి మా

మాటను మన్నించలేవా??" కులకర్ణిగారి దగ్గిరికి పోయి భుజంమీద చేయి వేస్తూ అనునయంగా అన్నారు.

ఓరగా తలతిప్పి హోమ్ మినిస్టర్ గారి వైపు చూశారు కులకర్ణి.

ఎవరూ గమనించకుండా మరోసారి కనులతో సైగ చేశారాయన. ఆగ్రహాన్ని అణుచుకుని శాంతించవలసిందిగా సూచించారు.

"మీరు ప్రత్యేకంగా పనికట్టుకుని వచ్చి చెప్పారు కాబట్టి నేను వప్పుకుంటున్నాను. ఎప్పటి మాదిరిగా నా ఏజెంట్లకు ఏవైనా ఇబ్బందులు వీరి మూలకంగా ఎదురైతే మాత్రం-" అంటూ మాటను మధ్యలోనే ఆపి ప్రధానమంత్రి గారి ముఖంలోకి చూశారు కులకర్ణి.

ముఖంలో గూడు కట్టుకుని వున్న టెన్షన్ మంత్రం వేసినట్లు మటుమాయం అయిపోతుండగా, తేలికగా నిట్టూర్చి స్పెషల్ బ్రాంచి అధికారులవైపు తిరిగారు ప్రధానమంత్రి.

"కులకర్ణి అభిప్రాయాల్ని గౌరవించండి... ఆయన కోరుకునే పరిస్థితుల్ని కల్పించండి.. ఆయన దగ్గర్నుంచి ఎటువంటి కంప్లయింట్స్ రాకుండా జాగ్రత్తపడండి" అని ఆర్డర్స్ ఇస్తూ ఇక్కడి వారందరి వంకా చూశారు.

అంగీకార సూచకంగా వారు తలలు వూపిన మరుక్షణం ఆ గది బయటికి బయలుదేరారు.

"మీ సమావేశాన్ని ప్రశాంతంగా కొనసాగించుకోండి. ఐ విల్ టేక్ లీవ్" అంటూఎంత వేగంగా లోపలికి వచ్చారో అంతకు రెట్టింపు వేగంతో వెళ్ళిపోయారు.

పది క్షణాలు ఆగి హాల్లో వున్న వారందరినీ వారి వారి సీట్లలో కూర్చోవలసిందిగా రిక్వెస్ట్ చేశారు హోమ్ మినిస్టర్ గారు.

"ఉయ్ విల్ హావ్ సమ్ టీ... అండ్ రిలాక్స్ ఫర్ ఎ ఫ్యూ మినిట్స్..." అంటూ దూరంలో నిలుచునివున్న తమ పర్సనల్ సెక్రటరీ వైపు చేయి చూపారు.

కొత్తగా జాబ్‌లో జాయిన్ అయినందువల్ల ఖంగారు ఖంగారుగా కదిలింది ఆమె... ఇద్దరు సర్వెంట్స్‌తో చాయ్ కప్పులు పెట్టివున్న ట్రేలను తెప్పించి అక్కడి వారందరికీ అందించింది.

"సమావేశం ప్రారంభం అయి సరిగ్గా ఒక గంట గడిచి పోయింది... అటెండ్ కావల్సినవారు కొందరు ఇంకా అటెండ్ కాలేదు..." ఖాళీ అయిన కప్పును క్రింద పెట్టి, రిస్ట్ వాచ్ వంక చూసుకుంటూ సన్నగా గొణిగినట్లు మాట్లాడాడు స్పెషల్ బ్రాంచికి చెందిన ఆఫీసర్ ఒకతను.

అతను ఎవరిని ఉద్దేశించి ఆ మాటల్ని ఉపయోగించాడో తెలుసు కులకర్ణిగారికి. మట్టిబెడ్డ విసరబడిన తాచుపాము మాదిరి చివ్వున తలఎత్తి

ఏదో అనబోతుండగా, బంగ్లా బయటినించి అతి పెద్దగా వినవచ్చింది ఆయన కారు హారన్.

పూర్తిగా ఆగకముందే క్రిందికి దూకాడు కాబోలు, పరుగులాంటి నడకతో లోపలికి వచ్చాడు షాడో, అటెంక్షన్లో నిలబడి వారందరికీ అభివాదం చేశాడు.

"అరగంటలో ఇక్కడికి రమ్మని నీకు కబురుచేశాను... గంట గడిచిపోయినా రాకుండా వుండటంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?" పళ్లు పట పటమని కొరకటానికి రెడీ అయిపోతూ వేడిగా అడిగారు కులకర్ణి.

*****

కొంచెం కూడా తడబడలేదు షాడో.

"మీ ఆర్డర్స్ నాకు అందిన ఇరవై రెండు నిముషాల్లో వచ్చేశాను సర్... మీరు ఇచ్చిన వ్యవధి పూర్తికావటానికి ఇంకా ఎనిమిది నిముషాలు టైమ్ వున్నది..." అంటూ ఆయన ప్రక్కన ఖాళీగా వున్న ఛైర్లో కూర్చున్నాడు.

"కాస్తంత చాయ్ తాగి స్థిమితంగా కూర్చో... నిన్ను అత్యవసరంగా పిలిపించటానికి కారణం ఏమిటో మన స్పెషల్ బ్రాంచి డిప్యూటీ డైరక్టర్ చెపుతారు..." ఒకే ఒక్క మాటతో అంతకు ముందువరకూ అక్కడ జరిగిన సంఘటనల్ని అతనికి ఎక్స్ప్లెయిన్ చేశారు హోమ్ మినిస్టర్.

మనిషిని చూడకపోయినా, పేరును విని వున్నది కాబోలు, మరింతగా ఖంగారుపడుతూ ఈసారి స్వయంగా టీ కప్పును తీసుకు వచ్చింది హోమ్ మినిస్టర్ గారి పర్సనల్ సెక్రటరీ.

కనురెప్పల్ని అలవోకగా ఎత్తి అతను తన ముఖంలోకి చూసేసరికి, ఆ కప్పును క్రిందికి వదిలేసింది.

అటువంటిది ఏదో జరుగబోతున్నదని అర్ధం అయింది షాడోకి. ఆఖరి క్షణంలో పాదాల్ని పైకి ఎత్తి ప్రక్కకు వరిగాడు. కప్పులోనుంచి బయటికి వెదజల్ల బడిన చాయ్ తన దుస్తుల్ని నాశనం చేయకుండా జాగ్రత్తపడ్డాడు.

ఆ క్షణంలో తన ఉద్యోగం వూడిపోయినట్లే అనుకున్నది ఆ యువతి. ఎర్రబడిన ముఖంతో, శిలా విగ్రహంలా బిగుసుకుపోయింది.

"సర్వెంట్స్‌ని పిలిపించి ఈ ప్రదేశాన్ని క్లీన్ చేయించుబేబీ... కొంపలు అంటుకుపోయినట్లు ఖంగారు పడటాన్ని కాస్తంత తగ్గించుకో..." ఆమెకు మాత్రం వినిపించేటట్లు లోగొంతుకతో హెచ్చరిస్తూ, పాంటు జేబులోనుంచి పనామా పాకెట్‌ని బయటికి తీశాడు షాడో.

"నేను రెడీగా వున్నాను సర్... ప్లీజ్ స్టార్ట్ ది మీటింగ్..." సిగరెట్ వెలిగించుకుంటూ హోమ్ మినిస్టర్ గారితో అన్నాడు.

అతనికి ఎదురైన ఆ అనుభవం స్పెషల్ బ్రాంచి వారికి ఎవరికైనా ఎదురైవుంటే వాళ్ళ బిహేవియర్ ఎలావుండి వుండేదో ఊహించటానికి ప్రయత్నిస్తూ, స్టిఫ్‌గా కూర్చునివున్న ఆ ఆఫీసర్స్ వైపు చూశారు హోమ్ మినిస్టర్‌గారు.

"నీకు బంగ్లాదేశ్‌లో వున్న బయిజు పట్టణాన్ని గురించి తెలుసా?" ఎటువంటి ఉపోద్ఘాతము లేకుండా సూటిగా అసలు విషయంలోకి వస్తూ వెంటనే ప్రశ్నించారు స్పెషల్ బ్రాంచిలో కొత్తగా డిప్యూటీ డైరక్టర్ పదవిని పొందిన గుణశేఖర్.

అతను ఆశించినట్లు ఆలోచనలో పడలేదు షాడో... సమాధానం చెప్పటానికి కాస్తంత వ్యవధి కోరలేదు.

"బంగ్లాదేశ్‌లో వుండే పది పదిహేను పెద్దపట్టణాల్లో బయిజు సిటీ కూడా ఒకటి. మనూ నది ప్రవహించే ప్రదేశానికి వందకిలో మీటర్ల దూరంలో వుంటుంది..." పనామా పొగల్ని గుండెల నిండా పీల్చుకుని, పైకి వదులుతూ చెప్పాడు.

"అక్కడికి నువ్వు ఎప్పుడయినా వెళ్లడం జరిగిందా?" వెంటనే వేశాడు గుణశేఖర్ మరో ప్రశ్న.

ఆ ప్రశ్న వెనుక వున్న అంతరార్థాన్ని ఊహించటానికి ప్రయత్నిస్తూ తల అడ్డం తిప్పాడు షాడో.

"ఆ పట్టణంలో మీ సి.ఐ.బి.తో సంబంధం కలిగిన వ్యక్తులు ఎవరయినా వున్నారా?" పట్టు వదలని విక్రమార్కుడి మాదిరి ఇంకో ప్రశ్న వేశాడు స్పెషల్ బ్రాంచి డిప్యూటీ డైరెక్టర్.

"నాకు తెలిసినంతవరకూ ఎవరూ లేరు సర్... ఒక వేళ ఉండివుంటే ఆ విషయాన్ని మీకు చెప్పటం జరుగదు. అందుకు మా సంస్థ రెగ్యులేషన్స్ అంగీకరించవు..." బుద్ధిమంతుడి మాదిరి అడిగిన మాటకల్లా సమాధానం ఇచ్చి, చటుక్కున అడ్డం తిరిగాడు షాడో.

ఫక్కున నవ్వబోయిన మిలటరీ ఇంటలిజెన్స్ అధికారులు తమవంక హోమ్ మినిస్టర్ గారు గుర్రుగా చూసేసరికి చటుక్కున వంచేసుకున్నారు తలల్ని.

"నో... బయిజు పట్టణాన్ని గురించి పరాయి వ్యక్తులు చెపితే వినటము, ప్రపంచపటాల్లో చూడటము తప్ప నీకు అధికంగా తెలిసింది ఏమీలేదు. అక్కడి పౌరజీవితాన్ని గురించి,సాంఘిక పరిస్థితుల్ని గురించి నువ్వు మాకు చెప్పగలిగింది ఏమీలేదు. యామై కరెక్ట్?" అంతకుముందు అతను ఇచ్చిన ఎత్తిపొడుపు సమాధానాన్ని వినిపించుకోనట్లే, తన పద్ధతిలో తను మాట్లాడుకుంటూ పోయాడు గుణశేఖర్.

కోటు జేబులోనుంచి తీసిన ఒక ఫ్రష్ సిగార్‌ని ఇంకా వెలిగించుకోకుండా చేతుల్లోనే తిప్పుతూ కూర్చున్న కులకర్ణిగారిలో వెంటనే వచ్చింది చలనం.

"బయిజు పట్టణాన్ని గురించి ప్రత్యక్షంగా తెలుసు కోవటానికి అదేమీ మక్కా వంటి పవిత్ర పుణ్యక్షేత్రం కాదు... మనూ నది పరివాహక ప్రదేశంలో నివశించే మౌమౌలు తరచుగా దాడులుచేసే ఒక ఆర్డినరీ సిటీ..." అని వెక్కిరించ బోతుండగా అర్జంటుగా సైగ చేసి ఆ మాటలు ఆయన పెదవుల్ని దాట ముందే అడ్డుకున్నారు హోమ్ మినిస్టర్ గారు.

"మన ఈశాన్య రాష్ట్రాలలో రోజు రోజుకు అధికం అయిపోతున్న అశాంతి, ఆందోళనలకు మూల కారణం ఆ బయిజీ పట్టణంలో వున్నట్లు ఒక ఇన్ఫర్మేషన్ మన స్పెషల్ బ్రాంచికి అందింది. అత్యంత ఆధునికమైన మారణాయుధాల్ని, శక్తివంతమైన ప్రేలుడు పదార్థాల్ని బయిజు పట్టణం నుంచి మన దేశంలోకి పంపిస్తున్నారు కొందరు దుర్మార్గులు. అశాంతి ఆందోళనలను మరింతగా రెచ్చగొట్టి అల్లర్లు క్రియేట్ చేయటం వారి ధ్యేయం. అదను చూసుకొని మన ఈశాన్య భూభాగాన్ని ఆక్రమించు కోవటం వారి ఆశయం." షాడో కేసి చూస్తూ స్పెషల్ బ్రాంచి డిప్యూటీ డైరెక్టర్ ప్రశ్నల వెనుక వున్న అర్థాన్ని విశదీకరించారు.

"బయిజూ పట్టణం నుంచే రకరకాల ఆయుధాలు మన దేశంలోకి అడుగు పెడుతున్నాయని తెలిసిన మరుక్షణం, అక్కడికి పంపబడ్డారు ఇద్దరు స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్‌లు..." అంటూ డిప్యూటీ డైరెక్టర్ వైపు చూశారాయన.

తన దగ్గిర వున్న బ్రీఫ్‌కేసును తెరిచి అందులో సంచి ఒక నీలిరంగు ఫోల్డర్‌ని బయట పెట్టాడు అతను. హోమ్ మినిష్టర్‌గారి సెక్రటరీ చేతికి యిచ్చి షాడో దగ్గరికి పంపాడు.

ఈశాన్య రాష్ట్రాలలో అల్లర్లు చేసే అసంతృప్తి వాదుల వివరాలు వున్నాయి ఆ ఫోల్టర్‌లో... వారికి బయిజూ సిటీ నుంచి అందుతున్న ఆయుధాలు ఎటువంటివో తెలియచేసే ఫోటోలు కూడా వున్నాయి.

మూడవ కాగితాన్ని చూసిన మరుక్షణం షాడోకి అవగతం అయింది స్పెషల్ బ్రాంచి - సి.ఐ.బి సహాయాన్ని అపేక్షించడానికి గల కారణం.

అస్సాం రాష్ట్రం నుంచి బయలుదేరాడు స్పెషల్ బ్రాంచి పంపిన మొట్టమొదటి డిటెక్టివ్. మనూ నదిని దాటి బంగ్లాదేశ్ భూభాగంలో అడుగు పెడుతుండగా, ఆ పరిసర ప్రాంతాల్లో నివసించే మౌమౌ జాతీయులకు దొరికి పోయాడు.

తమకు చిక్కిన నాగరికులను ప్రాణాలతో వదిలి పెట్టటం అలవాటు లేని కరకు కసాయి నరరూప రాక్షసులు ఆ మౌమౌలు... అతని తలను నరికి మొండేన్ని మనూ నదిలోకి విసిరి కొట్టారట!

ఆటోమొబైల్ స్పేర్ పార్ట్‌లు అమ్మే బిజినెస్‌మాన్‌లా నటిస్తూ విమానంలో ఢాకా పట్టణానికి పోయి, అక్కడి నుంచి బయిజు సిటీని చేరుకున్నాడట రెండో డిటెక్టివ్...

"బయిజు సిటీ బస్‌స్టేషన్ దగ్గిర సంచరిస్తూ ప్రయాణీకుల జేబులు కొట్టే బషీర్‌భాయ్ అనే జేబుదొంగతో పరిచయం అయింది మనకు కావాల్సిన వస్తువులు ఎక్కడ లభిస్తాయో అతనికి బాగా తెలిసినట్లు అనుమానంగా వున్నది. అతనితో పరిచయాన్ని పెంచుకుని, రెండు మూడు రోజుల్లో అన్ని విషయాలు పూర్తిగా తెలుసుకుంటాను"

పరాయి వ్యక్తులకు అర్థం కాని ఒక స్పెషల్ కోడ్‌లో చిన్న లెటర్‌ని వ్రాసి పోస్ట్ చేశాడతను.

హడావుడిగా వ్రాయబడి వున్నట్లు అగుపిస్తున ఆ లెటర్‌ని నిశితంగా పరిశీలించి మెల్లిగా తల పైకి ఎత్తాడు షాడో.

తన బ్రీఫ్‌కేస్‌ను తెరిచి మరో చిన్న ఫోల్డర్‌ని అతని దగ్గిరికి పంపాడు డిప్యూటీ డైరెక్టర్. అందులో వున్న కాగితాన్ని చూడమన్నట్లు సైగ చేశాడు.

నొసలు ముడివేస్తూ ఆ ఫోల్డర్‌ని ఓపెన్ చేసిన మరుక్షణంలో షాడోకి తగిలింది చిన్న షాక్.

జేబుదొంగ బషీర్‌భాయ్‌తో పరిచయాన్ని పెంచుకుని, తను వచ్చిన పనిని దిగ్విజయంగా పూర్తి చేసుకుని హాయిగా యింటి దారి పట్టవలసిన ఆ రెండో డిటెక్టివ్ ఫోటోలు అతికించబడి వున్నాయి ఆ ఫోల్డర్‌లోని కాగితాల మీద.

పదునైన కత్తులతో తీవ్రంగా హింసలు పెట్టినట్లు వికృతంగా మారిపోయి వున్నది అతని శరీరం... ఆనవాలు పట్టటానికి అమితంగా కష్టపడాల్సి వచ్చే విధంగా డిస్‌ఫిగర్ అయింది అతని వదనం.

అప్పటికి నాలుగు రోజుల క్రితం బయిజూ సిటీ బస్ స్టేషన్ వెనుక పడి వున్నదిట అతని శవం.

ఆ అఘాయిత్యాన్ని జరిపిన వారిని పట్టుకోవటం కోసం పోలీసులు చేస్తున్న ప్రయత్నాలకు సంబంధించిన న్యూస్ పేపర్ కటింగ్స్‌ని కూడా చదివేసరికి బరువుగా తయారయింది షాడో అంతరంగం.

తను ఎవరో, ఎందుకు అక్కడికి అరుగుదెంచాడో ఎవరికీ తెలియకుండా అతి గుంభనంగా ప్రవర్తించాడు ఆ రెండో డిటెక్టివ్. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఉపయోగం ఇసుమంత కూడా లేకపోయింది.

అందుకు కారకులు ఎవరు?

ఆయుధాల్ని స్మగుల్ చేస్తున్న అత్యాశపరులా? వారి జాడలు తనకు తెలుసని అతన్ని నమ్మించిన జేబుదొంగ బషీర్ భాయా??

సమాధానం లభించని ఆ ప్రశ్నలతో సతమతం అవుతూ ఫోల్డర్‌ని క్లోజ్ చేసి తల ఎత్తి చూసిన షాడో భుజం తట్టారు ప్రక్కనే కూర్చుని వున్న కులకర్ణి గారు.

సాటి ఏజెంట్‌కి పట్టిన దుర్గతిని గమనించే సరికి అతనిలోని ఆవేశం కట్టలు తెంచుకోవటానికి సిద్ధంగా వున్నదని ఆయనకు అర్థం అయింది.

ఆ తరువాత జరుగవలసింది ఏమిటో అతనికి చెప్పే అవకాశాన్ని హోమ్ మినిస్టర్ గారికి గాని, గుణశేఖర్‌కి గాని ఇవ్వలేదాయన.

"ఏదో ఒక విధంగా బయిజు సిటీలోకి ఎంటర్ అవ్వాలి నువ్వు... ఆ బషీర్ భాయ్‌ని కలుసుకొని ఆగిపోయిన ఈ ఎస్సైన్‌మెంట్‌ని పూర్తి చేయాలి... స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్ మరణానికి కారకులు ఎవరో తెలుసుకొని అందుకు తగిన ప్రతీకారం చేయాలి... నీ ప్రాణాల మీదికి తెచ్చు కోకుండా పూర్తి చేయగలవా ఈ పనిని??" సిగార్ పొగను గుప్పుగుప్పున వదులుతూ సూటిగా ప్రశ్నించారు.

స్పెషల్ బ్రాంచికి చెందిన డిటెక్టివ్‌లు ఎవరు ఏమైపోయినా సి.ఐ.బి.కి చీమకుట్టినట్లు కూడా బాధ కలుగదని పరిపూర్ణంగా విశ్వసించే వారిలో ఆ డిప్యూటీ డైరెక్టర్ కూడా ఒకడు.

షాడో వదనంలో ప్రతిఫలిస్తున్న భావాల్ని గమనించే సరికి మతిపోయినంత పని అయింది అతనికి. కులకర్ణి గారి మాటల్ని ఆలకించే సరికి కనులు బైర్లు క్రమ్ముతున్న సెన్సేషన్ కూడా కలిగింది.

ఆ ఎస్సైన్‌మెంట్‌ని అప్పగించేందుకు ఎంతో కష్టపడవలసి వస్తుందని అనుకుంటున్న హోమ్ మినిష్టర్‌గారి గుండెల మీద బరువు వెంటనే దిగిపోయినట్లు అయింది.

తను సెక్రటరీని పిలిచి ఒక ఎయిర్‌బేగ్‌ని షాడో దగ్గిర పెట్టించారాయన. "బయిజు సిటీలోకి ఎంటర్ అయ్యేందుకు అవసరమైన ఐడెంటిఫికేషన్ కాగితాలు, ఆ బషీర్ భాయ్‌తో డీలింగ్స్ పెట్టుకోవటానికి కావల్సిన బంగ్లాదేశ్ కరెన్సీ ఈ బేగ్‌లో వున్నాయి... ఉయ్ విష్ యూ ఆల్ ది బెస్ట్ రాజూ..." అంటూ ముందుకు వచ్చి షాడోతో కరచాలనం చేశారు.

డిప్యూటీ డైరెక్టర్ గుణశేఖర్‌కి అభివాదం చేశాడు షాడో... కులకర్ణి గారికి శాల్యూట్ చేశాడు. చేతులు కట్టుకుని దూరంగా నిలబడి వున్న హోమ్ మినిస్టర్‌గారి కొత్త సెక్రటరీ వంక ఓరగా చూస్తూ, ముఖద్వారం వైపు అడుగులు వేశాడు.

# 2

మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్ నగరంలో ఒక సెకండ్ హేండ్ ఆటో రిక్షాని ఖరీదు చేసాడు షాడో.

ఓటి డబ్బాలో గులకరాళ్ళు మ్రోగించినట్లు ఆ వెహికిల్ చేస్తున్న వికృత శబ్దాల్ని ఓపికగా భరిస్తూ, చీకటిమాటున బోర్డర్స్ని దాటి బంగ్లాదేశ్లో ప్రవేశించాడు.

బయిజు సిటీకి నలబై రెండు కిలోమీటర్ల దూరంలో వుంటుంది బావన్ పురా పోలీస్ చెక్ పోస్టు. అక్రమంగా సరిహద్దులు దాటేవారిని,పన్నులు కట్టకుండా రవాణా కాబడే వ్యాపార వస్తువుల్ని పట్టుకోవటానికి ఉద్దేశించబడింది అది.

గుండెలు జలదరించేటట్లు శబ్దాలు చేస్తూ ప్రత్యక్షమైన ఆటోరిక్షాని చూడగానే అదిరిపడి నిఠారుగా నిలుచున్నాడు చెక్ పోస్ట్ ముందు భాగంలో కునికిపాట్లు పడుతున్న కానిస్టేబిల్.

ముఖమంతా నోరు చేసుకుని నవ్వుతూ ఆటోని అతనికి సమీపంలో ఆపాడు షాడో. పాంటు జేబులో నుంచి రెండు కరెన్సీ నోట్లను తీసి, అతనికి అగుపించే విధంగా పట్టుకున్నాడు.

చేతిలోని లాఠీతో ఆటో ముందు భాగం మీద ఠపీఠపీ మని కొడుతూ అర్జంటుగా ఆ నోట్లను అందుకొని పాంటు జేబులో పెట్టేసుకున్నాడా కానిస్టేబిల్.

"ఇంకెప్పుడూ ఇటుగా రాకు. వచ్చావంటే ఖతమై పోతావ్..." క్రూరాతి క్రూరమైన కంఠంతో హెచ్చరిస్తూ, వెళ్లిపొమ్మని సైగ చేశాడు.

అందమైన బంగ్లా భాషలో అతని మంచితనాన్ని ఎంతగానో మెచ్చుకుంటూ ఆటోని ముందుకు దూకించాడు షాడో.

అరకిలో మీటరు దూరంకూడా పూర్తిగా పోకముందే అతని దారికి అడ్డుగా ప్రత్యక్షం అయ్యాయి రెండు పోలీస్ వెహికిల్స్.

వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టిన గుండెల్ని చిక్కబట్టు కోటానికి ప్రయత్నిస్తూ ఆటోని ఒక ప్రక్కగా ఆపి, క్రిందికి దిగాడు షాడో.

"ఎవరు నువ్వు? ఇంత రాత్రివేళ ఎక్కడి నుంచి వస్తున్నావ్?" ఖంగుమంటున్న కంఠంతో ప్రశ్నించాడు, ఒక వెహికిల్ ప్రక్కన నిలుచుని వున్న పోలీస్ ఇన్స్పెక్టర్.

అటువంటి విపత్కర పరిస్థితులు ఎదురవుతాయని ముందుగానే వూహించి వుండటం వల్ల, అందుకు తగిన ఏర్పాట్లతోనే వచ్చాడు షాడో.

పాంటు జేబులో నుంచి తన ఐడెంటిటీని తెలియచేసే కాగితాల్ని అతని ముందుకు జాచాడు.

బయిజు సిటీ బస్‌స్టేషన్ సమీపంలో నివసించే ఒక టైలర్ కుమారుడిగా పరిచయం చేస్తున్నాయి ఆ కాగితాలు. ఆటోని నడుపుకుంటూ బ్రతుకును వెళ్ళదీస్తున్నట్లుగా తెలియచేస్తున్నాయి.

"బావన్ పురా చెక్‌పోస్టు అవతలికి ఒక పాసింజర్‌ని తీసుకుపోవాల్సి వచ్చింది. వెనుక టైరు పంక్చర్ అవటం వల్ల తిరిగి రావటానికి బాగా ఆలస్యం అయింది..." చీకటి వేళలో రోడ్డు ఎక్కినందుకు సంజాయిషీని యిచ్చుకుంటూ వూపిరి బిగపట్టాడు.

స్పెషల్ బ్రాంచిలో పనిచేసే స్పెషలిస్టుల చేత తయారు చేయించబడినందువల్ల, అతని ఐడెంటిఫికేషన్ కాగితాలో తప్పుల్ని పట్టుకోలేక పోయాడు ఆ ఇన్స్‌పెక్టర్.

"దోపిడీ దొంగలు, సంఘ విద్రోహులు తప్ప మరెవ్వరూ సంచరించని ఈ టైమ్‌లో ఇంకెప్పుడూ ప్రయాణం చేయకు... వెళ్ళు..." ఒకటి రెండుసార్లు ఆ కాగితాల్ని, అతని ముఖాన్ని టార్చిలైటు వెలుగులో పరిశీలనగా చూసి పర్మిషన్ యిచ్చాడు.

బిగపట్టి వుంచిన వూపిరి తేలికగా బయటికి వదులుతూ వెనుతిరిగాడు షాడో. తన ఆటో దగ్గిరికి వచ్చి ఇంజన్ స్టార్ట్

చేయబోతుండగా, ఎటువంటి హెచ్చరిక లేకుండా ముఖాన్ని చాటు చేసుకున్నది అతని అదృష్ట దేవత.

బరువైన రైఫిల్‌ని పట్టుకొని ఇన్స్‌పెక్టర్ సాబ్ వెనుక భాగంలో నిలుచుని వున్నాడు కానిస్టేబిల్ ఒకతను.

"మొన్నమొన్నటి వరకూ బయిజు సిటీ బస్‌స్టేషన్ దగ్గిర ట్రాఫిక్ డ్యూటీ చేశాను నేను... ఇతన్ని గాని, ఈ ఆటోని గాని ఎన్నడూ చూసిన జ్ఞాపకం లేదు..." అంటూ బయట పెట్టాడు తన మనసులో మెదిలిన సందేహాన్ని.

చేతిలో వున్న టార్చిలైటును ఆఫ్ చేసి తన వెహికిల్ మీద కూర్చోబోతున్నాడు పోలీస్ ఇన్స్‌పెక్టర్. అదిరిపడి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడతను.

"స్టాప్ దట్ బగ్గర్... స్టాప్ హిమ్.." అని కమాండ్ చేస్తూ ఆటోవైపు జంప్ చేశాడు.

అతని ఆర్డర్‌ని విన్న మరుక్షణం రెండో వెహికిల్‌లో నుంచి క్రిందికి దూకుతున్న మరో పదిమంది పోలీస్ కానిస్టేబిల్స్‌ని గమనించే సరికి దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయింది షాడో గొంతు.

ఫాంటు జేబులో పెట్టుకున్న కాగితాల్ని బయటికి తీసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేయటం అనవసరమని అర్థం అయింది అతనికి.

అనుమానం రానంత వరకే అమోఘంగా పనిచేస్తాయి అవి. అనుమానం నిండిన కనులతో పట్టి పట్టి - చూస్తే ఫోర్జరీలని వెంటనే తెలిసిపోతుంది.

అనుకోని విధంగా ఆఖరి క్షణంలో నోరు తెరిచిన ఆ కానిస్టేబిల్ ముఖం పగిలిపోయేటట్లు కొడితే ఎలా వుంటుందో నని ఆలోచిస్తూ, ఆటోలో నుంచి అవతలి వైపుకు జంప్ చేశాడతను.

"కాచ్ హిమ్... కాచ్ దట్ బాస్టర్డ్... కాచ్ హిమ్..." ఖంగు ఖంగుమంటున్న కంఠంతో కానిస్టేబిల్స్ అందర్నీ హెచ్చరిస్తూ, తన పాంటు బెల్టుకు వ్రేలాడుతున్న రివాల్వర్‌ని అందుకున్నాడు ఇన్‌స్పెక్టర్ సాట్.

అడ్డుగా అగుపించిన ఒక బండరాయి మీదినించి ఎగిరి, నాలుగు అడుగుల లోతున్న గోతిలో పడ్డాడు షాడో.

గుండెలు జలదరించేలా శబ్దం చేస్తూ, ఆ గోతి మీదినించి దూసుకుపోయాయి ఇన్‌స్పెక్టర్ సాట్ పంపించిన బుల్లెట్లు.

"చంపేయండి... ప్రాణాలతో పట్టుకోవటం సాధ్యపడకపోతే రైఫిల్స్‌తో కాల్చి చంపేయండి..." జీరపడిన కంఠంతో మరింత బిగ్గరగా కానిస్టేబిల్స్‌ని

హెచ్చరించాడతను... రోడ్డు చివరి భాగంలోకి వచ్చి సరయిన పొజిషన్ తీసుకున్నాడు.

రైఫిల్ బుల్లెట్లు తన మీదికి వచ్చి తన ప్రాణాలను బలి తీసుకునేదాకా గోతిలోనే కాలక్షేపం చేయదలుచుకోలేదు షాడో.

పంజాబ్ మెయిల్ మాదిరి వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ గోతి అడుగుభాగాన్ని తడిమాడు. చేతులకు అందిన రెండు లావుపాటి పలుకురాళ్ళను క్షణం కూడా ఆలస్యం చేయకుండా విసిరేశాడు ఇన్‌స్పెక్టర్ సాబ్ వైపు.

"కాల్చేయండి... గుండెలు తీసిన బంటు మాదిరి మనల్ని మోసం చేయటానికి ప్రయత్నించిన ఆ బద్మాష్‌ని నిలువునా కాల్చి అవతల పారేయండి..." క్షణక్షణానికి అధికమై పోతున్న ఎగ్జయిట్‌మెంట్‌ని అదుపులో పెట్టుకోవటం చేతకాకపోయే సరికి చెవులు చిల్లులుపడే శృతిలో అరిచాడు ఇన్‌స్పెక్టర్.

అరుస్తూ ఉండగానే అతివేగంగా పోయి అతని చేతిలోని రివాల్వర్‌కి తగిలింది ఒక రాయి. రాక్షస హస్తం ఏదో లాగిపెట్టి కొట్టినట్లు అమాంతంగా గాలిలోకి లేచి ఎటో వెళ్ళిపోయిందా మారణాయుధం.

అదిరిపడి అది వెళ్ళిన దిశలోకి చూడబోతున్న ఇన్‌స్పెక్టర్ సాబ్ ముఖానికి తగిలింది గింగిరాలు తిరుగుతూ వచ్చిన రెండవ రాయి.

"చచ్చిపోయాను... ఆ సువ్వర్‌కీ బచ్చే నన్ను చంపేశాడు..." గొంతు చినిగిపోయేటట్లు గావురుమని అరిచాడతను. ముఖాన్ని చేతులతో కప్పుకుంటూ ముందుకి వాలిపోయాడు.

గోతివైపు జంప్ చేసే ఆలోచనను వెంటనే విరమించుకుని, అతని దగ్గరికి పరిగెత్తారు కానిస్టేబిల్స్ అందరూ...

జారిపోయిన ధైర్యాలను కూడగట్టుకుని వారందరూ - రెట్టించిన పట్టుదలతో తన మీదికి వచ్చి పడకముందే, పిక్కబలం చూపించటం చాలా మంచిదని తెలిసిపోయింది షాడోకి.

నీడ మాదిరి నిశ్శబ్దంగా పైకి లేచాడతను గోతిలో నుంచి... రోడ్డు మీదికి చేరుకునే ఆలోచనకు స్వస్తి చెప్పి అటునుంచి అటే పొదలకు అడ్డం పడ్డాడు.

## 3

"హెచ్చరిక... బయిజు పట్టణ వాసులందరికీ పోలీసువారి హెచ్చరిక..." చెవులు చిల్లులు పడేలా ఎనౌన్స్ చేస్తూ బస్ స్టేషన్ దగ్గిరికి దూసుకు వచ్చింది ఒక పోలీస్ వాన్.

ఢాకా సిటీ వరకూ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ బస్ కోసం వెయిట్ చేస్తున్న అనేకమంది ప్రయాణీకులకు కాస్తంత దగ్గిరిగా నిలబడి వున్నాడు బషీర్‌భాయ్.

ఫ్లాట్‌ఫాం దగ్గిరికి బస్ వచ్చిన మరుక్షణం ఒకరికంటే ఒకరు ముందుగా ఎక్కి కూర్చోవటానికి తొక్కిసలాడుకుంటారు వారందరూ. ఆ సందడిలో తన పని తను పూర్తి చేసుకోవాలని అతని ఉద్దేశ్యం.

సన్నగా, పొడుగ్గా , గాలి గట్టిగా వీస్తే క్రిందపడిపోయేటట్లున్న ఒక పర్సనాలిటీని సెలక్ట్ చేసుకున్నాడతను. దృష్టినంతా అతని పాంటు జేబుమీద కేంద్రీకరించి, మెల్లి మెల్లిగా ముందుకు జరగబోతుండగా - పానకంలో పుడక మాదిరి వినవచ్చింది ఆ ఎనౌన్స్‌మెంట్.

"రాత్రి పన్నెండు గంటల సమయంలో బావన్‌పురా చెక్‌పోస్టు దగ్గిర నైట్ బీట్‌కి వెళ్ళిన మన పోలీస్ బలగానికి కనిపించారట పదిమంది బందిపోటు దొంగలు. పెద్ద పెద్ద స్టెన్‌గన్లతో కాల్పులు జరిపారట..." తన ప్రక్కన వున్న పెద్దమనిషి ఒకతనికి చిత్ర విచిత్రంగా చెపుతూ గుంపులో నుంచి అవతలికి జరిగాడు సన్నగా, పొడుగ్గా, గాలి గట్టిగా వీస్తే క్రింద పడిపోయేటట్లున్న ప్రయాణీకుడు. ఫ్లాట్‌ఫాం చివరి భాగంలోకి పోయి రోడ్డు మీది నించి వినవస్తున్న ఎనౌన్స్‌మెంట్‌ని శ్రద్ధగా ఆలకించటం మొదలుపెట్టాడు.

చేతికి అందిన అవకాశాన్ని చిటికెలో సర్వనాశనం చేసేసిన బయిజూ సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని ఇష్టం వచ్చినట్లు తిట్టుకుంటూ, తను కూడా ఇవతలికి జరిగాడు బషీర్‌భాయ్.

ఉన్నట్లుండి రోడ్డును వదిలిపెట్టి బస్‌స్టేషన్‌లోకి ప్రవేశించింది. పోలీస్ వాన్. "ప్రయాణీకులందరూ అప్రమత్తంగా వుండండి... చీకటి పడిన తరువాత వంటరిగా ప్రమాణాలు చేయకండి... ఆరడుగుల ఎత్తున్న చామనఛాయ యువకుడు ఎవరైనా అనుమానాస్పద పరిస్థితుల్లో మీకు తారసపడితే వెంటనే పోలీసులకు తెలియచేయండి..."

సన్నపాటి మనిషి అంతకు ముందు వాక్రుచ్చినట్లు గుంపుగా పోలీసులకు కనిపించిన బందిపోటు దొంగల్ని గురించి చెప్పకుండా, ఒకే ఒక మనిషి గురించి అందరికీ తెలియచేస్తూ మెల్లిగా బస్‌స్టేషన్ చివరి భాగంలోకి బయలుదేరిందా వాన్.

పోలీసుల్ని చూసినా, పోలీస్ వాన్లను చూసినా గోడల చాటునో, బస్‌స్టేషన్‌లో వుండే కాంక్రీట్ స్తంభాల చాటునో తల దాచుకోవటం, అలవాటు బషీర్ భాయ్‌కి. ప్రమాదం తప్పిపోయిందని గట్టిగా నిశ్చయం అయిన తరువాత గాని ఇవతలకు వచ్చి నిలబడ్డాడు అతను.

లావుగా , పెద్ద పెద్ద నోట్ల పాతికలతో నిండుగా వున్న లెదర్ పర్సును పాంటు జేబులో పెట్టుకుని, నిముషానికి నాలుగుసార్లు తడిమి

చూసుకుంటున్న సన్నపాటి పర్సనాలిటీని వదిలిపెట్టటం ఇష్టంలేక, ఎప్పటి మాదిరిగా అవతలికి వెళ్ళిపోలేదతను. తన ప్రొఫెషన్‌లో ఏమాత్రం ఏమరిపాటుగా వున్నా కొంపలు నిలువునా అంటుకుపోతాయని తెలిసికూడా, నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు వెంటనే పే చేశాడతను పెనాల్టీని.

తమ చేతికి దొరికినట్లే దొరికి చేజారిపోయిన ఆటోరిక్షా యువకుడి కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని గాలిస్తున్నాడు - పలుకురాయి దెబ్బకు ముక్కు ముగం ఏకమై పోయిన ఇన్స్పెక్టర్ సాట్.

ముళ్ళ పొదల మధ్యలో నుంచి అతను బయిజు సిటీలోకే రావాలని, ఏదో ఒక విధంగా తన చేతులకు చిక్కాలని అల్లాని ప్రార్థిస్తూ, అటూ ఇటూ చూస్తుండగా అగుపించాడు, వీరాధివీరుడి మాదిరి ప్లాట్‌ఫాం మీద నిలబడి వున్న బషీర్‌భాయ్.

"పట్టుకోండి ఆ బద్మాష్‌ని..." ఉరుములాంటి కంఠంతో వాన్‌లో వున్న కానిస్టేబిల్స్‌కి ఆర్డర్ యిచ్చాడతను.

"కాళ్ళు చేతుల్ని విరిచేసి లాక్కురండి.. నడుములు విరగగొట్టేయండి" అంటూ తను కూడా క్రిందికి దూకాడు.

ముందుకు ముందుకు పోతున్న వాన్ ఒక్కసారిగా ఆగిపోయేసరికి అదిరిపడ్డాడు బషీర్‌భాయ్... పుట్టలో నుంచి వెలువడుతున్న చీమల

మాదిరి బిలబిల లాడుతూ బయటికి వచ్చేస్తున్న కానిస్టేబిల్స్‌ని గమనించేసరికి చెమటలు పట్టేశాయి అతని అరిచేతులు.

రెండో ఆలోచన లేకుండా వెనక్కి దూకాడతను. శరీరంలో వున్న శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకుంటూ పరుగు ప్రారంభించాడు.

"పట్టుకోండి... పారిపోతున్న ఆ పాకెట్ మార్‌ని గట్టిగా పట్టుకోండి..." గొంతులు చినిగిపోయేటట్లు అరిచారు వాన్‌లో నుంచి క్రిందికి దూకిన పోలీసులు. లాటీలను బిగించి పట్టుకుంటూ తాము కూడా రన్నింగ్ ప్రారంభించారు.

వారి హెచ్చరికల్ని ఆలకించిన కుర్రాళ్ళు కొంతమంది రెచ్చిపోయి రన్నింగ్ రేస్‌లో పాల్గొంటూ వుండటాన్ని కను చివరలనుంచి గమనించుకుంటూ, మెయిన్ రోడ్డు మీదికి పోయాడు బషీర్‌భాయ్.

"ఆగు... ఆగరా బద్మాష్... ఆగు" అని అరుస్తూ తన దారికి అడ్డు రాబోయిన అరడజనుమంది పౌరులకు ఆఖరి క్షణంలో నీట్‌గా స్లిప్ ఇచ్చి దగ్గిర్లో వున్న ఒక సందులోకి ఎంటర్ అయ్యాడు.

కంటిముందు కనిపించకుండా ఎటో ఒకవైపు పారిపోతే పోలీసుల పట్టుదల సన్నగిల్లి పోతుందనీ, కాస్సేపు అటూ ఇటూ చక్కర్లు కొట్టి వారి దారిన వాళ్ళు వెళ్ళిపోతారని అనుకున్న అతని ఊహ తప్పని వెంటనే తేలిపోయింది.

ఎవరో ఒకరిని పట్టుకుని మక్కెలు విరగదీయకపోతే తన ముక్కుకు తగిలిన గాయం తగ్గిపోదని నిర్ణయించుకున్నాడు కాబోలు - గొంతు చించుకుంటూ అగ్గిరాముడిలా గంతులు వేశాడు ఇన్స్పెక్టర్.

"ఐ వాన్ట్ హిమ్ అరెస్టెడ్ ఇమ్మీడియెట్లీ... వాడిని పట్టుకోకుండా వట్టి చేతులతో వెనక్కి వచ్చిన వాళ్ల మీద డిసిప్లినరీ యాక్షన్ తీసుకోవటం గారెంటీ... పొండి... సందులోకి పొండి..." అంటూ హడల కొట్టేశాడు కానిస్టేబిల్స్ అందర్నీ.

ఎదురుపడిన పౌరులందర్నీ రెచ్చగొట్టి తమతో కలుపుకుంటూ సందులోకి వచ్చేస్తున్న కానిస్టేబిల్స్‌ని గమనించే సరికి పై ప్రాణాలు పైనే పోయినంత పని అయింది బషీర్ భాయ్‌కి.

ఇంకా ఇంకా పెంచేశాడతను వేగాన్ని, ఆరోజు నిద్ర లేవగానే ఎవరి ముఖం చూడటం జరిగిందో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తుండగా, ఎడమ చేతివైపున అగుపించిందొక ఖాళీ స్థలం.

ఆరడుగుల ఎత్తున ఒక ప్రహరీని అవలీలగా అధిగమించి, ఒక మూలగా వున్న ముళ్ళ పొద చాటుకు పరిగెత్తాడతను.

మోకాళ్ళ మీద తలను ఆనించుకొని ముడుచుకు కూర్చోబోతుండగా కనిపించాడతనికి , తనకంటే లాఘవంగా ప్రహరీని దాటి తన ముందుకు వస్తున్న యువకుడు ఒకతను.

నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా చటుక్కున పైకి లేచి మళ్ళీ పాదాలకు బుద్ధి చెప్పటం ఆరోగ్యానికి ఎంతో క్షేమకరం అని ఎంతగా అనిపిస్తున్నా, ఆయాసం అధికం అయిపోవటంవల్ల ఆ పని చేయలేకపోయాడతను.

"నేను... నేను ఎవరి జే... జేబులోనూ చేయి పెట్టలేదు... అ... అన్యాయంగా తరుముకు వస్తున్నారు..." నీటితో నిండిపోబోతున్న కనుల్ని షర్టు భుజానికి తుడుచుకుంటూ దీనంగా అన్నాడు.

అతను ఊహించినట్లు పిడికిళ్ళు బిగిస్తూ మీది మీదికి రాలేదా యువకుడు. చేతుల్ని నోటి దగ్గరికి చేర్చి గొంతు చినిగిపోయేటట్లు కేకలు పెట్టలేదు.

"ఇప్పుడు పట్టుబడ్డావంటే సున్నంలోకి కూడా మిగలకుండా విరిగిపోతాయి నీ ఎముకలు... గొంతు పిసికి చంపేసేటంత కచ్చ మీద వున్నారు పోలీసులు..." అంటూ చుట్టూ చూశాడు.

బషీర్ భాయ్ తల దాచుకోబోయిన పొదకు పది అడుగుల దూరంలో వున్న ఒక పాడుబడిన బావిని చూడగానే అతని పెదవుల మీద ప్రత్యక్షం అయింది ఒక చిరునవ్వు.

"త్వరగా రావాలి... త్వరగా..." అని హెచ్చరిస్తూ అతని చేయి పట్టుకుని అటుకేసి లాక్కుపోయాడు.

అతని చేతిని విదిలించుకొని అవతలికి జంప్ చేయాలని ఎంతగా అనిపిస్తున్నా ఆ పని చేయలేక పోయాడు బషీర్ భాయ్.

బారెడు బారెడు పొడుగుండే పిచ్చి చెట్లతో నిండి వున్న ఆ బావిలోకి అతన్ని నెట్టి చేతులు దులుపుకున్నాడు ఆ యువకుడు.

"రండిరోయ్ రండి... రండి... నన్ను చూడగానే గోడ దూకి దూరంగా పారిపోతున్నాడు... త్వరగా రండి..." అంటూ కేకలు పెట్టాడు.

యమభటుల మాదిరి ప్రహరీని దాటి ఖాళీ స్థలంలోకి వచ్చేశారు పోలీస్ కానిస్టేబిల్స్. లాటీలను గాలిలో వూపుతూ ఆ యువకుడు చూపించిన దిశలోకి పరుగులు తీశారు తమతో వచ్చిన పౌరులందర్నీ వెంట బెట్టుకొని.

పదినిముషాలు వెయిట్ చేసి, మెల్లిగా బావిలోకి తొంగి చూశాడా యువకుడు.

"నిన్ను తరుముకు వచ్చిన ప్రమాదం తొలగిపోయింది. ఇక పైకి రావచ్చు." అంటూ చేతుల్ని జాచాడు.

విపరీతమైన దాహంతో ఎండుకు పోయినట్లు తయారైన పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ ఆ చేతుల్ని అందుకుని పైకి వచ్చాడు బషీర్ భాయ్.

"సరయిన సమయంలో దే... దేవుడిలా వచ్చి నా ప్రా...ప్రాణాల్ని కాపాడావ్... నీ ఋణం ఎలా తీ... తీర్చుకోవాలో అర్థం కా... కావటం లేదు..." తడబడుతున్న కంఠంతో కృతజ్ఞతలు తెలియజేసుకోబోయాడు.

"ఇరవై రోజుల క్రితం ఈ సిటీలోకి వచ్చి నీతో పరిచయం పెంచుకున్నాడు నా స్నేహితుడు ఒకతను..." అంటూ పాంటు జేబులో నుంచి ఒక ఫోటోని తీసి అతనికి చూపించాడు ఆ యువకుడు.

కనులు చిట్లిస్తూ చూశాడు బషీర్‌భాయ్... కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడ్డాడు.

అతని రియాక్షన్స్ ఎలా వుంటాయో తనకు ముందుగానే తెలిసినట్లు చటుక్కున చేతిని జాచి అతని షర్టును గట్టిగా పట్టుకున్నాడు ఆ యువకుడు. పట్టుకోక పోయినట్లయితే, వింటి నుంచి వెలువడిన బాణంలా ప్రహరీ గోడ వైపు పరుగుతీసి వుండేవాడు బషీర్‌భాయ్. నాలుగే నాలుగు క్షణాల్లో కంటికి కనిపించకుండా మటుమాయం అయిపోయేవాడు.

"దారుణమైన దెబ్బలు తగలటం వల్ల పై లోకాలకు ఎగిరి పోయినా నా స్నేహితుడి మరణానికి ప్రతీకారం చేయటానికి రాలేదు నేను... నీ ద్వారా అతనికి అందిన ఇన్ఫర్మేషన్ ఏమిటో నేను కూడా తెలుసుకోవటానికి వచ్చాను.." చేతిలోని ఫోటోని చింపి బావిలోకి విసిరేస్తూ కామ్‌గా ఎనౌన్స్ చేశాడా యువకుడు.

"నీ మా... మాటలు నాకు స... సరిగ్గా అర్థం కావటంలేదు... నాకు ఏ... ఏమీ తెలియదు..." విపరీతమైన భయం... మూలకంగా నట్లు కొడుతూ అన్నాడు బషీర్ భాయ్.

"రండిరోయ్ రండి... రండి... మీకు కావల్సిన పాకెట్‌మార్ ఇక్కడే వున్నాడు... త్వరగా వచ్చేయండి... రండి...రండి" కానిస్టేబిల్స్ పరిగెత్తిన దిశ వైపు తిరుగుతూ పెద్దగా అరవటానికి నోరు తెరిచాడు ఆ యువకుడు.

అదిరిపడి అతని చేతుల్ని పట్టుకున్నాడు బషీర్‌భాయ్.

"ఆ నరరూప రాక్షసుల్నించి కాపాడినట్లే కాపాడి తిరిగి వాళ్ళ చేతికి అప్పగిస్తావా? ఇది నీకు న్యాయంగా వున్నదా?" బిగ్గరగా ఏడవటానికి రెడీ అవుతున్నట్లు ముఖం పెడుతూ దీనాతి దీనంగా అడిగాడు.

"భయంకరమైన మారణాయుధాలు, దారుణమైన ప్రేలుడు పదార్థాలు ఈ పట్టణంలో నుంచి బయటికి పంపబడుతున్నాయి... అవి ఎక్కడ దాచబడి వున్నాయో, ఆ పని చేస్తోంది ఎవరో నీకు తెలుసు..." అతని మాటలు అసలు తన చెవులకు చేరనట్లు నిర్వికారంగా అంటూ, పాంటు జేబులో నుంచి సిగరెట్ పాకెట్‌ని బయటికి తీశాడు ఆ యువకుడు.

చలి వేస్తున్నట్లుగా కంపిస్తున్న చేతిని జాచి ఒక సిగరెట్‌ని తీసుకున్నాడు బషీర్‌భాయ్.

"వద్దు వద్దని ఎంత చెప్పినా వినకుండా మొండిగా ముందుకు పోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడు నీ దోస్త్. అతని చర్యల మూలకంగా షబ్బాపాషాకి అనుమానం వచ్చింది... అతనికి ఆ ఇన్ఫర్మేషన్ ఇచ్చింది ఎవరో తెలుసుకోమని జనాల్ని పంపాడు... ఏ క్షణంలో నా గుట్టురట్టు అవుతుందో తెలియక భయంతో చచ్చిపోతున్నాను..." సిగరెట్ పొగను గుప్పుగుప్పున బయటికి వదులుతూ గబగబా అన్నాడు.

"ఆయుధాల్ని, ప్రేలుడు పదార్థాల్ని స్టోర్ చేసి బయటికి పంపుతున్న వ్యక్తి పేరు షబ్బాపాషానా?" తను కూడా సిగరెట్‌ని వెలిగించుకుంటూ కాజువల్‌గా అడిగాడు ఆ యువకుడు.

అవునన్నట్లు తల వూపాడు బషీర్‌భాయ్.

"అతని అడ్రసు చెప్పు... ఆయుధాలు ఎక్కడ వుంటాయో తెలియ చేయి..." అంటూ పాంటు జేబులో వున్న వాలెట్‌ని బయటికి తీసి అందులో నుంచి పది కరెన్సీ నోట్లను ముందుకు జాచాడు ఆయువకుడు.

కంటికి కనిపించనంతవేగంతో చేతిని జాచి ఆ నోట్లను తనదుస్తుల్లో దాచేసుకున్నాడు బషీర్‌భాయ్.

"ఇక్కడ నిలబడి కాలక్షేపం చేస్తుంటే... నిజంగానే వెనక్కి వచ్చి నా అంతు చూసి తీరతారు పోలీస్ నాయాళ్ళు. చీకటి పడిన తర్వాత ఘరూకీ పార్కు దగ్గిరికి రా... అన్ని విషయాలు వివరంగా చెపుతాను. వీలయితే

షబ్బూపాషాని కూడా చూపిస్తాను..." అంటూ పిచ్చిక మాదిరి ప్రహరీ గోడవైపు పరుగు తీశాడు.

అంతకు ముందు మాదిరి అతన్ని ఆపే ప్రయత్నం చేయలేదా యువకుడు.

"నన్ను మోసం చేయటానికి ప్రయత్నించకు భాయీ... చీకటి పడిన తర్వాత నువ్వు ఫరూకీపార్కు దగ్గిర కనిపించక పోతే, నా స్నేహితుడికి పట్టిన గతిసే నేను నీకు పట్టిస్తాను..." నడుము మీద చేతులు వేసుకుంటూ హెచ్చరించాడు.

ప్రహరీ మీదినుంచి అవతలకు దూకుతూ తలవూపాడు బషీర్‌భాయ్... అరక్షణంలో ఆ చుట్టుపట్ల ఎక్కడా కనిపించకుండా అదృశ్యం అయ్యాడు.

# 4

"రండి సాబ్ - లోపలికి రండి... చూడటానికి చాలా చిన్నగా వున్నా రుచికరమైన పదార్థాలను తయారు చేయటంలో నా హోటల్‌ని మించిన హోటల్ ఈ బయిజు పట్టణంలో మరొకటి లేదు... లోపలికి విచ్చేసి మీకు కావల్సినవి ఆర్డర్ యిచ్చుకోండి..."

కాష్ కౌంటర్‌ని వదిలి హోటల్ మెట్ల మీద, నిలబడుతూ, పెద్ద కంఠంతో షాడోని లోపలికి ఆహ్వానించాడు సుక్కూర్ హోటల్ యజమాని.

చేతిలో వున్న సిగరెట్‌ని అవతలకు విసిరేసి లోపలికి పోయాడు షాడో. ఎండిపోవటానికి సిద్ధంగా వున్న రొట్టెలు నాలుగింటిని ఆరగించాడు. కప్పు మీద కప్పు మూడు కప్పుల చాయ్‌ని తాగి బిల్లు చెల్లించాడు.

"మిమ్మల్ని ఈ చుట్టుపట్ల ఎక్కడా చూసిన జ్ఞాపకం లేదు. కొత్తగా వచ్చారా?" మెట్ల దాకా వచ్చి సాదరంగా సాగనంపుతూ వున్నట్లుండి అడిగాడు హోటల్ యజమాని.

ఉలికిపాటును నేర్పుగా కప్పి పెట్టుకుంటూ, కనపడీ కనపడనట్లుండే నవ్వొకటి నవ్వాడు షాడో. అక్కడే మరి కొద్దిసేపు నిలబడితే, ఇబ్బందిని కలిగించే ప్రశ్నలు మరి కొన్నింటిని వినాల్సి వస్తుందన్న భయంతో గబగబా ముందుకు అడుగులు వేశాడు.

చీకట్లు దట్టం అవుతున్న సమయంలో అతనికి అగుపించింది మెయింటెనెన్స్ సరిగా లేకపోవటం వల్ల చిత్త వత్తుగా పెరిగిన పొదలతో... విరిగి పడిపోయిన ప్రహరీ గోడలతో ఖబర్‌స్థాన్ మాదిరిగా తయారై వున్న ఫరూకీ పార్క్.

విరిగిపోవటానికి సిద్ధంగా వున్న మెయిన్ గేటును దాటి లోపలికి పోవాలని నిశ్చయించుకున్నాడతను. శుభ్రంగా వున్న బెంచీని చూసుకుని బషీర్‌భాయ్ కోసం వెయిట్ చేయాలని అనుకున్నాడు.

పది అడుగులు కూడా వేయక ముందే, గేటు వెనుక భాగంలో వున్న పొదల చాటు నుంచి అతని దారికి అడ్డుగా ప్రత్యక్షం అయ్యారు ఇద్దరు దృఢకాయులు.

"చీకటి పడిన తర్వాత ఇక్కడ నీకు పనేముంది బే? ఇంటికి పోయి హాయిగా నిద్రపో... వెళ్లు... వెళ్లు..." జబర్దస్తీగా అంటూ అతని గుండెలమీద చేయి వేసి బలంగా వెనక్కి నెట్టాడు వారిలో ఒకతను.

ఆ చేతిని అలాగే పట్టుకొని మధ్యకు విరిచేయాలన్నంత కోపం షాడోని ఆవరించుకున్నది.

"నన్ను అడ్డుకోవటానికి ఎవడివి బే? పిచ్చి మాటలు మాట్లాడితే రాలిపోతాయి నీ పళ్ళు..." అని అనబోతూ, ఆఖరి క్షణంలో అతివేగంగా మ్రింగేశాడు ఆ మాటల్ని.

"గుర్రుగా చూస్తున్నా వేమిటి బే? చెప్పిన మాటలు వినబడటం లేదా? చెవుడు ఏమైనా వున్నదా నీకు??" మరింత కరుకుగా అడుగుతూ ఇంకోసారి వెనక్కి నెట్టటానికి చేతిని ఎత్తాడా దృఢకాయుడు.

తన ముఖాన్ని మరింత పరిశీలనగా చూసే అవకాశం అతనికి ఇవ్వకుండా, చటుక్కున వెనక్కి గెంతాడు షాడో. భయంతో వణికిపోతున్న వాడి మాదిరి ఫోజు పెడుతూ వచ్చిన దారినే సుక్కూర్ హోటల్ దగ్గిరికి పరుగు తీశాడు.

"మా హోటల్లో ఒకసారి చాయ్ తాగితే, రెండో హోటల్‌కి వెళ్ళలేరని నాకు ముందుగానే తెలుసు. మా పని వాళ్ళని... హెచ్చరించి ఇంకో రెండు కప్పులు తయారు చేయించమంటారా?"

ముఖమంతా నోరు చేసుకుని నవ్వుతూ అతన్ని అడిగాడు హోటల్ యజమాని.

నిర్మోహమాటంగా తలవూపి, లోపలికి పోయాడు షాడో. రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగి, వెయిటర్ తీసుకు వచ్చిన చాయ్ కప్పులు రెండింటినీ ఖాళీ చేసిన తర్వాత మెల్లిగా సిగరెట్ వెలిగించుకున్నాడు.

అప్పటికి కాస్తంతగా ఉపశమించింది అతని అంతరంగాన్ని అల్లకల్లోల పరుస్తున్న అలజడి. సక్రమంగా సజావుగా సాగటం మొదలు పెట్టాయి ఆలోచనలు.

మలయా ద్వీపకల్పంలోని కౌలాలంపూర్ సిటీని బేస్‌గా చేసుకుని కిల్లర్స్ గాంగ్ కొనసాగించే కార్యక్రమాలను సూపర్‌వైజ్ చేస్తూ వుంటాడు టైగర్ జాన్.

రాత్రి పగలు తేడా లేకుండా ఎప్పుడు చూసినా అతని వెనకాలే అగుపిస్తాడు దౌలత్‌ఖాన్. అతనితో పాటే తిరుగుతూ వుంటాడు.

దొంగ వ్యాపారాల దగ్గర్నించి దోపిడీల వరకూ,బ్లాక్‌మెయిలింగ్ మొదలుకుని హత్యలు కావించటం వరకూ, దౌలత్ ఖాన్ చేయని - చేయలేని పని అంటూ ఏమీ లేదని పెద్ద పేరు.

కౌలాలంపూర్ చుట్టుపట్ల సంచరిస్తూ వుండవలసిన ఆ పెద్ద మనిషి, మారుమూల పట్టణమైన బయిజాలోకి ఎందుకు వచ్చాడు?

చెత్తాచెదారంతో నిండి వున్న ఫరూకీ పార్కు దగ్గిర ఎందుకు నిలబడి వున్నాడు??

"వేడివేడిగా నాలుగు పరోటాలను కాల్పిస్తాను... ఆరగిస్తారా?" అంటూ మెట్లమీద వుండవలసిన హోటల్ యజమాని లోపలికి వచ్చి తనను పలకరించటంతో ఒక్కసారిగా తన ఆలోచనల నుంచి బయటపడ్డాడు షాడో.

చేతివేళ్లను చురుక్కు మనిపించటానికి సిద్ధంగా వున్న సిగరెట్‌ని క్రిందికి వదిలేసి, మరో ఫ్రెష్ సిగరెట్‌ని వెలిగించుకుంటూ తల అడ్డం తిప్పాడు.

చీకటిపడే సమయంలో ఠంచన్‌గా పార్కు దగ్గిరికి వస్తానని చెప్పిన బషీర్‌భాయ్‌ని గురించి మరిచిపోయాడతను. కనిపించకూడని ప్రదేశంలో

కిల్లర్స్ గాంగ్‌కి సంబంధించిన వ్యక్తి అగుపించటానికి గల కారణాన్ని తెలుసుకు తీరాలని నిర్ణయించుకుంటూ, ఒక కరెన్సీ నోటును హోటల్ యజమానికి అందించాడు.

ఆనందంగా తీసుకొని కేష్ బాక్స్‌లో దాచేసుకున్నాడా పెద్ద మనిషి.

"మీ వంటి కస్టమర్స్‌ని చూస్తే ఎందుకనో ఉప్పొంగి పోతుంది నా మనస్సు. మీ పని ఏదో పూర్తి చేసుకొని వెంటనే వచ్చేయండి. ఇంకో రెండు చాయ్‌లను సిద్ధం చేయించి వుంచుతాను..." గారపట్టిన దంతాలన్ని బయటికి కనిపించేటట్లు నవ్వుతూ అన్నాడు.

చిల్లర కోసం డిమాండ్ చేసి, అతని ఆర్గ్యుమెంట్ పెట్టుకోవటం యిష్టం లేక కామ్‌గా రోడ్డు మీదికి వచ్చేశాడు షాడో.

అంతకు ముందు మాదిరి గుడ్డిగా మెయిన్ గేటు దగ్గిరికి పోలేదతను. నీడలలో అడుగులు వేస్తూ ప్రక్క భాగంలోకి పోయాడు.

కొండల మాదిరి పేరుకుపోయి వున్న చెత్త గుట్టల నడుమ హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నది కాబోలు ఒక శునకం - అతని అలికిడి ఆలకించిన మరుక్షణం చెవులు చిల్లులు పడేలా అరుస్తూ పైకి లేచింది.

అదిరిపడి ప్రక్కకు జంప్ చేశాడు షాడో... అప్పటికీ అది మొరగటాన్ని విరమించుకోక పోయేసరికి బలంగా విసిరాడు ఎడమ పాదాన్ని.

సూటిగాపోయి ఆ శునకంపై నడుముకు కనెక్ట్ అయింది అది... ఫుట్‌బాల్ మాదిరి గాలిలోకి లేచిందా గ్రామసింహం. గింగిరాలు తిరుగుతూ అల్లంత దూరంలో పడిపోయింది. పడిన వెంటనే పైకి లేచి మెయిన్ రోడ్డు మీదికి పారిపోయింది.

అక్కడితో తనను చుట్టుముట్టబోయిన ప్రమాదం తప్పి పోయినట్లు భావించలేదు షాడో. అంతకు ముందు వరకూ శునకం పడుకొని వున్న గోతిని,మరింత పెద్దదిగా చేశాడు. రబ్బర్ బంతిలా వుండ చుట్టుకుని అందులో తల దాచుకున్నాడు.

పది క్షణాలు కూడా గడవక ముందే యదార్థమైంది అతని అనుమానం.

మెయిన్ గేటు దగ్గిర నిలబడి పార్క్ ముందు భాగాన్ని కాపలా కాయటంతో తృప్తిపడలేదు దౌలత్ ఖాన్. వెనుక భాగంలో కూడా నిలబెట్టి వుంచాడు ఇద్దరు వ్యక్తుల్ని.

లావుపాటి కర్రల్ని రెండింటిని పట్టుకుని, నేలను తడుతు పరుగులాంటి నడకతో చెత్తగుట్టల దగ్గిరికి వచ్చేశారా పెద్ద మనుష్యులు.

"ఎవరది? ఎవరిక్కడ గొడవ చేస్తోంది?" కరుకుగా వున్న కంఠంతో వికృతంగా అడుగుతూ రెండు నిముషాల పాటు అక్కడే చక్కర్లు కొట్టాడు వారిలో ఒకతను.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, మరింతగా ముడుచుకు పోయాడు షాడో... తల మోకాళ్ళ మధ్యలో దాచుకున్నాడు.

"గాలికి కదిలిన గుడ్డ ముక్కల్నో గడ్డి పరకల్నో, చూసి బెదిరి పోయి వుంటుందా శునకం. దౌలత్ ఖాన్ ఇక్కడ వుండగా ఈ పరిసరాల్లోకి వచ్చే ధైర్యం ఎవరికీ వుండదు. పద పోదాం... రెండు నిముషాల తరువాత ఉన్నట్లుండి ఒక అభిప్రాయాన్ని వెల్లడించాడు రెండో వ్యక్తి.

అతనితో ఏకీభవిస్తున్నట్లుగా తలవూపుతూ, షాడో దాగుకుని వున్న ప్రదేశానికి నాలుగు అడుగుల దూరంలో నుంచి అవతలికి వెళ్లాడు మొదటి వ్యక్తి.

కుడికాలి బూటును బిగించి వున్న డాగర్ మీది చేతిని మెల్లిగా ఇవతలికి జరిపి, ముఖం మీది స్వేద బిందువుల్ని అద్దుకున్నాడు షాడో. శునకం పడుకున్న గోతిలో ముడుచుకు కూర్చోవటం మరో నాలుగు క్షణాలు ఆలస్యం అయి వుంటే, ఎటువంటి ఇబ్బందికరమైన సిచ్యుయేషన్‌లో చిక్కుబడి వుండేవాడో ఊహించుకునేసరికి, వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది అతని నోరు.

చెత్త గుట్టల చుట్టూ రౌండ్స్ కొట్టటానికి వచ్చిన వీరాధివీరులు పార్క్ వెనుక భాగంలోకి వెళ్ళిపోయారని నమ్మకం చిక్కగానే మెల్లిగా లేచి, నిలువెత్తున పిచ్చిగా ఎదిగి వున్న క్రోటన్స్ చాటుకు పరుగుతీశాడతను.

పార్క్ మధ్యభాగంలో అగుపించింది అతనికి కూలి పోవటానికి సిద్ధంగా వున్న చిన్న రేడియోరూమ్...

లావుపాటి ఇనుప చువ్వల్ని పట్టుకుని ఆ రూమ్‌లో నిలుచుని వున్నారు మరో నలుగురు దౌలత్ ఖాన్ అనుచరులు.

రక్తసిక్తమైన శరీరంతో, గట్టిగా అరిచి కేకలు పెట్టకుండా నోటిలో కుక్కబడిన గుడ్డ పీలికలతో,వారందరి మధ్యా కనిపించాడు బషీర్‌భాయ్.

# 5

మూర్ఛరోగం వచ్చిన వాడిలా గిలగిలా కొట్టుకుంటున్నాడు బషీర్‌భాయ్, మధ్య మధ్యలో చేతులు ఎత్తి ఆ నలుగురు వ్యక్తులకు సలాం చేస్తున్నాడు.

"మా ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే నువ్వు ఎంతోసేపు ప్రాణాలతో వుండవు... కాళ్ళు కీళ్లు విరగదీసేసి చెత్త గుట్టల కింద కప్పెట్టేస్తాం. ప్రాణాలతో వుండగానే ఎలుకలు, పంది కొక్కులు నీ మీద పడి

ఆరగించటం మొదలెడతాయి..." తన దగ్గిర వున్న ఐరన్ రాడ్‌ని అతని ముఖానికి ఆనిస్తూ క్రూరంగా హెచ్చరించాడు ఒక వ్యక్తి.

చెత్తగుట్టల మధ్యలో సంచరిస్తూ వుండే ఎలుకలు, పందికొక్కులు కనుల ముందు కదలాడేసరికి చెమటలు పట్టేశాయి కాబోలు, మాట్లాడటానికి సిద్ధంగా వున్నట్లు తల వూపాడు బషీర్ భాయ్.

ముందుకు వంగి అతని నోటిలోకి నెట్టిన గుడ్డ పీలికల్ని బయటికి లాగాడా వ్యక్తి.

"చీకటి పడిన తర్వాత ఈ ప్రదేశంలోకి ఎందుకు వచ్చావో వివరంగా చెప్పు... ఇందాకటి మాదిరి కాకమ్మ కథలు మొదలు పెడితే ఖర్చు అయిపోతావ్..." కరుకు కంఠంతో హెచ్చరిస్తూ, జుట్టు పట్టుకొని బలవంతంగా లేపి నిలబెట్టాడు.

బస్‌స్టేషన్‌లో నిలబడి వుండగా పోలీసులు తన వెంట పడిన దగ్గిర్నించీ మొదలు పెట్టి, ఖాళీ స్థలంలో పాడుబడిన బావి దగ్గిరికి వచ్చిన అపరిచిత వ్యక్తి వరకూ, అతను ఇచ్చిన కరెన్సీ నోట్ల వరకూ, గ్రామఫోన్ రికార్డు మాదిరి గబగబా వల్లె వేస్తాడని అనుకున్నాడు షాడో.

అనుకున్న రెండో క్షణంలోనే దారుణంగా తప్పి పోయింది అతని అంచనా.

ఐరన్ రాడ్స్ దెబ్బలకు నెత్తురు మడుగులు అయిన తన అవయవాల్ని అటూ ఇటూ కదిలించాడు బషీర్ భాయ్... ఉన్నట్లుండి ప్రక్కకు దూకి, ఆ పాడుబడిన గదిలో మినుకు మినుకు మంటున్న ఒక కాండిల్‌ని లాగిపెట్టి తన్నాడు.

ఊచలు లేని ఒక కిటికీలో నుంచి ఎటో ఎదిరిపోయింది అది... కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి ఆ గదిని ఆవరించుకున్నది.

"పట్టుకోండి బద్మాష్‌ని... పట్టుకుని ప్రాణాలు తీసేయండి..." ఖంగుమంటున్న కంఠంతో తన సహచరుల్ని హెచ్చరిస్తూ, చేతుల్ని అడ్డంగా జాచి గది ద్వారం దగ్గిరికి జంప్ చేశాడు బషీర్ భాయ్‌ని పైకి లేపిన వ్యక్తి.

అటుకేసి వెళితే, పట్టుబడి పోవటం డెఫినిట్ అని అర్థం అయింది కాటోలు, షాడో దగ్గిరగా వున్న కిటికీ వైపు వచ్చాడు బషీర్ భాయ్.

ముందుగా బయటికి తొంగి చూసిన అతని తలను గట్టిగా పట్టుకున్నాడు షాడో. "కమాన్ మై ఫ్రండ్. కంగారు పడకుండా వచ్చేయ్..." లోగొంతుకతో హెచ్చరిస్తూ, కన్నంలో వున్న ఎలుకను లాగినట్లు బయటికి లాగేశాడు.

తమ కళ్ళు చీకటికి అలవాటు పడిన వెంటనే ఆ దృశ్యాన్ని గమనించి గుండెలు జలదరించేటట్లు అరిచారు గదిలోనే వుండిపోయిన వ్యక్తులు.

"శత్రువులు... శత్రువులు మన ఇలాకాలోకి అడుగు పెట్టారు... శత్రువులు..." మెయిన్ గేటు ముందున్న దౌలత్ ఖాన్‌కి వినిపించేలా కేకలు పెడుతూ తాము కూడా బయటికి పరిగెత్తుకు వచ్చారు.

"ఈ చుట్టుపట్ల నివశించే పౌరులకు కూడా తెలియకుండా ఈ పార్క్‌లోనే తన ఆయుధాల్ని దాచిపెట్టాడు షబ్బూపాషా... ఇక్కడ వుండే చెత్తగుట్టల క్రిందా, పిచ్చిపిచ్చిగా ఎదిగిన ఈ క్రోటన్స్ మాటునా గుట్టలు గుట్టలుగా భద్రపరచి వున్నాయి అవి..." ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ షాడో చెవిలో వూదాడు బషీర్‌భాయ్.

అతని చేతిని మరింత గట్టిగా పట్టుకొని,గుబురుగా అల్లుకుపోయి వున్న కొన్ని మల్బరీ చెట్ల మధ్యకు తీసుకుపోయాడు షాడో.

బషీర్‌భాయ్ మాటల్లో అసత్యం ఏమీ లేదని వెంటనే అర్ధం అయింది అతనికి...

ఎండిపోయి నేలకు రాలిన మల్బరీ ఆకుల క్రింద నేర్పుగా దాచి వున్నాయి నాలుగు చెక్క పెట్టెలు...వేడి తగిలిన మరుక్షణం ఆ పార్క్‌లో సగ భాగాన్ని అవలీలగా ధ్వంసం చేయగల హేండ్ గ్రనేడ్స్ ఆ పెట్టెల్లో

ఉన్నట్లు, ఒకరు చెప్పాల్సిన అవసరం లేకుండానే, వాసనను బట్టి అర్థం చేసుకోగలిగాడు అతను.

"ఇవి నాలుగే కాదు... ఇటువంటివి ఇంకా ఎన్నో ఎన్నో ఈ పార్క్‌లో భద్రపరచబడి వున్నాయి..." ఒక పెట్టె మీద కూర్చుండి పోతూ మరోసారి షాడో చెవిలో ఊదాడు బషీర్‌భాయ్.

చెప్పిన మాటను చెప్పినట్లుగా పోషించుకున్న ఆ పాకెట్ మార్ భుజం తడుతూ చిన్నగా నవ్వాడు షాడో.

"నీకు నేను ఎంతగానో ఋణపడిపోయాను మైడియర్ ఫ్రెండ్... ప్రాణాల మీదికి తెచ్చుకుని కూడా నాకు సహాయం చేయగల్గిన నీ ధైర్యానికి నా జోహార్లు..." అంటూ పాంటు జేబులో వున్న వాలెట్‌ని తీసి అందులోని కరెన్సీ నోట్లలో మూడొంతుల్ని అతని పై జేబులోకి నెట్టాడు.

"మలయా ద్వీపకల్పంలోకి కౌలాలంపూర్ నుంచి దౌలత్ ఖాన్ అనే కిలాడీని తీసుకు వచ్చాడు షబ్బూ పాషా... తన ఆయుధాల వ్యాపారానికి సెక్యూరిటీ గార్డుగా అతన్ని నియమించాడు..." పాడుపడిన రేడియో రూమ్‌లో నుంచి బయటికి వచ్చిన మరుక్షణం, చుట్టూ వున్న పొదల్ని గాలిస్తూ, అడుగు అడుగుచొప్పున తమ సమీపంలోకి వచ్చేస్తున్న ఐరన్‌రాడ్స్ వ్యక్తుల్ని షాడోకి చూపిస్తూ అతని చెవిలో ఊదాడు బషీర్ భాయ్.

"పచ్చి రక్తాన్ని తాగే నరరూప రాక్షసుడి వంటి దౌలత్ ఖాన్‌ని గురించి ఎంత హెచ్చరించినా వినిపించుకోలేదు నీ స్నేహితుడు... మొండిగా ఇక్కడికి వచ్చి అతనికి పట్టుబడి పోయాడు..." బస్‌స్టేషన్ వెనుక భాగంలో ప్రాణాలు పోగొట్టుకుని ప్రత్యక్షమైన స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్‌ని గురించి కూడా చెప్పేశాడు.

అత్యంత ప్రతిష్టాకరమైన కిల్లర్స్ గాంగ్‌లో పనిని మానుకొని ఊరు పేరు లేని ఒక ఆయుధాల వ్యాపారికి హెల్ప్ చేయటం కోసం టైగర్ జాన్ అనుచరుడు దౌలత్ ఖాన్ అక్కడికి వచ్చాడంటే నమ్మబుద్ధి కాలేదు షాడోకి.

అయితే ఆ విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచించే అవకాశం అతనికి లభించలేదు.

పార్కు బయట కాపలా నిలబడిన వారందర్నీ లోపలికి పిలిచేశారు బషీర్‌భాయ్‌ని హింసించిన వ్యక్తులు... చిన్న చిన్న టార్చిలైట్లను తెప్పించి వాటిని పొదల మీదికి ఫోకస్ చేయటం మొదలుపెట్టారు.

"సుక్కూర్ హోటల్లో కూర్చుని ఆ బద్మాష్ తయారు చేయించే కబాబుల్ని తింటూ, వేడి వేడి చాయ్ తాగుతూ ఈ విషయాలన్నీ నీకు చెపుదామని ఆశ పడ్డాను. పార్క్ ముందుకు రాగానే అనుమానం వచ్చేసింది దౌలత్ ఖాన్‌కి. ప్రాణాలు కోల్పోయిన నీ స్నేహితుడితో

తిరుగుతుండగా ఒకసారి చూశాడట నన్ను... మళ్ళీ ఇంకెవరినైనా వెంట బెట్టుకు వచ్చావా అంటూ రేడియో రూమ్‌లోకి పంపించాడు..." ఐరన్ రాడ్స్ దెబ్బలకు హూనం అయిపోయిన కరచరణాలను చూసుకుంటూ మెల్లిగా చెపుతున్న బషీర్‌భాయ్ - ఒక్కసారిగా అదిరిపడి మాటల్ని ఆపేసరికి, విచిత్రంగా చూశాడు షాడో అతని వంక.

"దౌలత్‌ఖాన్ వస్తున్నాడు... వాడితో పాటు షబ్బూపాషా కూడా వచ్చేస్తున్నాడు..." చలిజ్వరం వచ్చినట్లు వణుకుతున్న కంఠంతో వెంటనే అన్నాడు బషీర్‌భాయ్.

అతను చూపించిన వైపుకు తలతిప్పి కనులు చిట్లించాడు షాడో.

పట్టరాని కోపంతో పళ్లు పటపటమని కొరుకుతూ వచ్చేశాడు దౌలత్‌ఖాన్ - రేడియో దగ్గిరికి.

"లాగిపెట్టి తంతే తిరిగి లేచి నిలబడటం చేతకాని ఒక పాకెట్‌మార్ చేత మాట్లాడించటం మీకు చేత కాదు... పశువుల మాదిరి తిండి తినటం, చాపచుట్టల్లా నిద్రలు పోవటం బాగా అలవాటయి పోయింది... మీ అంతు చూసి తీరతాను. నేను మీ నడుములు విరగగొట్టేస్తాను..." పిడికిళ్ళు బిగించి ఒక అనుచరుడి మీదికిపోతూ బిగ్గరగా అరిచాడు.

అతని దెబ్బలకు ఆ వ్యక్తి తల్లక్రిందులు కాకముందే, చేయి పట్టుకుని ఆపేశాడు పొట్టిగా లావుగా వున్న షబ్బూపాషా.

"మనలో మనం పోట్లాడుకుంటూ సమయాన్ని వృధా చేస్తే, మన మధ్యకు వచ్చిన ఆ బద్మాష్ తప్పించుకు పోతాడు... ముందు వాడిని పట్టుకోండి..." అంటూ హెచ్చరించి అవతలికి నెట్టాడు.

ఆ మాటలతో తన కర్తవ్యాన్ని గుర్తు చేసుకున్నాడు దౌలత్ ఖాన్.

"ఇక్కడే ఎక్కడో తల దాచుకొని వుంటాడు వాడు... ఒక్క పొదను కూడా వదిలి పెట్టకుండా గాలించండి... జుట్టు పట్టుకుని నా దగ్గరికి లాక్కురండి... పొండి.." ఉరుములాంటి కంఠంతో అందరికీ ఆజ్ఞలు జారీ చేశాడు.

పాంటు జేబులో వున్న సిగరెట్ పాకెట్‌ని తీసి సిగరెట్ వెలిగించుకోవాలన్న కోరికను బలవంతంగా అదుముకుంటూ, బషీర్‌భాయ్ భుజం తట్టాడు షాడో.

"నా మూలకంగా లేనిపోని బాధలకు గురి అయిన నీ ఋణం ఎలా తీర్చుకోవాలో నాకు అర్థం కావటం లేదు. ఏదో ఒకటి చేసి వాళ్ళందర్నీ మెయిన్ గేటు దగ్గిరికి తీసుకుపోతాను... చెత్త గుట్టల మధ్యలో నుంచి నువ్వు బయటికి పారిపో... కొద్దికాలం పాటు ఈ సిటీని వదిలి ఎక్కడికయినా వెళ్ళిపో..." అంటూ మల్బరీ చెట్ల చాటు నుంచి లేచి, దూరంలో వున్న మరికొన్ని పొదల కేసి పరుగుతీశాడు.

"అడుగో... అడుగో..." అని అరుస్తూ తమ దగ్గిర వున్న టార్చిలన్నిటినీ అతని కేసి తిప్పారు దౌలత్ ఖాన్ అనుచరులు.

అధికమైన రగడ చేస్తే తమ గుట్టు రట్టు అవుతుందన్న సంగతిని మరిచిపోయి వారిలో ఎవరైనా రివాల్వర్‌ని ఉపయోగిస్తే తన పధకం ఆదిలోనే దుమ్ము కొట్టుకు పోతుందని తెలిసి కూడా, వెనుకంజ వేయలేదు షాడో.

పిచ్చిపిచ్చిగా ఎదికి వున్న ఆ క్రోటన్ గుబుర్ల చాటు నుంచి మరో ప్రక్కకు పరిగెత్తాడు... దారికి అడ్డుగా అగుపించిన ఒక మట్టి దిబ్బను దాటి అవతలి ప్రక్కనే వున్న గోతిలోకి దొర్లబోతుండగా, అతని నాశికా రంధ్రాలకు సోకింది ప్లాస్టిక్ ఎక్స్‌ప్లోజివ్స్ వాసన.

ఆయుధాలతో పాటు అతి భయంకరమైన ఆ ప్రేలుడు పదార్థాన్ని కూడా షబ్బూపాషా భారతదేశంలోకి ఎగుమతి చేస్తున్నాడని అర్థమయ్యేసరికి అతన్ని ఆవరించుకున్నది దారుణమైన క్రోధం.

అవతలికి పరిగెత్తకుండా అక్కడే నిలబడిపోతే, దౌలత్ ఖాన్ అనుచరులకు పట్టుబడిపోవటం తప్పనిసరి అని అర్థం అవుతున్నా, దిబ్బను వదిలి ఒక్క అడుగు కూడా వేయలేదతను.

"పట్టుకోండి... ఆబద్మాష్ని పట్టుకొని రేడియో రూమ్‌లోకి లాక్కురండి..." రండోలు మోగినట్లు ఖంగు ఖంగుమంటున్న కంఠంతో

బిగ్గరగా అరుస్తున్న దౌలత్ ఖాన్‌ని కను చివరల నుంచి గమనించుకుంటూ, కుడికాలి బూటును ఊడదీశాడతను.

బూటు చివరి భాగంలోకి మడమని గట్టిగా నొక్కి ప్రక్కకు తిప్పేసరికి డబ్బా మూత మాదిరి వూడి చేతిలోకి వచ్చేసిందది.

అడుగుభాగంలో అరేంజి చేయబడివున్న ఖాళీ స్థలంలో నుంచి అతని అరిచేతుల్లో పడ్డాయి నక్షత్రాలవెలుగులో నిగనిగలాడుతున్న లిటిల్ టామీలు రెండు.

సి.ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో తయారయిన అతి చిన్న సైజు ఆటంబాంబుల వంటి ఆయుధాలు అవి...

చిన్నపిల్లలు ఆడుకునే గాజు గోలీల సైజులో కనిపించే ఆ మెటల్ బాల్స్ మీద వుంటుంది చిన్న బుడిపె వంటి మీట ఒకటి.

చిన్నగా ప్రెస్ చేసి తను నిలుచున్న ప్రదేశంలో వదిలాడు షాడో ఒక గోలీని. గులకరాయిని విసిరినట్లు పార్కు మధ్య భాగంలోకి విదిలించాడు రెండవ గోలీని...

పది అడుగుల దూరంలోకి వచ్చి, తన చేతిలోని ఐరన్‌రాడ్‌ని బంగా ముందుకు విసిరిన దౌలత్‌ఖాన్ అనుచరుడికి అందకుండా, ఇంకో పాతిక గజాల దూరం ముందుకు వెళ్ళి పోయాడు.

ఒకటి నుంచి ఇరవై రెండు అంకెలు కూడా పూర్తిగా లెక్కపెట్టక ముందే వచ్చేసింది అతను కోరుకున్న ఎఫెక్ట్.

ఆకాశం బ్రద్దలై పోతున్నంత శబ్దాన్ని వెలువరుస్తూ ఎక్స్ప్లోజ్ అయ్యాయి ఆ మెటల్ గోలీలు.

ఆ అదటుకు ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అయ్యాయి షబ్బాపాషా దాచి వుంచిన ప్లాస్టిక్ ఎక్స్ప్లోజివ్స్ పెట్టెలు.

వంద మెరుపులు ఒకేసారి మెరిసినంత వెలుగు - వంద ఉరుములు ఒకేసారి ఉరిమినంత చప్పుడు ఆ పాడుపడిన పార్క్‌నే కాదు- ఆ చుట్టుపట్ల నాలుగు కిలో మీటర్ల దూరం వ్యాపించాయి.

భరించరానంత శబ్దాన్ని సృష్టిస్తూ రెండువందల అడుగుల ఎత్తుకు లేచాయి ఎర్రటి మంటలు... భూకంపం వచ్చినట్లు తీవ్రంగా కంపించి పోయాయి పార్క్‌కు దూరంగా కట్టబడి వున్న భవనాలన్నీ.

శిథిలమైన గోడల్ని, వాటిని ఆనుకుని వున్న చెత్త కుప్పల్ని దాటి రోడ్డు మీదికి వెళ్లిపోతున్నాడు షాడో.

కంటికి కనిపించని రాక్షస హస్తం ఏదో పట్టుకుని ముందుకు విసిరినట్లు గాలిలోకి లేచాడతను. గింగిరాలు తిరుగుతూ పోయి మెయిన్‌రోడ్డు మద్యలో పడ్డాడు.

దుస్తులకు అంటిన దుమ్మును వదిలించుకుంటూ పైకి లేవాలని, తను సృష్టించిన విధ్వంసకాండను కనులారా చూసుకోవాలని అనుకున్నాడతను.

ప్రేలుళ్ళు దెబ్బకు బెదిరిపోయి తమ తమ నివాసాలలో నుంచి బయటికి పరిగెత్తుకు వస్తున్నారు ఆ చుట్టుపట్ల నివశించే పౌరులందరూ.

"పోలీస్... పోలీస్... పోలీసుల్ని పిలవండి... చీకటి మాటున శత్రువులు ఎవరో సిటీ మీద బాంబులు వేస్తున్నట్లు రిపోర్ట్ చేయండి... పోలీస్..." అని గావు కేకలు పెడుతూ షాడో ప్రక్కనుంచి సుక్కూర్ హోటల్ వైపు దూసుకుపోయారు కొందరు పౌరులు.

పోలీసుల ప్రసక్తి చెవుల పడేసరికి వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది షాడో నోరు. వెనక్కిపోయి సర్వనాశనం అయిన పార్క్‌ను దగ్గిర్లో నుంచి చూడాలన్న కోరికను అర్జంటుగా విరమించేసుకున్నాడతను.

క్రిందినించి లేచి, ఎదురుగా అగుపించిన ఒక సందు వైపు తిరగబోతుండగా చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం - సూదుల మాదిరి నిటారుగా లేచి నిలుచున్నాయి మెడ మీది వెంట్రుకలు.

అనవరతము మృత్యువుతో తలపట్లు పడుతూ దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు మాదిరి జీవిస్తూ వుండటం వల్ల సాధారణ మానవుల కెవరికీ వుండని అతీంద్రియ శక్తి- సిక్స్‌త్ సెన్స్ అతనికి అలవడింది.

కంటికి కనపడని ప్రమాదం ఏదో ముంచుకు రాబోతున్నదని హెచ్చరికలు పంపడం మొదలు పెట్టిందా సిక్స్‌త్ సెన్స్- ఇప్పుడు.

సందు మొగదల వున్న ఒక కరెంట్ పోల్ చాటున నిలబడి నిశితంగా పరిశీలించాడు అతను తన చుట్టూ వున్న పరిసరాల్ని...

తను సృష్టించిన ఆ విధ్వంస కాండలో చిక్కుపడకుండా ప్రాణాలతో తప్పించుకున్నాడేమో దౌలత్ ఖాన్.

షబ్బూపాషాతో కలిసి తన అంతు చూడటానికి బయలుదేరుతున్నాడేమో!!

అర్థం పర్థం లేని రకరకాల ఆలోచనలు కందిరీగల మాదిరి మనస్సును చుట్టుముట్టటం మొదలు పెట్టేసరికి విసుగ్గా తల విదిలించి వెనక్కి అడుగు వేశాడతను.

ఏదైనా మంచి హోటల్‌ని వెతుక్కుని ఆ రోజంతా హాయిగా విశ్రాంతి తీసుకోవాలి... నాశనమై పోయిన పార్క్‌ను గురించి ప్రముఖంగా వార్తలు ప్రచురించే వార్తా పత్రికల్ని పూర్తిగా చదివి, మెల్లిగా అటుకేసి రావాలి...

కిల్లర్స్ గాంగ్ వస్తాదు దౌలత్ ఖాన్. ఆయుధాల వ్యాపారి షబ్బూపాషాలు నిజంగానే తప్పించుకుని వుంటే వెంటనే వారిని వెతికి పట్టుకోవాలి...

షబ్బూపాషాని కూడా ఖతమ్ చేయగలిగిన మరుక్షణం పూర్తి అయిపోతుంది తన ఎస్సైన్‌మెంట్... ఏదో ఒక విధంగా ఢాకా పట్టణానికి వెళ్ళి, అక్కడి నుంచి హాయిగా ఇంటి దారి పట్టవచ్చు...

క్రొత్తగా మనసులోకి ఎంటర్ అయిన ఆ మాటల్ని తలుచుకుని తనలో తనే నవ్వుకుంటూ సందులోకి ఎంటర్ అయిన షాడో వళ్ళు ఝుళ్ళుమన్నది మరోసారి.

అందుకు కారణాన్ని అన్వేషించే ప్రయత్నం చేయలేదతను. గిరుక్కున వెను తిరిగి వచ్చిన దారినే మెయిన్ రోడ్డు మీదికి పరిగెత్తబోయాడు.

మూడు అడుగులు మాత్రమే వేయగలిగాడు అతను. నాలుగో అడుగు వేయకముందే వెనుక నుంచి అతని మెడ మీద పడింది బలమైన దెబ్బ.

"పట్టిన పట్టు వదలడని, ఎదుట పడిన నేరస్థుడిని ఎట్టి పరిస్థితిలోను పారిపోనీయడని పెద్ద పేరు ఈ రణధీర్‌కి... ఆ పేరును ఇప్పుడు పోగొట్టుకుంటానని అనుకోవటం నీ అవివేకానికి చిహ్నం... నీ అంతు చూడందే నేను నిద్రపోతానని అనుకోవటం నీ తెలివి తక్కువతనం..." అంటూ ఒక గోడ చాటు నుంచి అతని మీదికి

లంఘించాడు బావన్ పురా చెక్‌పోస్ట్ దగ్గిర అతను విసిరిన పలుకురాయి దెబ్బకు ముక్కు పగిలిపోయిన ఇన్స్‌పెక్టర్.

మోయరానంత బరువు వుండే కాంక్రీట్ దిమ్మతో కొట్టినట్లు విపరీతమైన బాధను కలుగచేస్తున్న మెడను ఎడమ చేత్తో అదుముకుంటూ, అతన్ని అవతలికి నెట్టటానికి ప్రయత్నించాడు షాడో.

సఫలం కాలేదా ప్రయత్నం.

మందంగా వుండే పోలీస్ బూట్‌ని ఎత్తి అతని తొడల మీద తన్నాడు ఆ ఇన్స్‌పెక్టర్. జుట్టును గట్టిగా పట్టుకుని ఎడమ చేత్తో ముఖం మీద గుద్దాడు.

కనుల ముందు రంగు రంగుల సీతాకోకచిలుకలు ప్రత్యక్షం అవుతున్న అనుభూతిని పొందుతూ, మోకాళ్ళ మీద క్రిందికి వాలిపోయాడు షాడో.

వెంటనే తలమీద పడింది మరోదెబ్బ... స్పృహను తప్పించి ముందుకు వాలిపోయేటట్లు చేసింది.

# 6

బరువుగా వుండే పలుగుల్ని పట్టుకుని ఎవరో అదే పనిగా తన తలమీదా, మెడమీదా పొడుస్తున్నట్లు అనిపించేసరికి ఉలిక్కిపడి కనులు తెరిచాడు షాడో.

తను ఎక్కడ వున్నాడో అర్థం కాలేదతనికి ఒక్క క్షణంపాటు.

"నేను ఎక్కడ వున్నాను?" అని అడుగుతూ పైకి లేవ బోతుండగా అతని గుండెలమీద పడింది పోలీస్ బూటు. సగం వరకూ లేవనిచ్చి, బలంగా వెనక్కి నెట్టింది.

దారుణమైన బాధను కలుగచేస్తున్న తల నేలకు పొడుచుకొని ఖంగున శబ్దం చేసేసరికి మరోసారి స్పృహ తప్పి పోతున్న సెన్సేషన్ షాడోని ఆవరించుకున్నది.

"నీళ్ళు తీసుకువచ్చి ముఖం మీద పోయండి... కమాన్ క్విక్.." ఖంగుమంటున్న కంఠం ఒకటి బిగ్గరగా వినవచ్చేసరికి అర్థం అయింది అతనికి తను ఎక్కడ వున్నదీ.

ఫరూకీ పార్కుదగ్గరి చీకటి సందులో నుంచి తీసుకువచ్చి ఏదో పోలీస్ స్టేషన్లో పడవేశాడు ముక్కు పగిలిన ఇన్స్పెక్టర్.

తనకు తగిలిన దెబ్బకు సరయిన ప్రతీకారం తీర్చుకునే ఏర్పాట్లను పూర్తి చేసుకుని రెడీగా వున్నాడు.

మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా పైకెత్తి ముందుకు చూశాడు షాడో. ఇన్స్పెక్టర్ సాబ్ ఆజ్ఞల ప్రకారం తన ముఖం మీద పోయటానికి నీళ్ళు తీసుకువస్తున్న ఒక కానిస్టేబిల్ని చూసి నవ్వటానికి ప్రయత్నించాడు

నడుము మీద చేతులు వేసుకుని నాలుగు అడుగుల దూరంలో నిలుచుని వున్నాడు ఇన్స్పెక్టర్ రణధీర్ సాబ్. వెంటనే ముందుకు వచ్చి, పెదవులు వాచిపోయేటట్లు అతని నోటిమీద కొట్టాడు.

పెదవుల్ని కదిలించి చిన్న శబ్దం కూడా చేయకుండా ఆ బాధను భరిస్తూ కూర్చుంటే, ఆ పెద్ద మనిషి ఆగ్రహం అంచెలంచెలుగా పైకి వెళ్ళిపోతుందని,మరింతగా హింసల్ని అనుభవించాల్సి వస్తుందనీ అర్థం అయింది షాడోకి.

పెదవులు చిట్లటం వల్ల చుబుకం మీదికి జారుతున్న రక్తాన్ని చూసుకొని గొల్లున అరిచాడతను.

అరుస్తూ వుండగానే అర్థం అయిందతనికి తన అంచనా దారుణంగా తప్పిపోయిన సంగతి.

జాలి, దయ అనే మాటలకు అర్థం తెలియనట్లు ఇంకా ఇంకా రెచ్చిపోయాడా ఇన్స్పెక్టర్. డాన్స్ చేస్తున్నట్లుగా పాదాల్ని కదిలించి ఇష్టం వచ్చినట్లు తన్నాడు అతని గుండెలమీద.

మరో రెండు నిముషాలు గడిచిన తరువాత స్పృహ తప్పి పోయినట్లు తల ప్రేలాడ వేద్దామనీ, దెబ్బల బాధను భరించలేక కోమాలోకి వెళ్ళిపోయినట్లు ఫోజు పెడదామని అనుకుంటున్నాడు షాడో.

ఆ ఆలోచనలు తనకు ముందుగానే తెలిసినట్లు,చటుక్కున ప్రక్కకు తిరిగి, నీళ్ల బక్కెట్‌తో రెడీగా నిలుచుని వున్న కానిస్టేబిల్‌కి సైగ చేశాడా ఇన్స్పెక్టర్.

మంచుకంటే చల్లగా వున్న ఆ నీళ్ళు తలమీద కుమ్మరించబడేసరికి ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు షాడో.

అతని జుట్టు పట్టుకుని తలను నేలకేసి ఠపీఠపీమని కొట్టాడు ఇన్స్పెక్టర్.

"చీకటి మాటున నా ముఖం మీదికి రాయిని విసిరినప్పుడు, ఆటోని రోడ్డు మీద వదిలి పొదల మధ్యగా పారిపోయి వచ్చినప్పుడు - భవిష్యత్తులో ఇటువంటి బాధల్ని భరించాల్సి వస్తుందనే మాట నీకు తట్టలేదా?" అని అడుగుతూ లాఠీని ఎత్తి ఫెడీమని కొట్టటం మొదలుపెట్టాడు.

ఆ దెబ్బలు అదే స్పీడులో మరో పది నిముషాల పాటు కంటిన్యూ అయితే తన కాళ్ళు చేతులు ఎందుకూ పనికిరాకుండా పోతాయేమోనన్న అనుమానం కలిగింది షాడోకి.

తను అక్కడికి వచ్చిన పని మట్టి కొట్టుకు పోవటం మాట అటుంచి, అసలు ప్రాణాలతో వుండటం కుదురుతుందో కుదరదో అనే ఆలోచన కూడా మనస్సులోకి అడుగు పెట్టేసరికి తనకు తెలియకుండానే రియాక్ట్ అయ్యాడతను.

ఎడమ భుజం మీద పడబోతున్న లాటీని బిగించి పట్టుకున్నాయి అతని చేతులు... కంటికి కనిపించనంత వేగంతో ఇన్స్పెక్టర్ తొడలకు కనెక్ట్ అయ్యాయి పాదాలు.

అతను ఆవిధంగా ఎదురు తిరుగుతాడని ఊహించలేదా ఇన్స్పెక్టర్... భుజాల్ని గట్టిగా పట్టుకుని పైకి లేపినట్లు ఒక గోడను గుద్దుకున్నాడు.

ఆశ్చర్యంతో నోళ్ళు తెరుచుకు చూస్తున్న కానిస్టేబిల్స్ మీదికి గోడకు కొట్టిన రబ్బర్ బంతి మాదిరి వేగంగా పోయాడు షాడో.

"పట్టుకోండి...ఆ బద్మాష్‌ని పట్టుకుని నడుములు విరగగొట్టేయండి... పట్టుకోండి.." పడినచోటి నుంచి లేచి నిలబడటానికి ప్రయత్నిస్తూ బిగ్గరగా అరిచాడు ఇన్స్పెక్టర్ సాబ్.

ఆ ఆజ్ఞల్ని విని యాక్షన్‌లోకి దిగే అవకాశాన్ని కానిస్టేబిల్స్‌కి యివ్వలేదు షాడో... పిడికిళ్ళు బిగించి ఎడాపెడా డెలివర్ చేశాడు మూడు ముష్టి ఘాతాల్ని.

గావురుమని అరుస్తూ ప్రక్కలకు పడిపోతున్నఆ కానిస్టేబిల్స్ మధ్యలో నుంచి ఇంటరాగేషన్ గది బయటికి పరుగు తీశాడు.

విశాలమైన హాలు వంటి ఒక పెద్ద గదిలోకి అడుగు పెట్టేంత వరకూ అతని వెన్నంటే వున్నది అదృష్ట దేవత.

గది మధ్య భాగంలోకి చేరుకుంటుండగా, బావన్ పురా చెక్ పోస్టు దగ్గిర ముఖాన్ని చాటు చేసుకుంటున్నట్లు మరోసారి అతన్ని వదిలిపెట్టి దూరంగా వెళ్ళిపోయింది.

"పట్టుకోండి.. ఆ బద్మాష్‌ని పట్టుకోండి..." అని అరుస్తూ ఇంటరాగేషన్ గదిలో నుంచి బయటికి వచ్చాడు ఇన్స్‌పెక్టర్ సాబ్. తన చేతుల్లోనే వున్న లాటీని గిర్రున తిప్పి ముందుకు విసిరేశాడు.

కళ్ళకు కనిపించక పోయినా ఆ లాటీ చేసిన శబ్దాన్ని గమనించి, ఆఖరి క్షణంలో నేర్పుగా తల వంచుకున్నాడు షాడో. పుచ్చకాయ పగిలినట్లు తన తల పగిలిపోకుండా జాగ్రత్త పడ్డాడు.

గింగిరాలు తిరుగుతూ అతని మీది నుంచి పోయి, ఓరగా తెరిచి వున్న ఒక ద్వారం ముందు పడిందా లాటీ.

పోలీస్ స్టేషన్ ప్రక్క భాగంలో వున్న పెద్ద ప్రహరీ గోడ దగ్గిరికి దారిని చూపిస్తోందా ద్వారం... పదే పది అంగల్లో స్టేషన్‌ని దాటి దూరంగా పారిపోయేందుకు వీలును కలిగిస్తోంది.

దెబ్బ తగిలిన బావురు కప్ప మాదిరి అరుస్తున్న ఇన్స్‌స్పెక్టర్ సాట్ అరుపులు- స్టేషన్ లో పనిచేసే ఇతర కానిస్టేబిల్స్‌ని అక్కడికి రప్పించక ముందే ప్రహరీ గోడను దాటి, మటుమాయం అయిపోవాలన్న తొందర్లో, ద్వారం దగ్గిర పొంచి వున్న ప్రమాదాన్ని గురించి పట్టించుకోలేదు షాడో.

పొరపాటున పడింది అతని పాదం అంతకు ముందు ఇన్స్‌స్పెక్టర్ విసిరేసిన లాటీ మీద. ఎంత ప్రయత్నించినా బాలెన్స్ నిలుపుకోవటం చేత కాలేదతనికి. జర్రున జారి ద్వారం బయటి వైపున వున్న మెట్ల మీద పడిపోయాడు.

లేచి నిలబడి తన పరుగును కంటిన్యూ చేసే అవకాశం లభించలేదు. పట్టరాని ఆనందంతో పరవశించిపోతూ బుల్‌డోజర్ మాదిరి వచ్చి మీద పడ్డాడు ఇన్స్‌పెక్టర్ సాట్.

"నీ పని ఖతం అయిపోయింది బే... ఇక నువ్వు కాళ్ళు చేతులతో తిన్నగా వుండటానికి వీలు లేదు... నీ అంతు చూడకపోతే నేను పేరు మార్చుకోవటం తప్పనిసరి..." అంటూ మోకాళ్ళతో గుండెల్ని అదిమి, పిచ్చి పట్టిన వాడిలా పిడికిళ్ళతో ముఖం మీద పొడవటం మొదలు పెట్టాడు.

విల్ పవర్‌నంతా కూడగట్టుకుని ఆ దెబ్బల్ని భరించాడు షాడో. బాధా సూచకమైన శబ్ధం ఒక్కటి కూడా పెదవుల్ని దాటి బయటికి రాకుండా జాగ్రత్తపడ్డాడు.

కొట్టి కొట్టి చేతులు నొప్పి పుట్టాయి కాబోలు, ఆయాసాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ అతని గుండెల మీద నుంచి లేచాడు ఇన్స్‌పెక్టర్ సాబ్.

"తీసుకుపొండి వీడిని... ఇంకో రెండు గంటల తరువాత మళ్ళీ నా దగ్గిరికి తీసుకురండి..." ఇంటరాగేషన్ గదిలో నుంచి వచ్చి రెడీగా నిలుచున్న కానిస్టేబిల్స్‌కి ఆర్డర్ ఇస్తూ పోలీస్ స్టేషన్ ముందు భాగంలోకి వెళ్ళిపోయాడు.

ముళ్ళకంపను ఈడ్చినట్లు ఈడ్చుకుంటూ తీసుకుపోయారు కానిస్టేబిల్స్. దుమ్ము ధూళితో నిండి అసహ్యకరంగా అగుపిస్తున్న ఒక లాకప్ గదిలోకి నెట్టి తలుపుల్ని క్లోజ్ చేశారు.

వారి అడుగుల చప్పుడు దూరంగా వెళ్ళిపోయి దాకా ఆగి, మెల్లగా లేచి కూర్చున్నాడు షాడో. పని చేయమని మొరాయిస్తున్న అవయవాల్ని అతి ప్రయత్నం మీద కదిలిస్తూ ఆ గదినంతా కలియ చూసాడు.

మరోసారి ఇంటరాగేషన్ గదిలోకి వెళ్ళటం అంటూ జరిగితే- తన పరిస్థితి పూర్తిగా విషమిస్తుందని అవగతం అయింది అతనికి.

ఈసారి ముఖం మీద పిడికిళ్లతో పొడవడు ఆ ఇన్స్పెక్టర్... ఇంకోసారి పారిపోయే ప్రయత్నం చేయకుండా కాళ్ళనో,చేతుల్నో విరగదీసి వెనక్కి పంపిస్తాడు.

అంతవరకూ అక్కడే ఆగటం దేనికి??

నాలుగు రమ్ బాటిల్స్‌ని ఒకేసారి ఖాళీ చేసినట్లు గిర్రున తిరుగుతున్న తలను చేతులతో అదుముకుంటూ, ఆ గది చివరి భాగంలో పది అడుగుల ఎత్తున ఉన్న వెంటిలేటర్ నొకదాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలించి చూశాడతను.

ఎప్పుడో పురాతన కాలంలో కట్టబడిన గది కావటం వల్ల తుప్పుపట్టి బలహీనంగా వున్నట్లు అగుపిస్తున్నాయి ఆ వెంటిలేటర్‌కి అడ్డుగా అమర్చి వున్న ఇనుప చువ్వలు.

పది అడుగులు పైకి ఎక్కి వాటిని వెనక్కి వంచటం సాధ్యపడితే నిరభ్యంతరంగా అవతలికి జారుకోవచ్చు... రెండవసారి ఇంటరాగేషన్ గదిలోకి పోకుండా అక్కడి నుంచి మాయమైపోవచ్చు...

బుల్‌డోజర్ క్రిందపడి నలిగిపోయినట్లు తయారైన తన అవయవాలు అందుకు సహకరిస్తాయా? ఎంతో ఓర్పుతో నేర్పుతో చేయవలసిన ఆ పనిని, గది బయట కాపలా నిలబడిన కానిస్టేబిల్స్‌కి తెలియకుండా తాను పూర్తి చేయగలడా??

పూర్తి చేయలేకపోతే జరిగేది ఏమిటో మరోసారి మనసులో మెదిలే సరికి అప్రయత్నంగా బిగుసుకున్నాయి అతని పిడికిళ్ళు.

గుండెల నిండా గాలి పీల్చుకుని నిశ్చలంగా నిలబడ్డాడు రెండు నిముషాల పాటు... ఉన్నట్లుండి గాలిలోకి ఎగిరి అమాంతంగా చేతుల్ని చాచాడు.

ఊపు తగ్గి క్రిందికి జారిపోతుండగా అతని చేతులకు తగిలింది వెంటిలేటర్ అంచు ఉడుము పట్టినట్లు గట్టిగా పట్టు చిక్కించుకొని మెల్లి మెల్లిగా పైకి లేచాడు... తుప్పు పట్టి వున్న ఇనుప చువ్వల మీద చేయి పడీ పడటంతోనే వళ్ళు జలదరించేటట్లు కొట్టింది కరెంట్ షాక్.

పెదవుల్ని దాటి బయటికి దుముకబోయిన అరుపును బలవంతంగా అదుముకుంటూ, ఇసుక మూటపడినట్లు క్రింద పడిపోయాడతను.

తుప్పు పట్టిన ఆ ఇనుప చువ్వల్ని చూసిన బంధితులు వాటిని వంచి బయటికి జంప్ చేయకుండా ముందు జాగ్రత్తగా కరెంట్ వైర్స్‌ని వాటి దగ్గిర పెట్టించాడు ఇన్స్‌పెక్టర్ సాబ్. తెలివితేటల్లో తనకు మించినవాడు మరొకడు లేడని సాక్ష్యంగా నిరూపించుకున్నాడు.

"నీలాంటి బద్మాష్‌లు చాలామంది చాలా రకాలుగా ప్రయత్నించారు ఈ గదిలో నుంచి పారిపోవటానికి. వారి కెవరికీ సాధ్యపడని పని నీకు

చేతనవుతుందని అనుకోవటం నీ భ్రమ... అనవసరంగా శ్రమపడి నీకున్న సమయాన్ని వృధా చేసుకోకు. విశ్రాంతి తీసుకోక పోతే రెండో విడత ఇంటరాగేషన్ని తట్టుకోలేవు..." టైట్ గా మూసి వున్న తలుపుల్ని ఓరగా తెరిచి ఒక కానిస్టేబిల్ వెక్కిరింపుగా మాట్లాడటంతో, పెదవులు బిగించి తలను ప్రక్కకు తిప్పుకున్నాడు షాడో.

లాకప్ గదిలోకి నెట్టిన తర్వాత కూడా తన మీది నిఘాని సడలించటం లేదు వాళ్ళు... తన ప్రతి కదలికను జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తున్నారు.

చినికి చినికి గాలివాన అయినట్లు క్షణక్షణానికి జటిలమౌతున్న తన పొజిషన్ని గురించి ఆలోచిస్తూ ఒక గోడకు చేరగిల పడ్డాడు షాడో.

సిగరెట్ కాల్చుకోవాలన్న కోరిక సడన్గా మనసులోకి ఎంటర్ అయ్యేసరికి ఖాళీ అయిన పాంటు జేబును తడిమి,నీరసంగా ప్రేలాడబడి పోయింది అతని చేయి.

స్టేషన్లోకి తీసుకు వచ్చిన మరుక్షణం జేబుల్ని ఖాళీ చేయించాడు ఇన్స్పెక్టర్. వాలెట్ని స్వాధీనపరుచుకున్నాడు... కాలి బూట్లను కూడా ఊడ తీయించి ఎక్కడో దాచి పెట్టించాడు.

గోడ ప్రక్కగా చేతికి తగిలిన ఒక ఎండు గడ్డి పరకను సిగరెట్ మాదిరిగా నోటిలో పెట్టుకోబోతూ, గది బయట అడుగుల చప్పుడు వినిపించేసరికి కనులు చిట్లించాడు షాడో. తల తిప్పిఅటుకేసి చూశాడు.

కిర్రుమని శబ్దం చేస్తూ తెరుచుకున్నాయి తలుపులు, బయిజూ పట్టణంలోని రంగేళీ బజార్లో లభించే ఖరీదు తక్కువ సువాసనాద్రవ్యాలను వంటి నిండా రాసుకొని మగవాళ్ల మాదిరిగా ఘాటయిన జర్దా కిళ్ళీని బుగ్గన పెట్టుకొని, తన భుజాన్ని పట్టుకోబోయిన కానిస్టేబిల్స్ వైపుకోరగా చూస్తూ లోపలికి వచ్చిందొక ముద్దు గుమ్మ.

"ఏదో నా ఖర్మ కాలి మీ చేతికి చిక్కానని అలుసుగా చూడకండి... తిక్క రేగిందంటే మంచిదాన్ని కాదు నేను... వరస పెట్టి చూసేస్తాను మీ అందరి అంతూ. " లోపలికి వచ్చీ రావటంతోటే తర్జనితో కానిస్టేబిల్స్‌ని బెదిరించిందామె.

"అర్జంట్ పనిమీద ఇంతకు ముందే బయటికి పోయారు మా ఇన్‌స్పెక్టర్ సాబ్. ఆయన తిరిగి వచ్చిన తర్వాత వినిపిద్దువు గాని నీ బెదిరింపులు. అంతవరూ నోరు మూసుకుని పడి వుండు. పిచ్చివేషాలు వేసావంటే ముఖం పగిలి పోతుంది..." కనులు ఎర్రచేసి కరుకుగా అంటూ తలుపుల్ని మూశాడు ఒక కానిస్టేబిల్.

"రంగేళి బజారుకు నాలుగు ఫర్లాంగుల దూరంలో సరయిన గిరాకీ కోసం కాపలా కాస్తూ వీళ్ళకి దొరికి పోయాను.... నువ్వు ఎందుకు వచ్చావ్ ఇక్కడికి? ఎవడి జేబులోనైనా చేయి పెట్టావా?" పదిక్షణాలు ఆగినట్లే ఆగి, ఒకప్రక్కగా కూర్చుని వున్న షాడోని సమీపిస్తూ అడిగిందా బొమ్మ అనునయంగా.

ఆమె ఉపయోగిస్తున్న సుగంధ ద్రవ్యాల వాసనను భరించటం అసాధ్యమై విసుగ్గా తల విదిలించాడు షాడో.

"సిగరెట్ కాల్చే అలవాటుందా నీకు? సిగరెట్ కావాలా?" ఉన్నట్లుండి అతని సరసన కూర్చుంటూ లోగొంతుకతో అడిగిందామె.

తనమీద నిఘా వేసి వుంచిన కానిస్టేబిల్‌కి ఆ మాటలు వినబడితే అతని రియాక్షన్ ఎలావుంటుందో ఊహించటానికి ప్రయత్నించాడు షాడో.

అతను సమాధానం ఇవ్వకపోయినంత మాత్రాన తను చేయదలుచుకున్న పనిని చేయకుండా ఆగేది లేదని నిరూపించిందా అత్తరు సుందరి. కానిస్టేబిల్స్‌కి కనిపించకుండా తన దుస్తుల్లో దాచి వుంచిన సిగరెట్ పాకెట్‌ని, లైటర్‌ని తీసి అతని చేతిలో పెట్టింది.

యధాలాపంగా అందుకున్నాడు షాడో వాటిని... పాకెట్‌ని తెరిచి సిగరెట్‌ని బయటికి తీయబోతూ, తుప్పు పట్టిన ఇనుప చువ్వల దగ్గిర కరెంట్ షాక్ కొట్టినట్టు మరోసారి అదిరిపడ్డాడు.

భారతదేశంలో తప్ప మరెక్కడా లభించని పనామా పాకెట్ అది!

"తన దారికి అడ్డు వచ్చిన వారిని ఊరికే వదిలి పెట్టటం గాని, తనతో తగాదా పడిన వారి ప్రాణాలు తీయకుండా ఆగటం గాని చేతకాని నరరూప రాక్షసుడు ఈ స్టేషన్లో పనిచేసే రణధీర్ సాట్... ఆమడ దూరంలో వున్న శత్రువునయినా అతి తేలికగా పసికట్టి అవతలికి తప్పుకునే నువ్వు, ఏమీ తెలియని అనామకుడి మాదిరి ఇక్కడ చిక్కుపడటం చాలా విచిత్రంగా వున్నది మిస్టర్ షాడో... నీ గురించి నేను విన్న కథలకు విరుద్ధంగా వున్నది నీ ప్రవర్తన..." బుగ్గన వున్న జర్దాపాన్ని ఒక ప్రక్కకు ఉమ్మేస్తూ లోగొంతుకతో అన్నదా యువతి.

వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టిన గుండెల్ని చిక్కబట్టుకోవటానికి ప్రయత్నిస్తూ పనామాను వెలిగించుకున్నాడు షాడో...

కంప్యూటర్ మాదిరి అతి వేగంగా పనిచేయ సాగింది అతని మనస్సు... ఆమె మాటల్ని,ఆమె కదలికల్ని, ఆమె ముఖాన్ని అదివరలో ఎక్కడైనా అబ్జర్వ్ చేయటం జరిగిందో లేదో గుర్తు చేసుకోవటానికి ట్రై చేయటం మొదలుపెట్టింది.

అతని ముఖంలోని భావాలను గమనించి అందంగా నవ్వించామె.

"నువ్వు నేను ఇంతవరకూ ఎదురుపడటం జరగలేదు. నా గురించి నీకు తెలిసి వుండే అవకాశాలు లేవు... అనవసరమైన ఆలోచనలతో

మనస్సును పాడు చేసుకోకుండా ఇక ముందు జరగాల్సింది ఏమిటో సెటిల్ చేయి..." అంటూ తన దుస్తుల్లో నుంచి చిన్న సైజు పిస్టల్‌ని బయటికి తీసి అతనికి చూపించింది.

"నీ పేరు మరియా... ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో కిల్లర్స్ గాంగ్ స్థావరానికి ఇన్‌ఛార్జిగా నియమింపబడ్డావు... సుప్రీమ్ కమాండ్ అభిమానాన్ని పొందిన ఏకైక లేడీ మెంబర్‌వి..." పనామా పొగల్ని రింగులు రింగులుగా గాలిలోకి వదులుతూ సడన్‌గా ఆమె ఐడెంటిటీని బయట పెట్టాడు షాడో.

విపరీతమైన ఆశ్చర్యంతో విశాలమైనాయి ఆ ముద్దు గుమ్మ కాటుక కనులు.

"ఎక్సలెంట్ మిస్టర్ షాడో... నీ జ్ఞాపకశక్తి నిజంగా చాలా అమోఘం... ఏ సుప్రీమ్ కమాండ్ సభ్యుల్ని నీ ఆగర్భ శత్రువులుగా భావించి, అవకాశం లభించినప్పుడల్లా హతమార్చటానికి చూస్తావో, ఆ గౌరవనీయుల ఆజ్ఞల ప్రకారం ఇక్కడికి వచ్చాను నేను... నిన్ను ఇక్కడి నుంచి తప్పించి సురక్షితంగా బయటికి తీసుకు పోవటం నా భాద్యత..." మూసివున్న తలుపుల కేసి చూస్తూ, గొంతును తగ్గించి రహస్యంగా చెప్పిందామె.

కాళ్ళ దగ్గరికి వచ్చిన తర్వాత కాటు వేయని కట్ల పాముల్ని, తన ఐడెంటిటీ బయటపడిన తర్వాత తన అంతు చూడటానికి ప్రయత్నించకుండా ఆగిపోయే కిల్లర్స్ గాంగ్ మెంబర్లనీ అంతవరకూ చూసి వుండక పోవటం వల్ల, నిశ్శబ్దంగా నవ్వి తల విదిలించాడు షాడో.

అతని మనసులో ఎటువంటి మాటలు మెదలుతున్నాయో తనకు అర్థం అయినట్లు మెల్లిగా తల వూపిందా ముద్దుగుమ్మ.

"నీకు మాకు వున్న విరోధాన్ని బట్టి నువ్వు నా గురించి చెడుగా ఆలోచించటంలో తప్పేమీ లేదు... అందుకు నేను బాధపడటం లేదు" లాకప్ తలుపుల మీది నుంచి చూపుల్ని తిప్పుకుంటూ అన్నది.

"నన్ను బంధించి సజీవంగా అప్పచెప్పినా, హతమార్చి నా తలను చూపించినా మీ సుప్రీం కమాండ్ ఎటువంటి బహుమతుల్ని ఇస్తుందో తెలుసా నీకు?" సిగరెట్ నుసిని చిటికెన వేలి గోటితో అవతలికి విదిలిస్తూ అడిగాడు షాడో.

అతని తలను చూపించిన వారికి కోటి రూపాయల బహుమతితో ప్రారంభించి మూడుకోట్ల వరకూ ప్రామిస్ చేసింది సుప్రీం కమాండ్... గతంలో.

ఇప్పుడది ఇబ్బడి ముబ్బడిగా పెంచబడింది. షాడోని హతమార్చిన వారికి, వారు కోరుకున్న ప్రదేశంలో గాంగ్ నాయకత్వ బాధ్యతల్ని

అప్పగించబడతాయని ఎనౌన్స్ చేయబడింది. ప్రపంచ దేశాలన్నిటినీ ఒకే పతాకం క్రిందకి తెచ్చి ఏకఛత్రాధిపత్యంగా పరిపాలన ప్రారంభించిన రోజున వారు కోరుకున్న దేశానికి చక్రవర్తిగా అభిషేకించబడతారని కూడా వాగ్దానం చేయబడింది.

ఆ విషయాలన్నీ తనకు తెలిసినట్లు తల వూపుతూ అతని ముఖంలోకి చూసిందా ముద్దుగుమ్మ.

"నీ అంతు చూడటానికి కంకణం కట్టుకున్న మా సుప్రీమ్ కమాండ్ సభ్యులే నిన్ను కలుసుకోవటానికి ఈ బయిజూ పట్టణానికి విచ్చేశారు... నరరూప రాక్షసుడని పేరు పొందిన ఈ ఇన్స్పెక్టర్ చేతికి నువ్వు చిక్కబడినట్లు తెలిసి ఎంతో బాధ పడ్డారు... ఇతని మూలకంగా నీకు ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా వెంటనే బయటికి తీసుకు రమ్మని నాకు ఆర్డర్స్ యిచ్చారు... హౌ ఎబౌట్ ఇట్ మిస్టర్ షాడో? నా మాటల్ని నమ్మి, నా బాస్‌ల ఎదుటికి రాగల ధైర్యం నీకు లేదా??" ఉన్నట్లుండి సూటిగా, నిర్మొహమాటంగా అడిగింది.

ఇన్స్పెక్టర్ సాబ్ కొట్టిన దెబ్బలకు తన మతి మందగించినట్లు అనుమానించాడు షాడో. చెవులు సరిగ్గా పనిచేయటం లేదని కూడా భావించాడు.

"బాగా ఆలోచించుకుని సమాధానం చెప్పు మిస్టర్ షాడో... ఏదో పనిమీద బయటికి పోయిన ఇన్స్పెక్టర్ సాబ్ తిరిగి రావటం జరిగితే సూప్‌లో పడతాం మనం యిద్దరమూ..." చెవులు రిక్కించి గది బయటి శబ్దాలను ఆలకించటానికి ప్రిపేర్ అవుతూ అతన్ని తొందర పెట్టిందా యువతి.

ఆ మాటలకు షాడో సమాధానం ఇవ్వకముందే,ఖంగు మంటూ వినవచ్చింది అప్పుడే స్టేషన్‌లోకి వచ్చిన ఇన్స్పెక్టర్ రణధీర్ సాబ్ కంఠం.

"తీసుకురండి ఆ బద్మాష్‌ని... చీకటి మాటున నా ముఖం మీదికి రాతిని విసిరినందుకు ఫలితం ఎలా వుంటుందో బాగా అర్థం అయ్యేటట్లు చెప్పాలి... త్వరగా తీసుకురండి..." ఇంటరాగేషన్ గది దగ్గిరికి వస్తూ, తన కానిస్టేబిల్స్‌కి ఆర్డర్ ఇచ్చాడతను.

లాకప్ తలుపులకు బిగించిన తాళాన్ని తెరిచే ప్రయత్నం జరుగుతున్నట్లు పసికట్టి ఆందోళన నిండిన కనులతో షాడో కేసి చూసింది మరియా.

చివరికంటా కాలిన సిగరెట్‌ని ఒక మూలకు విసిరేస్తూ, ఆమె భుజం మీద చేయి వేశాడు షాడో.

"నీవం అందగత్తె పొందు లభిస్తుందంటే - నరకంలోకి వెళ్ళటానికైనా నేను సిద్ధమే... ఇన్స్పెక్టర్ సాబ్ చేతుల్లో నా ప్రాణాలు పోయే లోపల నీ

కౌగిలిలో పరవశించి పోతాను..." అంటూ పట్టు వస్త్రం మాదిరి మెత్తగా వున్న ఆమె వల్లెవాటును కత్తిపెట్టి చీరినట్లు మధ్యకు చింపేశాడు.

అతని మాటల్లోని అంతరార్థాన్ని ఆఖరి క్షణంలో గ్రహించి, ఆ గది గోడలు దద్దరిల్లి పోయేటట్లు కెవ్వున అరిచింది మరియా.

"నువ్వు అరిచినా, కేకలు పెట్టినా వదిలేది లేదు... నీ అందాల్ని ఆస్వాదించందే నాకు నెమ్మదే లేదు" మరింత వికృతంగా అంటూ, ఇంకా కాస్త గట్టిగా ఆమెను పట్టుకున్నాడు షాడో.

"రక్షించండి...ఈ రాక్షసుడి బారి నుంచి నన్ను కాపాడండి..." గొంతు చించుకుని అరుస్తూ, అతని చేతుల్ని విదిలించి కొట్టింది మరియా... ఆ గది రెండో ప్రక్కకు పరుగుతీసింది.

తలుపుల్ని తెరిచిన మరుక్షణం తన కంటపడ్డ ఆ దృశ్యాన్ని చూసి విపరీతమైన ఆగ్రహంతో అగ్గిరాముడై పోయాడు ఒక కానిస్టేబిల్.

"నీ పని అయిపోయింది బే... ఈసంగతి మా ఇన్స్పెక్టర్ సాబ్‌కి చెప్పిన మరుక్షణం నీ కథ ఖతమై పోతుంది..." అంటూ మరియాతో పాటు కదలబోతున్న షాడో భుజాల్ని గట్టిగా పట్టుకోబోయాడు.

ఉన్నట్లుండి అతనికేసి తిరిగి అతి వేగంగా తన తలను ముందుకు విసిరాడు షాడో. కుంగ్‌ఫూ విద్యను సాధన చేసే సమయంలో మందంగా

వుండే ఐస్ బ్లాకుల కేసి కొట్టి కొట్టి ఇనుపరేకు మాదిరి గట్టి పడిపోయి వున్నది అతని నుదురు.

లావుపాటి ఇటుకరాళ్లు ఒకేసా నాలుగు వచ్చి తన ముఖానికి తగిలినట్లు గావురుమని అరిచాడా కానిస్టేబిల్. ముఖాన్ని చేతుల్లో కప్పుకుంటూ క్రిందికి వాలిపోబోయాడు..

పూర్తిగా వారిపోక ముందే భుజాల్ని పట్టుకొని అమాంతంగా గాలిలోకి ఎత్తాడు షాడో. ఇన్స్పెక్టర్ సాబ్ దగ్గరికి తనను తీసుకు పోవటం కోసం వస్తున్న మరో ఇద్దరు కానిస్టేబిల్స్ మీద పడేటట్లు బయటికి విసిరాడు.

అటువంటి ప్రమాదం ఎదురౌతుందని ఊహించక పోవటం వల్ల, ప్రక్కకు దూకటం గాని, వెనక్కి గెంతటం గాని చేయలేక పోయారు వాళ్ళు.

బియ్యపు బస్తా మాదిరి వచ్చి పడిన తమ సహచరుడి దెబ్బకు వెల్లికిలా పడిపోయారు.

వారి మీది నుంచి అవతలకు జంప్ చేశాడు షాడో.

"నేను కూడా వస్తున్నాను మిస్టర్ షాడో... నాకోసం కాస్తంత ఆగు..." హడావుడిగా అంటూ తనను అనుసరించటానికి ప్రయత్నించిన మరియా మాటల్ని లెక్క చేయకుండా ఇంటరాగేషన్ గదివైపు పరిగెత్తాడు.

షాడోని బోల్తా కొట్టించిన తన లాటీకర్రను ఆప్యాయంగా తడుముతూ ఆ గది ముందు భాగంలోనే నిలుచుని వున్నాడు ఇన్స్పెక్టర్ సాబ్.

అతనికి అత్యంత సమీపంలోకి పోలేదు షాడో. అసలు పోవాలని కూడా అనుకోలేదు... అటూ ఇటూ చూసేసరికి అతనికి అగుపించాయి బేస్ బాల్ సైజుల వున్న మూడు కొండరాళ్ళు.

మంచినీళ్ళ కుండకు అడ్డుగా పెట్టటానికి తీసుకు రాబడ్డాయి కాబోలు, అదేపనిగా తేమలో మునిగి తేలుతూ వుండటం వల్ల పాకుడు పట్టి నున్నగా బేస్ బాల్స్ మాదిరిగానే తయారై వున్నాయి అవి.

పరిగెత్తటాన్ని ఆపకుండా చటుక్కున ముందుకు వంగి ఒక రాయిని చేతుల్లోకి తీసుకున్నాడు.. అండర్ హేండ్ త్రోలో డాగర్ని విసిరినట్లు బలంగా ఇన్స్పెక్టర్ కేసి విసిరి అంతకు ముందు అడుగుపెట్టిన హాలు వంటి గదిలోకి వెళ్ళిపోయాడు.

లాకప్ గది దగ్గిర జరిగింది ఏమిటో ఒకరు చెప్పవలసిన అవసరం లేకుండానే గ్రహించాడు ఇన్స్పెక్టర్ రణదీర్ సాబ్..

"ఆగు... అక్కడే ఆగు... అడుగు ముందుకు వేశావంటే హతమారిపోతావ్..." అంటూ తన చేతుల్లోని లాటీని మళ్ళీ అతని మీదికి విసిరే ప్రయత్నం చేశాడు.

గింగిరాలు తిరుగుతూ ఆ కర్ర అతని చేతుల్లో నుంచి గాలిలోకి లేవకముందే, కంటికి కనిపించనంత వేగంతో పోయి, అతని ముఖానికి కనెక్ట్ అయింది షాడో విసిరిన కొండరాయి.

అంతకు ముందు తగిలిన దెబ్బ మరోసారి చెదిరి రక్తాన్ని వెలువర్చటం మొదలుపెట్టేసరికి భరించరాని బాధతో విలవిలలాడి పోయాడతను.

"పట్టుకోండి వాడిని... పట్టుకోవటం చేతకాకపోతే కాల్చి చంపేయండి..." స్టేషన్ ముందు భాగంలో నిలుచుని వున్న కానిస్టేబిల్స్‌ని హెచ్చరిస్తూ, ముఖాన్ని చేతులతో అదుముకుని, మోకాళ్ల మీద వాలిపోయాడు.

ఏం జరిగిందో అర్థం కాకపోయినా, పుట్టలో నుంచి వెలువడుతున్న చీమల మాదిరి వరసగా లోపలికి వచ్చేశారు అతని కానిస్టేబిల్స్.

వారి దృష్టి తన మీదికి ప్రసరించక ముందే, ప్రక్క ద్వారాన్ని దాటి ప్రహరీ దగ్గిరికి వెళ్లిపోయాడు షాడో. ఒకే ఒక గంతులో ఏడు అడుగుల ఎత్తున ఆ గోడను అధిగమించి అవతలి వైపున వున్న పొదల్లో పడ్డాడు.

"కాస్తంత నిదానించు మిస్టర్ షాడో... నన్ను కూడా నీతో కలుపుకో..." సన్నపాటి కంఠంతో అతన్ని పిలుస్తూ ఆరు క్షణాలు ఆలస్యంగా ప్రహరీని అధిగమించింది మరియా.

అప్పటికే వంద గజాల దూరం వెళ్లిపోయాడు షాడో నిర్మానుష్యంగా వున్న సందు ఒకటి అగుపించే సరికి, అందులో అడుగుపెట్టి మాయం అయిపోయాడు.

తనతో పాటు ప్రహరీని అధిగమించి, పెద్ద పెద్ద కేకలు పెడుతూ వచ్చేస్తున్న కానిస్టేబిల్స్‌ని కను చివరల నుంచి గమనించుకుంటూ, ఇంకో సందును సెలక్ట్ చేసుకున్నది మరియా. కానిస్టేబిల్స్ తన సమీపంలోకి రాక ముందే షాడో మాదిరి అదృశ్యం అయిపోయింది.

## 7

"రండి సాబ్... రండి రండి... ఎక్కడికి పోయినా, ఎన్ని ప్రదేశాల్లో చక్కర్లు కొట్టినా ఏదో ఒక సమయంలో మీరు నా హోటల్ దగ్గిరికి వచ్చి తీరుతారనే నమ్మకం నాకు వున్నది. సెగలు వెలువరించే చాయ్‌ని పెట్టించి, వేడివేడిగా నాలుగు పరోటాలు కాల్పించనా?" చేతుల్ని బార్లా జాచి ముఖద్వారం ముందున్న మెట్ల మీది నుంచి షాడోని ఆహ్వానించాడు సుక్కూర్ హోటల్ యజమాని.

రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎప్పుడు చూసినా అతను అదే ప్రదేశంలో నిలబడి వుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది షాడోకి.

"అర్జంటుగా తెచ్చి ఇవ్వగలిగితే రెండు కప్పుల చాయ్ పుచ్చుకుంటాను. ఆలస్యం జరిగితే మాత్రం బిల్లు కూడా చెల్లించకుండా వెళ్ళిపోతాను" అంటూ మెట్లు ఎక్కి హోటల్ ముందు భాగంలో అడుగుపెట్టాడు.

"సుక్కూర్ హోటల్లో అడుగుపెట్టిన తర్వాత మీ జోలికి వచ్చే దమ్ము ఈ ప్రపంచంలో ఎవరికీ వుండదు సార్... నిర్భయంగా కూర్చుని నిదానంగా మీకు కావాల్సిన పదార్థాలు తెప్పించుకోండి..." భావగర్భితంగా నవ్వుతూ సమాధానం ఇచ్చాడు సుక్కూర్.

ముందుకు అడుగు వేయటానికి మనస్కరించ లేదు షాడోకి. కంటికి కనిపించని ప్రమాదాల్ని సైతం ముందుగానే కనిపెట్టి వార్నింగ్స్ పంపే తన సిక్స్త్ సెన్స్ ఎటువంటి హెచ్చరికా చేయకపోవటం ఒకింత వింతగా అనిపించింది అతనికి.

వింతగా ఉన్నాయి హోటల్ యజమాని మాటలు... ఏదో ప్రమాదానికి సంకేతం మాదిరిగా ధ్వనిస్తున్నాయి.

అప్పటికప్పుడు వెనుతిరిగి వీధిలోకి వెళ్లి పోవాలని నిర్ణయించుకున్నాడతను. ఆ ఆలోచన కార్యరూపంలోకి మారకముందే గుండెలు అవిసే శబ్దాలు చేస్తూ అటుగా వచ్చాయి రెండు పోలీస్ వాన్స్.

"హెచ్చరిక... బయిజు పట్టణం పౌరులకు పోలీస్ వారి హెచ్చరిక..." సుక్కూర్ హోటల్‌కి వంద గజాలదూరంలో ఆగి ఎనౌన్స్‌మెంట్ మొదలు పెట్టింది ఒక వాన్.

"త్రీ టవున్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబిల్స్‌ని, ఇన్స్‌పెక్టర్‌ని తీవ్రంగా గాయపరిచిన ఉన్మాది ఒకడు నగరంలో సంచరిస్తున్నాడు... అతన్ని పట్టించిన వారికి ప్రత్యేకమైన బహుమతి ఇవ్వబడుతుంది..." చెవులు చిల్లులు పడే శృతిలో వీధిలోని పౌరులందరికీ హెచ్చరికను వినిపించి, ముందుకు దూసుకుపోయిందది.

పది నిముషాల పాటు చక్కర్లు కొట్టి మెల్లిగా హోటల్ ముందుకు వచ్చింది రెండో పోలీస్ వాన్.

నిలుచున్నవారు నిలుచున్నట్లుగానే వెనక్కి పల్టీ కొట్టాలనుకున్నాడు షాడో... ఏదైనా టేబిల్ చాటున తల దాచుకోవాలని నిశ్చయించుకున్నాడు.

"ఏమయింది సాబ్? మనవాళ్ళ జోలికి వచ్చిన ఆ రాక్షసుడిని తప్పకుండా పట్టుకోవాల్సిందే... చెడామడా ఎక్కదీసి నడిబజార్లో ఊరేగించాల్సిందే..." వాన్‌లో నుంచి బయటికి తొంగి చూసిన ఒక పోలీస్ అధికారికి సలాం చేస్తూ అన్నాడు హోటల్ యజమాని.

"రండి సాబ్... లోపలికి వచ్చి ఒక కప్పు వేడి వేడి చాయ్ తాగి పొండి..." అని కూడా అన్నాడు.

అలా పిలిచేవాళ్ళు ఎవరయినా దొరికితే బాగుండునని అనుకుంటున్న వాడి మాదిరిగా అర్జంటుగా వాన్‌లో నుంచి క్రిందికి దిగుతున్న ఇన్స్పెక్టర్ సాబ్‌ని చూసేసరికి దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయింది షాడో గొంతు.

ఇంటరాగేషన్ రూమ్‌లో ఇష్టం వచ్చినట్లు పొర్లిగింతలు పెట్టటం వల్ల దుమ్ముతోను, ధూళితోను నిండి వున్నాయి తన దుస్తులు. ఇన్స్పెక్టర్ రణధీర్ సాబ్ కొట్టిన దెబ్బలకు రక్తపు చారికలు పడి అసహ్యకరంగా అగుపిస్తోంది శరీరం.

అనుమానించాల్సిన అవసరం లేనివారికి సైతం వెయ్యి అనుమానాల్ని కలిగించే విధంగా తయారై వున్న తన అవతారాన్ని గమనిస్తే ఊరికే కూర్చుంటాడా అతను? తన గుట్టును రట్టు చేసి తిరిగి స్టేషన్‌కి లాక్కుపోడూ??

"కూడూ గుడ్డా పెట్టని ఆలోచనలతో టైమ్‌ని వేస్ట్ చేసుకుంటూ కూర్చుంటే సరాసరి నీ ముందుకే వచ్చేస్తాడు ఆ ఇన్స్పెక్టర్... తొక్క వలిచి వాన్లోకి నెట్టిస్తాడు" ఉన్నట్లుండి తన అంతరాత్మ గొంతు విప్పి హెచ్చరించటం మొదలు పెట్టేసరికి మరింతగా దిగాలు పడిపోయాడు షాడో.

తనను అటువంటి సిచ్యుయేషన్‌లోకి నెట్టిన ఆ హోటల్ యజమాని ముఖం పగిలిపోయే విధంగా దెబ్బకొట్టే అవకాశం ఎప్పుడు లభిస్తుందో ఊహించటానికి ప్రయత్నిస్తూ చుట్టూ చూశాడు డిస్పరేట్‌గా.

తలదాచుకునే చోటు ఏదీ ఆ చుట్టుపట్ల అగుపించలేదతనికి... కిచెన్ రూమ్‌లోకి పరిగెత్తే అవకాశం లేకుండా మెట్ల మీదికి అడుగు పెట్టేశాడు ఇన్స్‌పెక్టర్... సడన్‌గా కదిలితే అనుమానం వచ్చేస్తుందతనికి.

లాకప్ రూమ్‌లో మాదిరి ఎదురు తిరిగి అటో ఇటో తేల్చుకోవటం కంటె మరో దారిఏదీ లేదని, అందుకు రెడీ అయిపోతుండగా అతని కర్ణేంద్రియాలకు సోకింది హోటల్ యజమాని కంఠం.

"దేబె ముఖం వేసుకుని అలా నిలువుగుడ్లతో చూస్తావేమిటి టే? లోపలికి పోయి చాయ్ చేయించు... వెళ్ళు... త్వరగా వెళ్ళు..." పట్టరాని కోపంతో పళ్లు పటపట మని కొరుకుతూ ఆర్డర్ ఇచ్చాడతను.

"ఈ పనివాళ్ళతో మేము పడే పాట్లు పగవాళ్ళు కూడా పడకూడదు సాబ్... ఆకలికి మాడి మసి అయిపోతున్నాడనే జాలితో పనిలోకి తీసుకుంటే ఆ బద్మాష్ ఏం చేస్తున్నాడో చూడండి... వీరాధి వీరుడి మాదిరి నడుము మీద చేతులు వేసుకుని నిలుచుంటున్నాడు.. లావుపాటి కర్రతో నాలుగు దెబ్బలు తగిలిస్తే గాని మాట వినడు..." తన బాధల్ని ఇన్స్‌పెక్టర్ సాబ్‌కి చెప్పుకుంటూ ఛెంగున హోటల్లోకి వచ్చాడు.

అతను తనను ఉద్దేశించే అలా మాట్లాడుతున్నాడని అర్థం అయ్యేసరికి షాడోని ఆవరించుకున్నది పట్టరాని సంతోషం.

"నీ గురించి చాలా తప్పుగా అనుకున్నాను భాయీ... చాలా తక్కువగా అంచనా వేసుకున్నాను. అందుకు క్షమించు..." అనుకుంటూ గిరుక్కున వెనుతిరికి, వెనుక భాగంలో వున్న కిచెన్ రూమ్స్‌లోకి పరిగెత్తాడు.

దగ్గర వుండి ఇన్స్‌పెక్టర్‌ని, అతనితో పాటు వాన్‌లో నుంచి దిగిన మరో నలుగురు కానిస్టేబిల్స్‌ని శుభ్రమైన టేబిల్ ముందు కూర్చోబెట్టాడు హోటల్ యజమాని. పెద్ద పెద్ద అడుగులు వేస్తూ కిచెన్‌లోకి వచ్చి షాడోని గుర్రుగా చూశాడు.

"పోలీసులతో పరుగు పందేలు వేయటానికి బోలెడంత తెలివి తేటలు కావాలి... మెరుపు కంటే వేగంగా కదలగల శక్తి వుండాలి... నీ వరస చూస్తుంటే అటువంటి దమ్ము వున్నట్లు నాకు అనిపించటం లేదు..." కోపంగా అంటూ తన వంట మనిషి తయారుచేసిన చాయ్‌ని తనే స్వయంగా తీసుకుపోయి ఇన్స్‌పెక్టర్ సాబ్‌కి, కానిస్టేబిల్స్‌కి అందించాడు.

ఖుషీ అయిపోయాడు ఇన్స్‌పెక్టర్, అతని ఆతిథ్యానికి ఎంతో ఆనందించాడు.

"జాగ్రత్తగా వుండాలి భాయీ... మాకు కావల్సిన బద్మాష్ ఇటుగా రావటం జరిగితే వెంటనే మాకు వార్త పంపించాలి నువ్వు..." అంటూ అతని భుజం తట్టి వాన్ దగ్గరికి వెళ్ళిపోయాడు.

వాన్ కదిలి దూరంగా వెళ్ళి పోయేదాకా మెట్ల మీదనే నిలబడి మెల్లిగా లోపలికి వచ్చాడు హోటల్ యజమాని.

వంటమనిషి దగ్గిర మరో చాయ్ కప్పును తీసుకుని, కిచెన్‌లోనే ఒక పక్కగా వున్న ఊకబస్తా మీద కూర్చున్నాడు షాడో.

"నీ మేలు మరిచిపోలేను భాయీ... నాకోసం చాలా రిస్క్ తీసుకున్న నీ మంచితనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను" అంటూ తను తాగిన చాయ్‌కి, పోలీసులు పుచ్చుకున్న వాటికీ డబ్బు చెల్లించటం కోసం పాంటు జేబులో చేయి పెట్టాడు.

పెట్టిన వెంటనే జ్ఞప్తికి వచ్చిందతనికి - కాలి బూట్లతో సహా, పాంటు బెల్టును కూడా వదిలిపెట్టకుండా ఇన్స్‌పెక్టర్ రణధీర్ సాబ్ స్వంతం చేసుకున్న సంగతి.

ముక్కు ముఖం తెలిసిన వాళ్ళెవరూ లేని ఆపరాయి ప్రదేశంలో చిల్లిగవ్వ కూడా చేతుల్లో లేకుండా ఆవారా మాదిరి నిలబడి పోయిన తన దుస్థితిని తలుచుకునే సరికి మతిపోయినంత పని అయిందిఅతనికి.

తన పరిస్థితిని హోటల్ యజమానికి ఎలా తెలియ చేయాలో అర్థం కాక, విసుగ్గా తల విదిలిస్తున్న అతని ముందుకు జాచబడింది ఒక చేయి.

అదిరిపడి తల ప్రక్కకు తిప్పిన అతనికి వెంటనే అగుపించాడు ఖరీదయిన దుస్తులు ధరించి వున్న ఒక మధ్య వయస్కుడు.

లావుపాటి నోట్ల కట్టలు నాలిగింటిని పట్టుకొని వున్నాడతను. వాటిని షాడో ముందుకు జాస్తున్నాడు.

తన కనులు తనను ఏమారుస్తున్నాయేమోనని అనిపించింది షాడోకి... పోలీస్ స్టేషన్లో తగిలిన దెబ్బల వల్ల మతి తప్పి రకరకాల భ్రమలు కలుగుతున్న ఫీలింగ్ కూడా అతన్ని ఆవరించుకున్నది.

"నువ్వు భ్రమపడటం లేదు మిస్టర్ షాడో... స్టేషన్లో నువ్వు తిన్న దెబ్బలు నీ మతిని మందగింప చేయటం లేదు... యువ్వార్ క్వయిట్ ఆల్ రైట్..." అంటూ కిచెన్‌ని ఆనుకొని వున్న మరో గదిలో నుంచి అతని ముందుకు వచ్చారు ఇంకో తొమ్మిది మంది ఆగంతకులు.

నోట్ల కట్టల్ని ముందుకు జాచిన పెద్దమనిషి మాదిరిగానే ఖరీదయిన దుస్తులు ధరించి వున్నారు వాళ్ళు... ప్రపంచంలో దారుణమైన డబ్బున్న వాళ్ళు తప్ప మరెవరూ ఎఫోర్డ్ చేయలేని సుగంధ ద్రవ్యాల్ని వారు ఉపయోగిస్తున్నారు...

వారి వదనాల మీద ప్రత్యక్షం అయిన చిరునవ్వుల్ని గమనించే సరికి, తన వంటి మీద చీమలు, జెర్రులు పాకినట్లు అనుభూతిని పొందాడు షాడో. అప్పటికప్పుడు అక్కడి నుంచి అవతలికి దూకి పిక్కబలం చూపించాలనే కోరికను అతి ప్రయత్నంమీద అదిమి పట్టుకుంటూ తలవంచి మర్యాద పూర్వకంగా విష్ చేశాడు వారందరికీ.

"ముక్కు ముగం తెలిసిన వారెవరూ లేని పరాయి ప్రదేశంలో వంటరిగా ఆవారా మాదిరిగా నిలబడిపోయినట్లు నువ్వు అనుకోవాల్సిన అవసరం ఎంత మాత్రము లేదు... నీకు ఎటువంటి సహాయం కావాల్సి వచ్చినా వెంటనే చేసేందుకు సిద్ధంగా వున్నది మా గాంగ్.... ఈ విషయాన్ని నీకు ఇంతకు ముందే మా మరియా ద్వారా తెలియజేయటం జరిగింది..."

షాడో మనస్సులో అంతకు ముందు మెదిలిన భావాలు తమకు అర్థం అయినట్లు మృదువైన స్వరంతో అన్నాడు కిల్లర్స్ గాంగ్ సుప్రీమ్ కమాండ్‌లో సీనియర్ మెంబర్ అయిన ఒక పెద్ద మనిషి.

హోటల్ యజమాని తనను ఎందుకు కాపాడాడో అప్పుడు అవగతం అయింది షాడోకి.

"సుక్కూర్ హోటల్ మాదే మిస్టర్ షాడో... చాలా కాలం నుంచి మేమే ఈ హోటల్‌ని మెయింటైన్ చేస్తున్నాం... నువ్వు షబ్బూపాషా కోసం

యిక్కడికి వస్తున్నాట్లు తెలిసిన వెంటనే, మా మెంబర్‌ని హెచ్చరించాం - నీకు కావాల్సిన హెల్ప్ చేయమని ఆదేశించాం..." సుక్కూర్ హోటల్ యజమాని మొదటి నుంచీ షాడో మీద చూపిస్తున్న ఆదరణ, వాత్సల్యానికి కారణాన్ని వెంటనే వివరించాడు ఆ సుప్రీమ్ కమాండ్ సీనియర్ మెంబర్.

ముఖమంతా నోరు చేసుకుని నవ్వుతూ షాడో వైపు తిరిగాడు సుక్కూర్ హోటల్ యజమాని. వినయంగా ముందుకు వంగి సలాం చేశాడు.

ప్రపంచంలో వున్న శత్రువులందరిలోకి తనసే ప్రధమ శత్రువు క్రింద భావించే కిల్లర్స్ గాంగ్, తనతో అంత చనువుగా మాట్లాడటం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు షాడోకి.

ఆ విషయాన్ని కూడా అతి తేలికగా పసి కట్టేశాడు. సుప్రీమ్ కమాండర్ సీనియర్ సభ్యుడు.

"మనం మనసులు విప్పి మాట్లాడుకోవటానికి సరియైన ప్రదేశం కాదు ఇది... లెటజ్ గో టు సమ్ అదర్ ప్లేస్ " అంటూ వెనక్కి తిరిగి పెద్దగా చప్పట్లు చరిచాడు.

మంత్రం వేసినట్లు వెనుక ద్వారంలో ప్రత్యక్షం అయింది మరియా.

"ఎవ్రీ థింగ్ ఈజ్ రెడీ సర్... మీరు బయలు దేరటమే ఆలస్యం" వినయంగా తల వంచుతూ ఎరుక పరిచింది.

షాడో భుజం మీద చేయి వేసి అటుకేసి బయలుదేరాడు సీనియర్ సభ్యుడు. అతని స్పర్శ తన వంటిని జలదరింప చేస్తున్నా ఆ విషయాన్ని బయటికి తెలియనీయకుండా జాగ్రత్త పడుతూ అతనితో కలిసి హోటల్ వెనుక భాగంలో వున్న పెద్ద సందులోకి పోయాడు షాడో.

తళ తళ మెరుస్తున్న ఫియట్ కార్లు నాలుగు వరుసలో నిలబడి వున్నాయి అక్కడ. తెల్లటి యూనిఫాంలను ధరించి పోత పోసిన విగ్రహాల మాదిరి వాటి దగ్గిర నిలచుని వున్నారు కిల్లర్స్ గాంగ్ డ్రయివర్లు.

"అడుగు ముందుకు వేశావంటే నీ పని ఖతమ్ అయి పోయినట్లే... నీ అంతు చూడటానికి కంకణం కట్టుకున్న ఈ పెద్ద మనుష్యుల మాటల్ని నమ్మావంటే నట్టేట్లో మునిగి పోయినట్లే..." ఉన్నట్లుండి హెచ్చరికల్ని పంపటం మొదలుపెట్టిన అంతరాత్మమాటల్ని వినిపించుకోనట్లే నటిస్తూ, తనకు దగ్గిరిగా వున్న ఫియట్‌లో కూర్చున్నాడు షాడో.

"నీవంటి వాడు ఉపయోగించవలసిన కారు కాదు ఇది... జట్కాబళ్ళు తప్ప మంచి మంచి వెహికిల్స్ ఒక్కటి కూడా కనిపించని ఈ పట్టణంలో మా గాంగ్ కి చెందిన పెద్ద పెద్ద కార్లను తీసుకువస్తే అందరికీ అనుమానం కులగుతుందని, ఈ చిన్న చిన్న బళ్ళను ఉపయోగించాల్సి

వచ్చింది. నువ్వు అన్యధా భావించవని ఆశిస్తున్నాము..." అంటూ అతని ప్రక్కనే ఆశీనుడయినాడు సీనియర్ సభ్యుడు.

ఒకరి వెనుక ఒకరుగా తరువాతి కార్లలో కూర్చున్నారు మిగిలిన సభ్యులు.

పొగలు విడుస్తూ బయలుదేరాయి అవి... అరగంట తరువాత బయిజు సిటీ దక్షిణ భాగంలో సిటీ లిమిట్స్‌కి కొంచెం అవతలగా చిన్న కొండ గుట్టమీద కట్టబడి వున్న ఒక పురాతన కాలపు బంగ్లా ముందు ఆగాయి.

అందమైన సిల్కు దుస్తులు ధరించిన సుందరాంగులు వరుసల్లో వచ్చేశారు బంగ్లా ముఖద్వారం దగ్గిరికి.

బరువైన బంగారు పన్నీరు బుడ్లలో ఖరీదయిన సుగంధ ద్రవ్యాల్ని నింపుకుని, షాడో మీదా, సుప్రీమ్ కమాండ్ సభ్యుల మీదా చల్లుతూ లోపలికి ఆహ్వానించారు.

బంగ్లా ముందు భాగంలోని విశాలమైన హాలులో సర్వసన్నద్ధంగా వున్నారు గాంగ్‌కి చెందిన వైద్యులు నలుగురు.

ఆరుగురు ముద్దు గుమ్మలు తమకు హెల్ప్ చేస్తుండగా షాడోని ఒక ప్రక్క గదిలోకి తీసుకుపోయారు వాళ్ళు.

చినిగి పీలికలై పోయిన అతని దుస్తుల్ని తొలగించి, పన్నీటితో శరీరాన్ని శుభ్రం చేశారు... వంటి మీద గాయాలకు మందులు పూసి, పరిశుభ్రమైన దుస్తుల్ని ధరింప చేశారు.

అంగుళంలో ఇరవయ్యో వంతు కూడా తేడా లేకుండా చక్కగా సరిపోయిన ఆ పాంటు షర్టును సర్దుకుంటూ, మరో నలుగురు బిబ్బోకవతులు దారి చూపిస్తుండగా, ఇంకో పెద్ద గదిలోకి పోయాడు షాడో.

ఖరీదయిన కార్పెట్లు పరిచి వున్నాయి అక్కడ... నెమలి ఈకల కంటె మృదువుగా వుండే సోఫాలు అరేంజి చేసి వున్నాయి.

"కమాన్ మిస్టర్ షాడో... మా సమీపంలోకి వచ్చి కూర్చో..." ఒక సోఫాలో నుంచి లేచి నిలబడుతూ ఆహ్వానించాడు సుప్రీమ్ కమాండ్ సీనియర్ సభ్యుడు.

ఆ సోఫా ప్రక్కనే అందమైన రోజ్‌వుడ్ టీపాయ్ మీద పెట్టబడి వున్నది ఒక పెద్ద బంగారు పళ్ళెరం.

అందులో వున్నది షాడో ఉపయోగించేటటువంటి పవర్‌ఫుల్ రివాల్వర్ ఒకటి. ఎర్రటి పట్టుగుడ్డలో చుట్టబడి కనిపిస్తోంది.

అతను వాడే డాగర్ వంటి పదునైన ఆయుధం.

నగిషీలు చెక్కబడి వెండి కప్పుల్లో సెగలు వెలువరుస్తున్న చాయ్ తీసుకురాబడింది అతని ముందుకు.

చాయ్ తాగటం యిష్టం లేని పక్షంలో, అతను ఆప్యాయంగా పుచ్చుకునే రమ్ బాటిల్ రెడీ చేయబడింది.

"మీ మర్యాదలకి ఎంతో సంతోషించాను... నన్ను వెతికి పట్టుకోవటానికి, నాకోసం ఒక ఆడపిల్లను పోలీస్ లాకప్‌లోకి పంపించటానికిగల కారణాన్ని చెపితే ఇంకా బాగా సంతోషిస్తాను..." రమ్ బాటిల్‌ని తీసుకొని గటగటా నాలుగు గుటకలు వేయాలన్న కోరికను అతి బలవంతంగా అదుముకుంటూ అన్నాడు షాడో. సోఫా వెనక్కి చేరగిలబడి, చాయ్ కప్పును తీసుకోవటంతో తృప్తి చెందాడు.

చాయ్ కప్పును అతను క్రింద పెట్టిన వెంటనే బంగారు పళ్ళెరంలో పనామా పాకెట్‌ని, చిన్న చిన్న వజ్రాలు పొదిగిన ట్రైటర్‌ని అతని ముందుకు జాచింది ఒక లలనామణి.

పనామా వెలిగించుకుని గుండెల నిండా పొగను పీల్చుకుంటూ సోఫాలో మరింత వెనక్కి వాలాడు షాడో.

"నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకునేటంత వరకూ నిన్ను డిస్టర్బ్ చేయటం మంచిది కాదని మాకు అనిపిస్తోంది. అయినా అతి తక్కువగా వున్న వ్యవధి మూలకంగా నీకు కష్టాన్ని కలిగించక తప్పటం లేదు..."

పొడుగాటి గొట్టంలో నుంచి గుడగుడమని శబ్దం చేసే పొగను పీల్చుకుంటూ అన్నాడు సుప్రీమ్ కమాండ్ సీనియర్ మెంబర్.

"థాయ్‌లాండ్ పరిసర ప్రాంతాల్లో మా గాంగ్‌కి సంబంధించిన పనుల్ని సూపర్‌వైజ్ చేసే టైగర్ జానీ గురించి కూడా నీకు తెలుసనే అనుకుంటున్నాము. యామై రైట్!" ఉన్నట్లుండి ముందుకు వంగుతూ సూటిగా ప్రశ్నించాడు.

సుతి మెత్తగా వున్న ఆ సోఫాలో అలాగే మేను వాల్చి హాయిగా నిద్రపోవాలని అనిపిస్తోంది షాడోకి... తెరలు తెరలుగా వచ్చేస్తున్నది బ్రహ్మాండమైన నిద్ర.

ఫరూకీ పార్కు దగ్గిర తనకు అగుపించిన దౌలత్‌ఖాన్ యొక్క బాస్ ఆ టైగర్ జాన్ ప్రసక్తి వచ్చేసరికి అమాంతంగా తేలిపోయిందా మగత.

పనామా పొగల్ని రింగులు రింగులుగా వదులుతూ నిఠారుగా కూర్చున్నాడు.

అనవసరమైన మాటలతో టైమ్‌ని వృధా చేయలేదా సుప్రీమ్ కమాండ్ సీనియర్ సభ్యుడు... మాటల్ని తూచి తూచి ఉపయోగిస్తూ తాను చెప్పదలచుకున్నది అతి త్వరగా ముగించాడు.

"కొద్ది కాలం క్రితం గాంగ్ నుంచి విడిపోయాడు టైగర్ జాన్. తాను స్వయంగా కొంతమంది అనుచరుల్ని రిక్రూట్ చేసుకుని ఆ బంగ్లాదేశ్‌లో

మకాం పెట్టాడు. ఈ చుట్టుపట్ల వున్న ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించి, అవసరం అయిన వారందరికీ ఆయుధాల్ని సప్లయ్ చేసి అశాంతి, ఆందోళనను రెచ్చగొట్టడం ప్రారంభించాడు"

"అదను చూసుకొని బంగ్లాదేశ్‌ని స్వాధీన పరుచుకోవటం అతని ఆశయం. బర్మాదేశం చుట్టు పట్ల అడవుల్లో పండించబడే ఓపియమ్‌ని తను ఖరీదు చేసి ప్రపంచంలోని దేశాలన్నిటికి రవాణా చేయటం, అమితమైన ధనం సంపాదించి ఎవరికీ అందరానంత ఎత్తుకు ఎదిగిపోవటం అతని లక్ష్యం"

"అల్లర్లను అరాచకాలను సృష్టించి, అవసరం అయితే యుద్ధాలను ప్రోత్సహించి, ప్రపంచంలోని దేశాలన్నిటినీ ఒకే పతాకం క్రిందికి తీసుకు రావాలని వాంఛించే మా గాంగ్... ఆ టైగర్ జానీ చేస్తున్న పనుల్ని తప్పు పట్టలేకపోయినా, తన ఆశయ సాధన కోసం అతను ఎంచుకున్న మార్గాన్ని మాత్రం హర్షించ లేకపోయింది."

"ఆర్థికంగాను, వైజ్ఞానికంగాను ఎంతో అభివృద్ధిని సాధించి, అనతికాలంలోనే అగ్రరాజ్యాల సరసన నిలబడబోతున్న భారతదేశానికి ఆయుధాల్ని పంపించి, అనవసరమైన తలనొప్పుల్ని తెచ్చుకోవద్దని మేము చేసిన హెచ్చరికను పాటించటం లేదతను... అత్యంత మేధాశక్తి

సంపన్నులయిన ఇండియన్ స్పెషల్ బ్రాంచి, ఇండియన్ సి.ఐ.బి.ల దృష్టిని తనమీదికి మరల్చుకోవద్దని ఎంత చెప్పినా వినటం లేదు."

"బంగ్లాదేశ్ వంటి ఒక చిన్న రాజ్యాన్ని ఆక్రమించుకోవటం కోసం మీ నేర పరిశోధన సంస్థలతో తగాదాకి దిగటం మాకు ఇష్టం లేదు... టైగర్ జాన్ కిల్లర్స్ గాంగ్ నించి విడిపోయి వ్యక్తిగతంగా ఇటువంటి పనులు చేస్తున్నాడంటే ఎవరూ నమ్మరని మాకు తెలుసు. అతన్ని రెచ్చగొట్టింది కిల్లర్స్ గాంగ్ మాత్రమేనని అంటారని కూడా తెలుసు. అందుకే అతన్ని ఆపటానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేసి విఫలం అయ్యాము"

కంచుగంట వంటి కంఠంతో ఖంగు ఖంగున చెప్పుకుంటూ పోతున్న ఆ సుప్రీమ్ కమాండ్ సీనియర్ సభ్యుడి మాటలకు వెంటనే అడ్డు తగిలాడు షాడో.

"మీ మాట వినని మీ మెంబర్లకు మీరు ఎటువంటి శిక్షలు విధిస్తారో అందరికీ తెలుసు. టైగర్ జాన్ నోరు ఎలా మూయించాలో మీకు తెలియలేదని చెప్పటం చాలా హాస్యాస్పదంగా వున్నది"

కంచుగంట వంటి కంఠంతో ఖంగు ఖంగున చెప్పుకుంటూ పోతున్న ఆ సుప్రీమ్ కమాండ్ సీనియర్ సభ్యుడి మాటలకు వెంటనే అడ్డు తగిలాడు షాడో.

ఆ మాటలకు అఫెండ్ కాలేదా సభ్యుడు. హుక్కా గొట్టాన్ని అవతల పెడుతూ చిన్నగా నవ్వాడు.

"టైగర్ జాన్ ప్రాణాలు తీసి అతని ఈ రాక్షస పథకాల్ని ఆపు చేయటం అరక్షణంలో పని అని మేము అనుకొన్న మాట యదార్థమే... అయితే కిల్లర్స్ గాంగ్ తన ప్రయత్నాలకు అడ్డు తగులుతుందని తెలిసిన మరుక్షణం అతను మాకు ఒక లేఖ వ్రాశాడు..." అంటూ దూరంలో నిలుచుని వున్న మారియాను దగ్గిరికి పిలిచాడు.

మడతల పడి నలిగిపోతున్నట్లున్న ఒక కాగితాన్ని తీసుకు వచ్చి షాడో ముందుకు జాచిందామె.

వంకర టింకర్లుగా వున్న దస్తూరితో గాంగ్ సుప్రీమ్ కమాండ్‌ని హెచ్చరించాడు ఆ లేఖలో - టైగర్ జాన్.

*"నా జోలికిగాని, నా అనుచరుల జోలికి*
*గాని మీ అనుచరులు రావటం జరిగితే,*
*బంగ్లాదేశ్‌ని సముద్రంలో కలిపేస్తాను.*
*ఆపని మీరే చేశారని ప్రపంచానికంతటికీ తెలియజేస్తాను"*

ఎటువంటి ఆర్భాటమూ లేకుండా ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా సూటిగా తెలియజేస్తున్న ఆ లెటర్‌ని మరో రెండుసార్లు చదివేసరికి మతిపోయినంత పని అయింది షాడోకి. సగం వరకూ కాలిన పనామాను

అవతలికి విసిరి మరో సిగరెట్‌ని వెలిగించుకుంటూ సీనియర్ సభ్యుడి వంక చూశాడు.

"బంగ్లాదేశ్‌ని ఏవిధంగా సముద్రంలో కలుపుతానని టైగర్ జాన్ మమ్మల్ని బెదిరించాడో మాకు అర్థం కాలేదు. ఆటంబాంబు వంటి ఆయుధాల్ని అతను సిద్ధం చేసుకున్నాడేమో తెలుసు కోవటానికి మేము చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి... ఏ బలం చూసుకుని అతను ఈవిధంగా సవాలు చేస్తున్నాడో తెలుసుకోకుండా అతన్ని మట్టుబెట్టటానికి ప్రయత్నిస్తే ఫలితాలు చాలా బాధాకరంగా వుంటాయనే అనుమానంతో మేము తటపటాయిస్తూ వుండగా, మా అదృష్టం కొద్దీ నువ్వు ఈ పట్టణంలోకి వచ్చినట్లు తెలిసింది.

"ఢాకా సిటీలో చాలా పెద్ద మనిషిగా చెలామణీ అవుతూ ఎవరికీ తెలియకుండా ఈ విద్రోహచర్యల్ని కొనసాగిస్తున్న టైగర్ జాన్‌ని నువ్వు ఆపాలి మిస్టర్ షాడో. బంగ్లాదేశ్‌ని అతను సమూలంగా సముద్రంలో కలుపుతానని బెదిరించటం వెనుక వున్న రహస్యాన్ని తెలుసుకుని అతని పీచం అణచాలి"

"నీకు ఎటువంటి సహాయం కావాలన్నా గాంగ్ చేస్తుంది. ఎంతమంది అసిస్టెంట్స్ కావాలన్నా సిద్ధం చేస్తుంది... వెంటనే ఢాకాసిటీకి వెళ్ళి టైగర్ జాన్ ఆటకట్టించాలి... కెన్ యూ డూ దిస్ మిస్టర్ షాడో??"

దూరంగా పెట్టిన హుక్కా గొట్టాన్ని తిరిగి అందుకుంటూ అడిగాడు సీనియర్ సభ్యుడు.

అయిదు లక్షల మంది వస్తాదుల్ని టైగర్ జాన్ మీదికి పంపాల్సి వచ్చినా కనురెప్ప కూడా కదిలించకుండా, కూర్చున్న చోటు నుంచి లేవకుండా ఆ పని చేయగల ఆ పెద్దమనిషి వంకా, అతని సహచరుల వంకా పరిశీలనగా చూస్తూ మెల్లిగా తల వూపాడు షాడో.

గాంగ్‌లో పని చేసేవారెవరో, ఎలా వుంటారో బాగా తెలుసు టైగర్ జాన్‌కి. తనను మట్టుబెట్టడానికి గాంగ్ మెంబర్లు బయలుదేరారని అర్థం అయిన మరుక్షణం ముడతలు పడిన లెటర్లో బెదిరించినట్లు బంగ్లాదేశ్‌ని సర్వనాశనం చేసేస్తాడు.

బంగ్లాదేశ్ నాశనం అయితే, ఆ షాక్ భారతదేశానికి కూడా తగులుతుంది... ఆ నష్టంలో కొంతభాగం తన మాతృభూమి కూడా భరించవలసిన పరిస్థితి ఎదురౌతుంది.

"ఆల్‌రైట్ జంటిల్మెన్... ఐయామ్ గోయింగ్ టు ఢాకా..." అంటూ సోఫాలో నుంచి లేచిన షాడోని చూసి ఆనందంతో చప్పట్లు కొట్టారు సుప్రీమ్ కమాండ్ సభ్యులు అందరూ.

"నీకు అసిస్టెంట్‌గా మా మరియా పని చేస్తుంది... నీకు కావాల్సిన వసతులన్నిటినీ తను సమకూరుస్తుంది." అంటూ సోఫా ప్రక్కనే బంగారు

పళ్ళెరంలోని రివాల్వర్‌ని, డాగర్‌ని షాడోకి స్వయంగా అందించాడు సుప్రీమ్ కమాండ్ సీనియర్ మెంబర్.

"విష్ యూ ఆల్ ది బెస్ట్" అంటూ కరచాలనం చేశాడు.

# 8

ఢాకా సిటీకి వాయువ్య దిశలో లిమిట్స్‌ని ఆనుకుని వుండే కోటవంటి ఒక పురాతన కాలపు భవంతిని ఖరీదు చేశాడు టైగర్ జాన్.

కోట సింహద్వారం మాదిరి ఎత్తుగా దృఢంగా కనిపించే మెయిన్ గేటు ముందు కాపలా వుంచాడు రాక్షసుల వంటి పదిమంది అనుచరుల్ని.

"ఈ భవనంలోకి ప్రవేశించే ప్రయత్నంలో ఇప్పటివరకూ ఇరవై ఎనిమిది మంది మా వస్తాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు... చీమ చిటుక్కుమంటే చాలు, వేట కుక్కల మాదిరి వచ్చేస్తారు ఆ రాక్షసులు..."

వంద గజాల దూరంలో వున్న ఒక చింత చెట్టు చాటున నిలబడుతూ షాడోకి చెప్పింది మరియా.

మెయిన్ గేటులో నుంచి భవనంలోకి పోయే ఆలోచనను విరమించుకున్నాడు షాడో... చింత చెట్టు చాటు నుంచి కదిలి, ఎడమ ప్రక్కకు బయలుదేరాడు.

పన్నెండు అడుగుల ఎత్తు వున్నది భవనం చుట్టూ కట్టబడిన ప్రహరీ గోడ... చీకటి మాటున పరాయి వారెవరూ పైకి ఎక్కకుండా హైటెన్షన్ విద్యుత్ వైర్లు అమర్చి వున్నాయి ఆ గోడమీద.

అరగంట... గంట... రెండు గంటలు గడిచిపోయిన తరువాత కూడా ఆ భవనంలోకి రహస్యంగా ఎంటర్ అయ్యే మార్గం అగుపించక పోయేసరికి, విపరీతమయిన విసుగు జనించింది షాడోకి.

సరయిన జాగ్రత్తలు తీసుకుంటే,ప్రహరీ మీద వున్న విద్యుత్ వైర్ల వల్ల ఎటువంటి ప్రమాదము వుండదని అనిపించింది అతనికి.

అంతలోనే అతి వ్యంగ్యంగా వెక్కిరించింది అతని అంతరాత్మ.

"నీ పాటి తెలివి ఆ టైగర్ జాన్‌కి వుండదని అనుకున్నావా?" అంటూ.

ఆ మాటల్ని వినిపించుకోనట్లు నటిస్తూ, క్రికెట్ బాల్ సైజులో వున్న ఒక పలుకు రాయిని అందుకున్నాడు షాడో... ఊపిరి బిగపట్టి అతని నెమ్మదిగా విసిరాడు ఆ రాయిని, విద్యుత్ వైర్ల మధ్యలో నుంచి.

అలవోకగా లేచి అవతలి ప్రక్కన వున్న చిన్న పూలతోటలో పడిందా రాయి. పడిన మరుక్షణం ట్రిప్ అయ్యాయి తోట నిండా అమర్చి వున్న బగ్గర్ అలారంలు. ఫైరింజన్స్ మాదిరి చెవులు చిల్లులు పడేటట్లు రొదలు ప్రారంభించాయి

సుశిక్షితులైన మిలటరీ సైనికుల మాదిరి భవనంలో నుంచి బయటికి పరుగెత్తుకు వచ్చారు అనేకమంది దృఢకాయులు.

"ఎవరది? ఎవరు ప్రహరీ గోడ దగ్గిర నిలుచున్నది?" ఖంగు ఖంగుమంటున్న కంఠాలతో ప్రశ్నిస్తూ ప్రహరీ బయటికి అడుగుపెట్టారు.

అనవసరమైన ఆలోచనలతో అక్కడే తచ్చట్లాడుతూ వుంటే, తమ గుట్టు రట్టు అవటం తప్పనిసరి అని గ్రహించి, అర్జంటుగా వెనక్కి పరిగెత్తాడు షాడో. భవనానికి రెండు వందల గజాల దూరంలో వున్న ఒక చిన్న పూరింటి చాటుకు పోయి మోకరించి కూర్చున్నాడు.

ప్రహరీ గోడ చుట్టూ నాలుకు రౌండ్లు కొట్టి లోపలికి వెళ్ళిపోతారు టైగర్ జాన్ అనుచరులు... మరో రెండు నిముషాలు ఆగి, మళ్లీ ప్రహరీ దగ్గిరికి చేరుకోవాలి తను... ఏదో ఒక విధంగా లోపలికి పోయేందుకు మార్గాన్ని అన్వేషించాలి...

షాడో ఆలోచనలు పూర్తి కానేలేదు అతను తలదాచుకున్న ఆ పూరింటికి అవతలి వైపు నుండి వినవచ్చాయి బరువైన బూట్ల చప్పుళ్ళు.

"గాలించండి... ఒక్క అంగుళాన్ని కూడా వదిలి పెట్టకుండా అన్ని ప్రదేశాల్ని వెతకండి..." ఉరుములాంటి కంఠం ఒకటి అతి స్పష్టంగా అతని చెవులకు చేరింది.

అదిరిపడి ముందుకు చూసేసరికి అగుపించారతనికి పదిమంది పోలీస్ కానిస్టేబిల్స్. నల్లగా మెరుస్తున్న రివాల్వర్‌ని పట్టుకుని వారిని లీడ్ చేస్తున్న ఇన్స్‌పెక్టర్ ఒకతన్ని గమనించేసరికి దాహం వేస్తున్నట్లు ఎందుకు పోయింది అతని గొంతుక.

"ఢాకా సిటీలో వున్న పోలీసులందర్నీ తన జేబులో వేసుకున్నాడు టైగర్ జాన్. చిటికెవేస్తే చాలు పరిగెత్తుకు వచ్చే విధంగా మచ్చిక చేసుకున్నాడు..." ఆ విషయాన్ని అంతకు ముందే అతనికి తెలియచేయనందుకు బాధపడుతూ వెంటనే అన్నది మరియా.

కూర్చుని వున్న చోటి నుంచి లేచి దూరంగా పారిపోయేందుకు అవసరమైనంత వ్యవధి తమకు లేదని అర్థం అయ్యేసరికి మరింతగా ముడిపడింది షాడో నొసలు.

అతని మనస్సులో మెదలటం ప్రారంభించిన ఆలోచనలు పూర్తికాక ముందే అతని ఉనికిని పసికట్టేశాడు ఒక కానిస్టేబిల్.

"ఎవరది? ఎవరా ఇంటి చాటున??" రంఢోలు వంటి కంఠంతో అరుస్తూ అటుపరిగెత్తుకు వచ్చాడు.

ఏ మాత్రం ఆలస్యం చేసినా, అంతవరకూ పడిన కష్టం అంతా వృధా అయిపోతుందని గ్రహించి, అమాంతంగా ప్రక్కన వున్న మరియాను కౌగలించి పట్టుకున్నాడు షాడో.

అందమైన ఆమె ముఖం మీద ముద్దుల వర్షాన్ని కురిపిస్తూ క్రిందికి వంచాడు.

అదిరిపడి అతన్ని అవతలకు నెట్టబోయిందామె. "కొంపలు మునిగిపోయే ప్రమాదం మన మీదికి వచ్చేస్తుంటే ఇదేం పని మిస్టర్ షాడో? నీకు మతి ఏమైనా పోయిందా?" అని అడగబోతూ, ఆఖరి క్షణంలో మ్రింగేసిందా మాటల్ని.

తమకాన్ని ఆపుకోలేక పోతున్నట్లు అస్పష్టమైన శబ్దాలు చేశాడు షాడో. ఆమెను మరింత గట్టిగా పట్టుకొని మీదికి వాలాడు.

"ఎవరు మీరు? ఏం చేస్తున్నారిక్కడ??" దురుసుగా అడుగుతూ, లాటీతో అతని భుజాల మీద మోదబోయాడు పరుగు పరుగున వచ్చిన కానిస్టేబిల్.

తనకు కనిపించిన దృశ్యాన్ని గమనించే సరికి, అప్రయత్నంగా పరిగెత్తుకు వచ్చేసింది అతని పెదవుల మీదికి ఒక చిరునవ్వు.

తమ రహస్యం బట్టబయలు అయిపోయినట్లు , అందుకు ఎంతగానో సిగ్గుపడుతున్నట్లు ఫోజు ఇస్తూ, మరియాని వదిలి గబగబా లేచి నిలబడ్డాడు షాడో.

"మీకు అసలు బుద్ధి లేదు. ఇంటి దగ్గర ఎవరికీ తెలియకుండా వుండాలంటే ఏ హోటల్‌కో పోవాలి గాని, ఇలా ఇళ్ల చాటున మకాం

వేస్తారా?" వయసులో వుండగా పెద్దవాళ్ళకు తెలియకుండా తను చేసిన పాడు పనులు జ్ఞప్తికి వచ్చాయి కాబోలు, పైకి ఉబుకబోతున్న నవ్వును అదుముకుంటూ కఠినంగా అన్నాడు ఆ కానిస్టేబిల్.

నోటికి వచ్చిన సమాధానాన్ని అతనికి వినిపించేందుకు షాడో రెడీ కాకముందే పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వచ్చేశాడు ఇన్స్పెక్టర్ సాబ్. కానిస్టేబిల్ మాదిరిగా ఇష్టం వచ్చినట్లు వారిద్దరినీ దుమ్మెత్తి పోశాడు.

"తీసుకు పదండి... సంకెళ్ళు వేసి స్టేషన్‌కి తీసుకు పోతేగాని వీళ్ళకి బుద్ధి రాదు..." అంటూ ఆర్డర్ ఇచ్చి, అవతలకు పోయి నిలబడ్డాడు.

విపరీతమైన భయంతో వణికిపోతున్నట్లు ముఖం పెట్టిన మరియాని, చేతులు నులుముకోవటం ప్రారంభించిన షాడోని రెండు క్షణాల పాటు పరిశీలనగా చూసి, నెమ్మదిగా దగ్గిరికి జరిగాడు కానిస్టేబిల్.

"మాటలు కరుకుగా వున్నా మనసు మాత్రం మహా మెత్తన మా ఇన్స్పెక్టర్ సాబ్‌కి. ఎంతో కొంత చేతిలో పెడితే అమితంగా సంతోషిస్తాడు" అంటూ వెల్లడించాడు అసలు రహస్యాన్ని.

తట్టుకోలేనంత కష్టంలో నుంచి తేలికగా బయటపడే మార్గాన్ని సూచించినందుకు కృతజ్ఞతా పూర్వకంగా అతనికి సమర్పించుకున్నాడు షాడో రెండు కరెన్సీ నోట్లని. బయిజూ సిటీలో నుంచి బయలుదేరుతున్న

సమయంలో సుప్రీమ్ కమాండ్ తనకు బహూకరించిన వాలెట్ లో నుంచి మరో రెండు నోట్లను తీసి ఇన్స్పెక్టర్ సాబ్ ముందుకు జాచాడు.

"ఇంకెప్పుడూ ఈ వీధుల్లో కనిపించకండి" ఖంగు మంటున్న కంఠంతో ఆర్డర్ ఇస్తూ టైగర్ జాన్ భవనం వైపు వెళ్లిపోయాడా పెద్దమనిషి.

గుండెల మీద నుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూరుస్తూ సుప్రీం కమాండ్ సప్లయి చేసిన రిస్ట్ వాచి వైపు చూసుకున్నాడు షాడో.

తెల్లవారటానికి మరో గంట మాత్రమే వున్నది వ్యవధి. వెలుగు వచ్చిన తర్వాత ఆ చుట్టుపట్ల సంచరిస్తూ టైగర్ జాన్ అనుచరుల కళ్ళల్లో పడటం ఏమంత మంచి పని అనిపించుకోదు. ఏదైనా హోటల్‌కి పోయి, తిరిగి చీకటి పడేవరకూ కాలక్షేపం చేయటమే ఉత్తమం...

షాడో ఆలోచనలు పూర్తి కాలేదు... టైగర్ జాన్ భవంతి ముందుకు పోయి ఇన్స్పెక్టర్ సాబ్, తన కానిస్టేబిల్స్‌తో సహా ఠక్కున అటెంక్షన్‌లో నిలబడటం కనిపించి, కనులు చిట్లిస్తూ చూశాడు అటుకేసి.

యమభటుల వంటి అనుచరులు పదిమంది తన వెనుక కూర్చుని వుండగా,ఎటువంటి ప్రదేశాలలోనయినా అతి తేలికగా ప్రయాణించగల జీప్‌ని స్వయంగా డ్రయివ్ చేస్తూ, మెయిన్ గేటును దాటి ఇవతలకు వచ్చాడు ఒక ఆజానుబాహుడు..

సుప్రీమ్ కమాండ్ అభీష్టానికి విరుద్ధంగా తన పట్టుదలను,పంతాన్ని కొనసాగించుకుంటున్న టైగర్ జాన్ అతనే!

కోటలో నుంచి బయటికి వచ్చిన చక్రవర్తిని కాపాడినట్లు, నాలుగు ప్రక్కలకు నడిచి, అటూ ఇటూ చూస్తున్న అతని బాడీగార్డులను మరింత పరిశీలనగా గమనించుకుంటూ, తనకు తెలియకుండానే తల పంకించాడు షాడో.

సరయిన సూపర్ షాట్ రైఫిల్ నొకదాన్ని పట్టుకుంటే, టైగర్ జాన్‌ని ఖతం చేయటం క్షణాల మీద పని. ఏం జరుగుతున్నదో అతని బాడీగార్డులకు తెలిసే లోపల,పని పూర్తి చేసుకొని ఢాకా పట్టణానికి దూరంగా వెళ్ళిపోవచ్చు...

కాని - ఆ పని జరిగిన మరుక్షణం ఢాకా పట్టణాన్ని సర్వనాశనం చేస్తానని హెచ్చరించాడు ఆ దుర్మార్గుడు...

ఎలా చేస్తాడు? ఏ ఆయుధాన్ని ఉపయోగిస్తాడు??

అటెంక్షన్‌లో నిలుచున్న ఇన్స్‌పెక్టర్ సాబ్‌ని, ఇతర కానిస్టేబిల్స్‌ని చూసి చిరునవ్వు నవ్వాడు జీప్ లోనే వున్న టైగర్ జాన్.

"ఆహారం సంపాదించుకోవటం కోసం బయలుదేరిన ఎలుకలో,పందికొక్కులో మా బగ్గర్ అలారంలను ట్రిప్ చేసి వుంటాయి... ఆ మ్రోతల్ని విని మీరు ఇక్కడికి వచ్చేసినందుకు ఎంతో కృతజ్ఞుడిని...

లోపలకు పోయి వేడి వేడి కాఫీలు తాగండి... కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మీ స్టేషన్‌కి వెళ్ళిపోండి..." అంటూ జీప్‌ని ముందుకు కదిలించాడు.

మెయిన్ గేటు ముందున్న ఇద్దరు గార్డులు దారి చూపిస్తుండగా, భవనంలోకి పోతున్న ఇన్స్‌పెక్టర్‌ని,అతని కానిస్టేబిల్స్‌ని చూస్తూ మరియా వైపు తిరిగాడు షాడో.

"దురదృష్టమైన పేదరికంలో మ్రగ్గిపోతున్న అభాగ్యుల మాదిరి నటిస్తూ లోపలికి పోయారు మా వస్తాదులు కొంతమంది. టైగర్ జాన్ దగ్గిర పనిచేసే పరిచారకులుగా చేరి అతని రహస్యాన్ని చేదించటానికి ప్రయత్నించారు. పనిలో చేరిన పన్నెండో గంటలో రట్టు అయిపోయింది వారి గుట్టు... తలలు లేని వారి శరీరాలు సముద్రంలో తేలుతూ మాకు కనిపించాయి..." అతని మనసులో మెదులుతున్న ఆలోచనలను అర్థం చేసుకున్నట్లు వెంటనే తెలియ చేసిందామె.

తూర్పు దిక్కు తెల్లబడక ముందే టైగర్ జాన్ ఎక్కడికి ప్రయాణమైనాడో తెలుసుకోవటం బాగుంటుందనిపించింది షాడోకి.

ఆ ఆలోచనను కూడా తేలికగా పసికట్టేసింది మరియా.

"ఇక్కడికి దగ్గిర్లో వున్న అడవుల్లో బెంగాల్ టైగర్లు తిరుగుతూ వుంటాయి. వాటిని వేటాడటం టైగర్ జాన్‌కి మహా ఇష్టం..." అతను ఆ

వేళప్పుడు తన భవనంలో నుంచి బయటికి వచ్చిన కారణాన్ని వెంటనే విశదీకరించింది.

పాంటు జేబులో వున్న పనామా పాకెట్‌ని బయటికి తీస్తూ సాలోచనగా తల వూపాడు షాడో...

"మనం ఇప్పుడు ఏం చేద్దాం మిస్టర్ షాడో? కానిస్టేబిల్ చెప్పినట్లు ఏదైనా హోటల్‌కి పోదామా?" సన్నపాటి చిరునవ్వు ఒకటి పెదవులపై నాట్యం చేస్తుండగా మెల్లిగా అడిగింది మరియా

ఆ నవ్వును చూడలేదు షాడో. ఆమె ముఖంలోని భావాలను గమనించలేదు.

బెంగాల్ టైగర్లను వేటాడటం అంటే రెండు మూడు గంటల్లో పూర్తి అయ్యే పని కాదు. కనీసం పది పన్నెండు గంటల పాటు అడవిలో మాటు వేయాలి. అతి ఓపికగా వాటి జాడల్ని అన్వేషించాలి!!

టైగర్ జాన్‌కి అగుపించకుండా దట్టమైన పొదల్లో దాగుకుని అతని కదలికల్ని కనిపెట్టటానికి మంచి అవకాశం అది... అనుచరులతో అతని సంభాషణల్ని ఆలకించటానికి సరైన అదను...

పెదవుల మధ్య పెట్టుకున్న పనామాని వెలిగించుకుంటూ అప్పటికప్పుడు ఆ నిర్ణయాన్ని తీసేసుకున్నాడు షాడో.

"టైగర్ జాన్‌ని మనం అనుసరించాలి బేబీ... అతనితో పాటు అడవిలోకి పోయి అతని పద్ధతుల్ని అబ్జర్వ్ చేయాలి..." మరియాతో చెపుతూ, నిలుచున్న చోటినుంచి ఇవతలకు జరిగాడు.

సందు మధ్యకు పోయి చేతుల్ని ఊపింది మరియా.

ఎక్కడో దూరంలో ఎవరికీ అగుపించని ప్రదేశంలో తమ వెహికిల్ ని పార్క్ చేసి ఆమె సైగ కోసం వెయిట్ చేస్తున్నాడు కిల్లర్స్ గాంగ్ డ్రయివర్ ఒకతను. వెంటనే వచ్చేశాడతను. క్రిందికి దిగి వెనుక తలుపుల్ని తెరిచి పట్టుకున్నాడు.

అప్పుడే వెలిగించుకున్న పనామాను అవతలికి విసిరేసి సీటు వెనక్కి చేరగిలపడి కూర్చున్నాడు షాడో. కనులు మూసుకున్నాడు.

# 9

సూర్యుడు పటమటి దిశకు మరలబోతున్న సమయంలో తొమ్మిది అడుగుల పొడవు,నాలుగు అడుగులఎత్తుండే బ్రహ్మాండమైన బెంగాల్ టైగర్ జాడల్ని కనిపెట్టాడు టైగర్ జాన్.

"ఇటువంటి జంతువును ఇంతవరకూ నేను చూడలేదు. సిద్ధంగా వుండండి అందరూ... కనిపించిన మరుక్షణం ఒక అడుగు వెనక్కి వేసి నా

దారికి అడ్డు తప్పుకోండి..." అర్థ చంద్రాకారంగా తన వెనుక నడుస్తున్న బాడీ గార్డులతో అంటూ ఒక పొద చాటున మోకరించి కూర్చున్నాడు.

అతనికి ఎడమ చేతి వైపున గలగలమని శబ్దాలు చేస్తూ ప్రవహిస్తోంది ఒక చిన్న కొండవాగు... ఆ వాగుకు అవతల ఒడ్డున, పెద్ద అడవి చెట్టును అడ్డు చేసుకుని అతని కదలికల్ని అబ్జర్వ్ చేస్తున్నాడు షాడో.

గాలివాలున అతి స్పష్టంగా వినవచ్చిన అతని మాటల్ని విని అనీజీగా తల విదిలించాడు.

ఆహారాన్ని సంపాదించుకోవటం కోసం తమ తమ నివాసాల్ని వదిలి బయటికి వస్తాయి బెంగాల్ టైగర్లు. ఆ సమయంలో వాటిని ఎదిరించటం చాలా కష్టం.

వేటాడటమంటే ఎంతో మక్కువ కలిగి వున్న టైగర్ జాన్‌కి. వేటాడటానికి వుండే ముఖ్యమైన నిబంధనలను గురించి తెలిసినట్లు లేదు.

ఆకలితో వున్న బెంగాల్ టైగర్‌ని, మహిషివాహనం మీద మానవుడి ప్రాణాలు తీసుకోవటానికి వస్తున్న యముడిని ఆపటం ఎవరి తరమూ కాదు అని ఒక పురాతన కాలపు బెంగాల్ సామెత...

షాడో ఆలోచనలు పూర్తి కాకముందే అదిరిపడింది అతని ప్రక్కనే మోకరించి కూర్చున్న మరియా... విపరీతమైన భయంతో కంపించిపోతూ, షాడోకి చూపించింది తమకు సమీపంలో వున్న ఒక పొదని.

మెలికలు తిరుగుతూ, జానెడు పొడవున్న నాలుకల్ని వేగంగా కదిలిస్తూ,ఉరుకులు పరుగుల మీద వచ్చేస్తోంది ఒక పెద్ద కొండచిలువ.

"కాల్చేయ్ మిస్టర్ షాడో... ముందు దాని తల ఎగిరి అవతల పడిపోయేటట్లు రివాల్వర్‌తో పేల్చేయ్..." కంపిస్తున్న కంఠంతో అంటూ, తన దగ్గిర వున్న రివాల్వర్‌ని అటుకేసి తిప్పిందామె.

కుడిచేతిని ఎత్తి ఆమె హస్తాన్ని అవతలికి నెట్టేశాడు షాడో. ఆమె భుజాన్ని పట్టుకుని బలవంతంగా పైకి లేపాడు.

"కమాన్ బేబీ... లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్..." అంటూ వెనక్కి లాక్కుపోయి, వంకర టింకరగా ఎదికి వున్న ఒక పెద్ద బిజూటూ వృక్షం దగ్గిర నిలబెట్టాడు.

కొండ చిలువను చూసిన వెంటనే దారుణమైన భయానికి గురి అయినా, వెంటనే తనను తను కంట్రోల్ చేసుకున్నది మరియా.

"అది ఈ పాటికి దూరంగా వెళ్ళిపోయి వుంటుంది... మనచోటికి మనం పోయి టైగర్ జాన్‌ని అబ్జర్వ్ చేద్దాం..." అంటూ తిరిగి వాగు వడ్డుకు బయలుదేరబోయింది.

చాచిపెట్టి ఆమె చెంప మీద కొట్టినంత పనిచేశాడు షాడో.

"కీప్ క్వయిట్ యూ డండర్ హెడ్... ముందు చెట్టుమీదికి చేరుకో... కమాన్... క్విక్..." అంటూ రఫ్‌గా నడుము పట్టుకుని నేలకు నాలుగు అడుగుల ఎత్తులో వున్న చీలిక మీద కూర్చోబెట్టాడు.

పరిచయం అయిన క్షణం నుంచీ అంతవరకూ అతని నోటి వెంట అటువంటి కటువైన మాటలు వెలువడటాన్ని చూసి వుండక పోవటం వల్ల, బిత్తర పోయింది మరియా. ఆశ్చర్యం నిండిన కనులతో అతని వంకే చూస్తూ గబ గబా మరో చీలిక మీదికి చేరుకున్నది.

ఆమె వెనుకే ఆ వృక్షాన్ని ఎక్కి తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు షాడో.

"ఎప్పుడూ చూడని కొండ చిలువను చూసి నేను భయపడటంలో అర్థం వున్నది. ఎటువంటి శత్రువునైనా కనురెప్ప కూడా కదిలించకుండా ఎదుర్కోగల షాడో ఖంగారు పడిపోవటానికి కారణం ఏమై వుంటుంది??" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అన్నది మరియా.

మాటలతో సమాధానం ఇవ్వలేదు షాడో. ఆమె భుజం తట్టి... అంతకు ముందు వరకూ తాము మోకరించి కూర్చున్న వృక్షం కేసి చూపించాడు.

కెవ్వున అరవటానికి నోటిని తెరిచి, ఆఖరి క్షణంలో తనే గట్టిగా అదుముకున్నది మరియా... కొండ చిలువను చూసినప్పటి కంటే వెయ్యిరెట్లు అధికంగా భయపడుతూ షాడోని గట్టిగా కౌగలించుకున్నది.

కొండవాగుకు అవతలి ప్రక్కన నేలమీద ఏ టైగర్ జాడల్ని గమనించి టైగర్ జాన్ మాటు వేసి కూర్చున్నాడో – ఆ టైగరే అత్యంత గంభీరంగా అడుగులు వేస్తూ వాగును అధిగమించి అవతలికి వెళ్ళే ప్రయత్నం చేస్తోంది.

మృత్యు స్వరూపానికి మారు పేరైన ఆ క్రూర మృగాన్ని చూడటం వల్లనే పొదల్ని విరగదొక్కుకుంటూ పారిపోయి వచ్చింది మరియా చూసిన కొండచిలువ.

"నిన్ను పడగొట్టటానికి మా వస్తాదులు ఎందుకు బెదిరి పోతారో నాకు ఇప్పుడు అర్థం అయింది మిస్టర్ షాడో... గలగలలాడే ఆకుల్ని చూసి అవి గాలికి కదులుతున్నాయని అనుకుంటాము మేము... వాటిని కదిలించగల గాలి ఎక్కడి నుంచి వచ్చిందో,ఎలా వచ్చిందో గమనించే శక్తి నీకు ఉన్నది..." మెచ్చుకోలుగా షాడో ముఖంలోకి చూస్తూ, తను అతన్ని కౌగిలించుకుని వున్నదనే మాట గుర్తుకు వచ్చేసరికి,ఒకింత సిగ్గుతో వెనక్కి జరిగింది మరియా.

అదే సమయంలో పొదల్నిటి వాగులోకి దిగింది బెంగాల్ టైగర్.

"తప్పుకోండి... అందరూ వెనక్కి తప్పుకోండి..." ఉత్సాహం అతిశయించటంతో బిగ్గిరిగా అందర్నీ హెచ్చరిస్తూ, తను దాగుకుని వున్న పొదచాటు నుంచి లేచాడు టైగర్ జాన్.

ఏనుగుల్ని సైతం ఒకే ఒక తూటాతో వెనక్కి పల్టీ కొట్టించగల సూపర్ షాట్ పవర్ ఫుల్ రైఫిల్ ఒకటి వున్నది అతని చేతిలో.

వాగును దాటి ఆ క్రూరజంతువు తనకు సమీపంలోకి రాకముందే అంత మొందించాలన్న తొందరలో తప్పి పోయింది అతని గురి.

వట్టొట్టి శబ్దం చెవుల పడి వున్నట్లయితే, వెనుతిరిగి పారిపోయి వచ్చేది ఆ బెంగాల్ టైగర్. పొదల్లో దూరి అదృశ్యం అయి వుండేది.

కంటికి కనిపించనంత వేగంతో వచ్చి దాని వెన్నును కొద్దిగా గాయపరిచింది సూపర్ షాట్ రైఫిల్‌లో నుంచి వెలువడిన తూటా.

విపరీతమైన కోపంతో ఆ చుట్టుపట్ల వుండే అడవి జంతువులన్నీ అదిరిపడి దూరంగా పారిపోయేటట్లు గాండ్రించింది ఆ బెంగాల్ టైగర్.

తాచుపాము మాదిరిగా వున్న తోకతో వాగులోని నీటిని ఠపీఠపీ మని చరుస్తూ ఛెంగున ముందుకు దూకింది.

అయిపోయాడు... ఇంకో పది క్షణాల్లో టైగర్ జాన్ హతమారి పోబోతున్నాడు " ఊపిరి బిగపడుతూ కామెంట్ చేశాడు షాడో.

కనులు చిట్లించి తదేకంగా చూస్తున్న మరియా ఉన్నట్లుండి ఉలిక్కిపడి అతని భుజం మీద చేయి వేసింది.

ఆమె పెదవుల వెనుక వున్న మాట బయటికి రాకముందే, అర్థం అయిపోయింది షాడోకి ఆమె ఉలికిపాటుకు కారణం.

బెంగాల్ టైగర్ దెబ్బకు టైగర్ జాన్ మరణించి మట్టిపాలు కావాల్సిన అవసరం లేదు... ఒక మోస్తరుగా గాయపడినా చాలు... అందుకు కిల్లర్స్ గాంగ్ సుప్రీమ్ కమాండే కారణమని భావిస్తాడు అతను.. తన బెదిరింపుల్ని ఆచరణలో పెట్టే ప్రయత్నం చేస్తాడు.

ఆ పనే గనుక జరిగితే-

ఆపైన ఆలోచించటానికి మనస్కరించక , ఉన్న పాళాన చెట్టు మీది నుంచి క్రిందికి జారాడు షాడో.

"మైగాడ్... ఆగు మిస్టర్ షాడో... ఒక్కక్షణం ఆగు." అని మరియా హెచ్చరించ బోతుండగా, క్రూరమైన చూపుతో ఆమె నోటిని మూయించి, అతి వేగంగా వాగులోకి దిగాడు.

ఒకే ఒక పంజా వేటుతో టైగర్ జాన్ చేతుల్లోని రైఫిల్‌ని ఎగర గొట్టేసింది ఆ బెంగాల్ టైగర్. అతని బాడీగార్డుల్లో ఇద్దర్ని కత్తులతో చీరినట్లు ఇష్టం వచ్చినట్లు చీరేసింది.గుండెలు అవిసిపోయేటట్లు గాండ్రిస్తూ మిగిలిన వారి మీదికి ఎగబడుతోంది.

"పారిపోండి... పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి" అని అందర్నీ హెచ్చరిస్తూ పాతిక అడుగుల ఎత్తున్న ఒక ముళ్ళ చెట్టు మీదికి ఎగబ్రాకే ప్రయత్నం చేస్తున్నాడు టైగర్ జాన్.

ఇంకో ఇద్దరు బాడీ గార్డుల్ని మట్టి కరిపించి, అడ్డువచ్చిన పొదల మీదినించి అలవోకగా ఆ ముళ్ళ చెట్టు దగ్గిరికి జంప్ చేసిందా క్రూర జంతువు.

ఏమాత్రం ఆలస్యం చేసినా అది టైగర్ జాన్ పాదాల్ని పట్టుకుని క్రిందికి లాగేస్తుందని అర్థమై, అతి వేగంగా వాగును దాటి ఆ చెట్టును సమీపించాడు షాడో.

తనేం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన ఉద్వేగంలో మునిగి, తాచుపాము మాదిరి కదులుతున్న దాని తోకను గట్టిగా పట్టుకున్నాడు.

దృష్టినంతా టైగర్ జాన్ మీదనే కేంద్రీకరించి వుండటం వల్ల అతని రాకను గమనించలేదా మువ్వన్నెల మెకం.

కలుగులోతి చొరబడుతున్న పామును బయటికి లాగినట్లు బలమంతా ఉపయోగించి వెనక్కి లాగాడు షాడో.

కుడికాలి బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్‌ని గాని, పాంటు బల్టు వెనుక దాచబడి వున్న రివాల్వర్‌ని గాని అందుకుని వెంటనే ఆ

క్రూరజంతువును హతమార్చకపోతే కొంపలు నిలువునా అంటుకుంటాయని అర్థం అవుతూనే వున్నదతనికి.

చురకత్తుల వంటి కోరలు కనిపించేలా నోటిని తెరిచి అతని తలను ఒడిసి పట్టుకుంటుందది... పిడిబాకుల వంటిపంజాలతో వక్షస్థలాన్ని విచ్చ దీసేస్తుంది.

కాని – డాగర్‌ని, రివాల్వర్‌ని బయటికి తీసిన మరుక్షమం బట్టబయలు అయిపోవచ్చు తన ఐడెంటిటీ.

సామాన్యుడు కాదు - ప్రాణ భయంతో ముళ్ళ చెట్టుమీదికి పాకిన టైగర్ జాన్ ఆవలిస్తే పేగులు లెక్కబెట్టగల మొనగాడు...

అదృష్టవశాత్తు అనుకోని విధంగా లభించిన ఆ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని, అతని అభిమానాన్ని పూర్తిగా సంపాదించటానికే నిశ్చయించుకున్నాడు షాడో.

చారల మెకం తోకను పట్టుకుని వెనక్కి లాగిన మరుక్షణం క్రింద కనిపించిన ఒక ఎండు కర్ర ముక్కను ఎడమ చేత్తో అందుకుని ఎడా పెడా కురిపించాడు దాని తల మీద దెబ్బలవర్షాన్ని.

తనను చూసిన మరుక్షణం ఆమడ దూరం పారిపోవాల్సిన ఆ అర్భక మానవుడు తన తోకను పట్టుకోవటమే కాకుండా, ఊపిరి

తీసుకోవటానికి కూడా వీలు లేకుండా అలా దెబ్బ మీద దెబ్బను డెలివర్ చేస్తూ వుండటంతో ఉక్కిరి బిక్కిరై పోయిందా పెద్దపులి.

పంజాలతో అతని చేతిలోని కర్రముక్కను ఎగర గొట్టటానికి ప్రయత్నిస్తూ, ఇంత లావున నోటిని తెరిచి గుండెలు జలదరించేటట్లు గర్జించింది.

కుడిచేతితో పట్టుకున్న దాని తోకను వదిలి,టైగర్ జాన్ ఎగబ్రాకిన చెట్టు మీదికి తను కూడా వెళ్ళిపోవటం మంచిదనే ఆలోచన వెంటనే ఎంటర్ అయింది షాడోకి.

విల్‌పవర్‌నంతా కూడగట్టుకుని అణుచుకున్నాడతను తన ఆందోళనని... ఎడమ చేతిలోని కర్రముక్కను అడ్డంగా తిప్పి ఛటాలున బాదాడు దాని కనుల మీద. అంతటితో ఆగకుండా గొంతుక చినిగిపోయేటట్లు గావురుమని ఒక పెద్ద పొలికేక పెట్టాడు.

పుట్టిబుద్ధెరిగిన తర్వాత అటువంటి సిచ్యుయేషన్‌లో ఏనాడూ చిక్కబడి వుండలేదు కాబోలు - పూర్తిగా బెదిరి పోయిందా చారల మృగం... కనుల మీద పడిన దెబ్బ రంగు రంగుల నక్షత్రాలను చూపిస్తుండగా, షాడో కంటే భీకరంగా అరిచి, అతని చేతిలో చిక్కబడి వున్న తోకను ఒక్క విదిలింపుతో వదిలించుకున్నది. పల్టీ కొట్టినట్లు అమాంతం వెనక్కి దూకి వాగులోకి పరుగుతీసింది.

బ్రతుకు జీవుడా అనుకుంటూ టైగర్ జాన్ ఎగబ్రాకిన ముళ్ళ చెట్టు మీదికి తను కూడా చేరుకోలేదు షాడో...

ఎండిపోయిన కర్రముక్కను గిరగిరా గాలిలో తిప్పుతూ వాగు వడ్డుకు జంప్ చేశాడు.

"ఆగు... అక్కడే ఆగు... పిరికిపందలా పారిపోకు... ఆగు..." తన మాటలు ఆ క్రూరమృగానికి అర్థమవుతాయన్నట్లు బిగ్గిరిగా అరుస్తూ, దాన్ని వెంబడించడానికి ప్రయత్నించాడు.

బ్రహ్మరాక్షసి ఏదో వెంటపడి తరుముతున్నట్లు అర్జంటుగా వాగును క్రాస్ చేసిందా పెద్దపులి... అవతలి ప్రక్కన వున్న పొదల్లోకి పోయి మటుమాయం అయింది.

ఊపిరి బిగపట్టుకుని ముళ్ల చెట్టుమీదకూర్చుని వున్న టైగర్ జాన్ క్రిందికి దూకటాన్ని కనుచివరల నుంచి గమనించి, తన గందరగోళాన్ని మరింత తీవ్రతరం చేశాడు షాడో.

"షంషేర్ ఖాన్ని నేను... నీలాంటి చచ్చుదద్దమ్మల్ని పుట్టినప్పటి నుంచీ చూస్తూనే వున్నాను... నాతో పెట్టుకుంటే ఖతమ్ అయిపోతావ్ నువ్వు... ఖబడ్దార్..." కర్రముక్కతో వాగులోని నీటిని బాదుతూ కంటికి కనిపించని ఆ పెద్దపులిని ఉద్దేశించి భీకరమైన హెచ్చరికలు చేశాడు.

"వట్టి చేతులతో బెంగాల్ టైగర్‌ని ఎదిరించి దూరంగా పారద్రోలటం సాధ్యపడుతుందని ఎవరైనా అని వుంటే, పొరపాటున కూడా నమ్మి వుండే వాడిని కాదు - పదిక్షణాల క్రితం వరకూ... నీ గుండె ధైర్యాన్ని చూసి ముచ్చటపడుతున్నాను" వాగు వడ్డుకు వచ్చి షాడోని వెనక్కి పిలుస్తూ చెప్పాడు టైగర్ జాన్.

సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు షాడో... బూటు కాలికి బిగించి వున్న డాగర్ గాని, పాంటు బెల్టు వెనుక వున్న రివాల్వర్‌గాని అతని కంట పడకుండా జాగ్రత్త పడుతూ విపరీతమైన బిడియాన్ని ప్రదర్శించాడు.

"నువ్వు ఎవరివో, ఎక్కడి నుంచి వస్తున్నావో చెపితే సంతోషిస్తాను..." అతన్ని అంతటితో వదిలి పెట్టటం ఇష్టం లేనట్లు ప్రశ్నించాడు టైగర్ జాన్.

అటువంటి ఓపెనింగ్‌ల కోసమే తను అంతటి సాహసాన్ని చేసినట్లు అతనికి అర్థం అయ్యే అవకాశాలు లేకపోయినా, చాలా జాగ్రత్తగా మాట్లాడాడు షాడో.

"రాజుమియా అంటారు నన్ను... చిన్నప్పటినించీ పెద్ద పులుల్ని వేటాడటం అంటే విపరీతమైన మక్కువ చూపిస్తూ వుండటం వల్ల షంషేర్ ఖాన్ అని కూడా ముద్దు పేరుతో పిలుస్తారు... వేటాడటం లాభసాటిగా లేకపోవటం వల్ల ఇంటి దగ్గిర ఇబ్బందులు అధికం అయ్యాయి. ఉద్యోగం

వెతుక్కోవటానికి ఢాకా వెళుతున్నాను" తడుముకోకుండా తడబడకుండా సమాధానం చెప్పిఊపిరి బిగపట్టాడు.

క్రిందినించి పైదాకా పట్టిపట్టి చూసి భుజం మీద చేయి వేస్తూ తల వూపాడు టైగర్ జాన్.

"ఢాకా పట్టణానికి పోవాలంటే నాలుగు దిక్కులనుంచీ చక్కటి రోడ్లు అనేక వున్నాయి. బస్సుల మీదో, లారీల మీదనో పోవచ్చునుగదా!" యధాలాపంగా అడిగినట్లు అతను అక్కడ ప్రత్యక్షం అవటానికి గల కారణాన్ని అడిగేశాడు.

ఖరీదయిన తన దుస్తుల్ని, కాలిబూట్లను, రిస్ట్ వాచిని అతను గమనించాడని అర్థమై అటూ ఇటూ చూసి తల వంచుకున్నాడు షాడో - సిగ్గుపడి పోతున్నట్లు.

"సమాధానం చెప్పు భాయీ... ఆడపిల్ల మాదిరి అలా తలవంచుకోబోకు... అడిగిన మాటకు నికార్సుగా జవాబు ఇవ్వు..." దూరదూరంగా పారిపోయిన తన అనుచరుల కోసం చుట్టూ చూస్తూ రెట్టించి అడిగాడు టైగర్ జాన్.

"పెద్దవాళ్ళు మీరు... మీకు చెప్పక పోవటం తప్పే అవుతుంది... చెపితే అనవసరమైన ఇబ్బందులు ఎదురౌతాయని భయంగా వున్నది..." వంటిన తల ఎత్తకుండా నేలచూపులే చూస్తూ మెల్లిగా అన్నాడు షాడో.

"నీకు వచ్చిన ప్రమాదం ఏదీ లేదు. నువ్వు ఏం చెప్పినా నేను వింటాను. నాలోనే దాచుకుంటాను సరేనా?" తన అనుచరుల కోసం చూడటాన్ని విరమించుకుని,అతని భుజం తడుతూ ప్రోత్సహించాడు టైగర్ జాన్.

"మా గ్రామంలోనుంచి ఢాకా వచ్చే బస్సు కోసం ఎదురు చూస్తూ వుండగా, ఇండియా నుంచి మా గ్రామంలో వున్న పురాతన కాలపు కోటగోడల్ని చూడటానికి ఒక టూరిస్టు వచ్చాడు... అతని దుస్తులు ఇవి... బూట్లు, ఈ వాచీ అన్నీ అతనివే... దగ్గిర వుండి కోటంతా చూపిస్తానని చెప్పి, పొదలచాటుకు తీసుకుపోయి తల పగలగొట్టేశాను..." తన రహస్యాన్ని బయట పెట్టటం ఇష్టం లేనట్లు ఆగి ఆగి చెప్పాడు షాడో.

అతను ఊహించినట్లే వెంటనే ఇంప్రెస్ అయ్యాడు టైగర్ జాన్. పెద్దగా నవ్వుతూ అతని భుజాలు విరిగి పోయే దెబ్బ వేశాడు.

"నువ్వు నాకు నచ్చావ్... బెంగాల్ టైగర్ని వట్టి చేతులతో ఎదిరించగల నీకు ఆర్డినరీ టూరిస్టుల తలలు పగల గొట్టటం ఏమంత కష్టం కాబోదని నాకు అర్థం అయింది. నా దగ్గిర పనిచేస్తే నీకు అటువంటి చిల్లర పనులుచేయాల్సిన అవసరం రాకుండా చూస్తాను. నాతో వస్తావా??" ఎటువంటి సంకోచము లేకుండా సూటిగా అడిగేశాడు.

వెంటనే వప్పుకుంటే బాగోదని పది నిముషాలపాటు తటపటాయించి,అంతకంటే మంచి మార్గం మరొకటి లేదని గ్రహించినట్లు ఆఖర్లో తల వూపాడు షాడో.

పెద్దపులి పంజా విసుర్లకి ఎక్కడికో ఎగిరిపోయిన తన సూపర్ షాట్ రైఫిల్‌ని వెతికే బాధ్యత అతనికి అప్పగించి, అడ్రసులు లేకుండా పోయిన తన అనుచరులను గాలించే పనిని తను ప్రారంభించాడు టైగర్ జాన్.

వాగుకు అవతలి ఒడ్డున ఒక పొదచాటున నిలుచుని తన వంకే చూస్తున్న మరియాకి సైగ చేశాడు షాడో... వెనక్కి వెళ్ళి సిటీలో వెయిట్ చేయమని అర్థం వచ్చేటట్లు చేతులు ఊపి, టైగర్ జాన్ తనకు అప్పచెప్పిన పనిని అమితమైన శ్రద్ధతో పూర్తి చేయటానికి రెడీ అయ్యాడు.

## 10

"ముక్కు ముగం తెలియని వాళ్ళని మన మధ్యకు తీసుకురావటం మంచి పని అని నాకు అనిపించటంలేదు" తన ముందున్న విస్కీ గ్లాసును విసురుగా అవతలికి నెడుతూ అన్నాడు షబ్బూపాషా.

చేతులు వెనక్కి విరిచి కట్టుకొని ఆగదిలో పచార్లు చేస్తున్నాడు టైగర్ జాన్.

"నీ అభిప్రాయాలను నేను అడగటం లేదు. రాజు మియా ధైర్య సాహసాలకు తగిన పనిని అప్పగించమని చెపుతున్నాను. అంతే..." ఒక్కక్షణం పాటు ఆగి తన మనసులోని మాటను అతనికి తెలియచేశాడు.

"ఏది ఏమైనా సరే... అతను ఎటువంటివాడో తెలుసుకోనిదే మన మధ్యలో కూర్చోబెట్టుకోవటం చాలా తప్పు... అతను మన శత్రువులకు చెందిన వాడైతే ఖచ్చితంగా ట్రబుల్స్‌లో చిక్కు పడతాం..." మరింత మొండిగా అన్నాడు షబ్బూపాషా.

తమ శత్రువులతో బెంగాల్ టైగర్ తోకను పట్టుకుని వెనక్కి లాగగలిగే వాళ్ళు ఎవరైనా వున్నారేమోనని అతన్నే అడగాలని అనుకున్నాడు టైగర్ జాన్. ఎందుకనో ఆప్రయత్నాన్ని విరమించుకుని చిరునవ్వు నవ్వాడు.

"రాజుమియా ఎటువంటివాడో తెలుసుకోవటానికి నువ్వు అతన్ని వెంట బెట్టుకొని అడవిలోకి వెళ్ళిరావాలి... అతన్ని నీ ఇష్టం వచ్చినట్లు పరికించు. నాకేమీ అభ్యంతరం లేదు" అంటూ చప్పట్లు చరిచాడు.

ఆ రోజు ఉదయం నిద్ర లేచీ లేవగానే షబ్బూపాషాని చూశాడు షాడో. అతను తనను గుర్తుపట్టే అవకాశాలు చాలా స్వల్పమని తెలిసినా, అనవసరమైన రిస్క్ తీసుకోవటం ఇష్టం లేక, దూరదూరంగానే సంచరించాడు.

టైగర్ జాన్ ఆఫీస్ రూమ్‌గా ఉపయోగించుకునే గదిలోకి అతను వెళ్ళటం, వెంటనే తనకు పిలుపు రావటం - మరింత జాగ్రత్త పడేటట్లు చేశాయి అతన్ని.

షర్టు మడతల్ని సరి చేసుకుంటూ గదిలోకి పోయి టైగర్ జాన్‌కి విష్ చేశాడు.

"వీడు షబ్బూపాషా అని మనవాడే... నాకు బాగా కావాల్సిన వాడు... నీకు ఏదో పని అప్పగిస్తాడట... జాగ్రత్తగా పూర్తి చేయి" అని ఆర్డర్ ఇచ్చి, ఆ గదికి రెండవ వైపున వున్న ద్వారంలో నుంచి ఇంకో గదిలోకి వెళ్ళిపోయాడు టైగర్ జాన్.

ద్వారం పక్కనే గోడను ఆనుకుని నిలుచున్నాడు షాడో... సిగరెట్ వెలిగించుకోవటం మంచిదో కాదో ఆలోచిస్తూ, షబ్బూ పాషా వంక చూశాడు.

అంతకు ముందు దూరంగా జరిపిన విస్కీ గ్లాసును దగ్గిరికి తీసుకుంటూ కోరగా తల వూపాడు షబ్బూపాషా. తన కుర్చీకి వెనుకగా పెట్టి వున్న ఒక సూట్ కేసును అతని వైపు నెట్టాడు.

"ఖరీదయిన రివాల్వర్లు వున్నాయి ఈ సూట్ కేసులో. పోలీసులకు పట్టుబడకుండా తీసుకుపోయి త్రీ టవున్ ప్యారిమా హోటల్లో అప్పగించు... హోటల్ ఓనర్ నీకు ఇచ్చే డబ్బును తిరిగి జాగ్రత్తగా ఇక్కడికి తీసుకురా..." అని ఆర్డర్ ఇచ్చి తన పనిలో తను బిజీ అయిపోయాడు.

ఆ సూట్‌కేసులో నిజంగానే రివాల్వర్స్ వున్నాయో, లేక తనను టెస్ట్ చేయటానికి అలా చెప్పటం జరుగుతున్నదో తెలియలేదు షాడోకి. అనవసరమైన ప్రశ్నలు వేసి అవివేకి అని పిలిపించుకోవటం ఇష్టం లేక సూట్‌కేసుతో బయటికి వచ్చాడు.

భవనపు ముఖద్వారం దగ్గిర వున్న గార్డులకు చేయి వూపుతూ, మెయిన్ గేటును చేరుకున్నాడు.

అప్పుడు అలారం బెల్స్‌ని మ్రోగించటం ప్రారంభించింది అతని సిక్స్‌త్ సెన్స్. కంటికి కనిపించని ప్రమాదం ఏదో ముంచుకు రాబోతున్నదని హెచ్చరించటం మొదలుపెట్టింది.

చేతుల్లో వున్న సూట్‌కేస్‌ని అవతలకు విసిరి, అటు నుంచి అటే ఆ భవనానికి దూరంగా పరుగు తీయాలన్న కోరిక వెంటనే కలిగింది అతనికి.

పాంటు జేబులో వున్న సిగరెట్ పాకెట్‌ని బయటికి తీసి, సిగరెట్ వెలిగించుకుంటూ మెయిన్ గేటును దాటాడతను.

రెండు ఫర్లాంగుల దూరంలో వున్న ఒక టాక్సీ స్టాండు సమీపంలోకి పోతుండగా చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం.

ముందుకు వేయబతున్న అడుగును వెంటనే వెనక్కిలాగుకుని, దగ్గిర్లో వున్న ఒక సందు కేసి తిరిగాడు షాడో.

పది అడుగులు కూడా వేయక ముందే వచ్చిమీద పడిపోయింది అతను ఎదురు చూడని యాంగిల్‌లో - ఆ ప్రమాదం...

"నన్ను ఎదిరించి ప్రాణాలతో బయటపడగలిగినవారు ఎవరూ లేరని ఒకసారి నీకు చెప్పాను... నన్ను రెండుసార్లు గాయపరిచిన నిన్ను ఊరికే వదిలి పెడతానని ఎలా అనుకున్నావ్ బే?" అంటూ అమాంతంగా అతని షర్టు పట్టుకొని ముందుకు లాగాడు - ఎక్కడో బయిజు సిటీలో వుండాల్సిన ఇన్స్‌పెక్టర్ రణధీర్ సాట్.

పగిలిపోయిన అతని ముక్కుమీది ప్లాస్టర్ పట్టీలు మరింత వెడల్పుగా తయారయి వుండటాన్ని కనుచివరల నుంచి గమనిస్తూ, శరవేగంతో ఆలోచించాడు షాడో.

తన ముక్కును పగలగొట్టినందుకు కక్షతో వెంటాడుతున్నాడు ఆ ఇన్స్‌పెక్టర్.... ఇప్పుడు తన దగ్గిర వున్న సూట్‌కేస్‌లో అక్రమంగా రవాణా చేయబడే రివాల్వర్లు వున్నట్లు తెలిస్తే అసలు నేలమీద ఆగడు... అక్కడి కక్కడే చంపేసి, రోడ్డు మీదికి విసిరేస్తాడు. దొంగతనంగా ఆయుధాల్ని చేరవేసే దేశద్రోహిని అతికష్టం మీద చంపగలిగినట్లు ఫోజు పెట్టి ప్రమోషన్స్ కోసం పై అధికారుల దగ్గిరికి పోతాడు.

ఎలా తప్పించుకోవాలి ఆ ప్రమాదం నుంచి? ఎలా వదిలించుకోవాలి ఆ పట్టువదలని విక్రమార్క మహారాజుని??

"ఆలోచిస్తున్నావేమిటి బే? ఈసారి నా చేతుల్లో నుంచి జారిపోవటం నీకు సాధ్యపడదు... నీ అంతు చూడకపోతే నువ్వు అప్పుడు అడుగు..." అంటూ అతని షర్టును మరింత గట్టిగా బిగించి పట్టుకుంటూ, ఖాళీగా వున్న ఒక టాక్సీ కోసం రెండవ చేతిని ఎత్తాడు.

చివరికంటా కాలి చేతివేళ్ళను చురుక్కుమనిపించ బోతున్నది షాడో ఎడమ చేతిలో వున్న సిగరెట్.

రెండో ఆలోచన లేకుండా దాన్ని టాక్సీ కోసం ఎత్తబడిన రణధీర్ సాబ్ చేతిలో వున్న సిగరెట్.

రెండో ఆలోచన లేకుండా దాన్ని టాక్సీ కోసం ఎత్తబడిన రణధీర్ సాబ్ చేతి మీద అదిమాడు షాడో.

అదిరిపడి అతని షర్టును వదిలేశాడు ఆ జంటిల్మన్.

వింటి నుంచి వెలువడిన బాణంలా ఎదురుగా వున్న సందులోకి పరుగు తీశాడు షాడో... వెనక్కి కూడా చూడకుండా పది క్షణాల్లో ఆ సందు చివరికి పోయి, అక్కడ ఎదురైన ఒక మార్కెట్ ఏరియాలోకి అడుగుపెట్టాడు.

"ఆ సువ్వర్‌కీ బచ్చేని పట్టుకోండి... ఆ బద్మాష్ బడాచోర్‌ని అరెస్ట్ చేయడంలో నాకు సహాయపడండి" అని కేకలు పెడుతూ సందులో వున్న పౌరులందర్నీ ఎలర్ట్ చేసేశాడు ఇన్స్‌పెక్టర్ రణధీర్... మార్కెట్ ఏరియా

దగ్గిర డ్యూటీ చేస్తున్న కానిస్టేబిల్స్‌ని కూడా కలుపుకుని పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాడు.

మార్కెట్ చివరి భాగంలో అగుపించిన ఒక ఆటోని ఎక్కి సరాసరి త్రీ టవున్ లోని ప్యారిమా హోటల్ దగ్గిరికి పోయాడు షాడో.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ రిసెప్షన్ డెస్క్ దగ్గిరికి వచ్చి, బరువైన సూట్ కేసుని ధభేల్ మని కౌంటర్ మీద పెట్టిన ఆ పర్సనాలిటీని చూసి ఖంగారు పడిపోయాడు హోటల్ ఓనర్.

"నీకు మతిపోయింది. ఇంత పబ్లిక్‌గా నా ఎదుటికి వస్తే ఎంత ప్రమాదమో ఆలోచించటం లేదు నువ్వు..." అటూ ఇటూ చూస్తూ ఖంగారుగా అన్నాడు.

"అర్జంట్‌గా డబ్బు బయటికి తీయకపోతే నా సూట్‌కేసును నేను తీసుకుని నా దారిన నేను వెళ్ళిపోతాను... బాగా ఆలోచించుకో..." జాలి, దయ కన్సిడరేషన్ మొదలైన మాటలకు అర్థం తెలియనట్లు కరుకుగా హెచ్చరించాడు షాడో.

కౌంటర్ మీద వున్న ఫోన్‌ని ఎత్తి ఎవరికో రింగ్ చేశాడు హోటల్ యజమాని. షాడోకి వినిపించనంత తక్కువ స్థాయిలో ఎవరితోనో మాట్లాడాడు.

మాటలు వినిపించకపోయినా, అతను రింగ్ చేసింది ఎవరికో అర్థం చేసుకుని తనలో తను నవ్వుకున్నాడు షాడో.

షబ్బూపాషాతో మాట్లాడాడు ఆ పెద్దమనిషి. సూట్ కేసు తీసుకువచ్చిన మనిషి అతని దగ్గర్నించే వచ్చినట్లు కన్ఫర్మ్ చేసుకున్నాడు.

కౌంటర్ మీది సూట్‌కేసును కౌంటర్ క్రింది భాగంలో దాచేసి, నోట్ల కట్టలతో నిండి వున్న మరో బ్రీఫ్‌కేస్‌ను షాడో ముందుకు నెట్టాడు హోటల్ యజమాని.

"నేను ఇక్కడి నుంచి బయలుదేరుతున్నానని షబ్బూపాషాకి ఫోన్ చేసి చెప్పు..." అంటూ రోడ్డుమీదికి వచ్చాడు షాడో.

ఆ రోడ్డుకు ఆవలి ప్రక్కన వున్న ఒక బుక్ షాపు దగ్గిర నిలబడి వచ్చేపోయే వారందర్నీ గమనిస్తున్న ఇన్స్‌పెక్టర్ రణధీర్‌ని చూసి కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరి పడ్డాడు.

## 11

"బరువుగా వుండే సూట్‌కేసును పట్టుకొని ఒక ఆటోలో ఇటుగా పారిపోయి వచ్చాడు చోర్ బద్మాష్ ఒకతను... అతని జాడలు కనిపిస్తే

వెంటనే వెంటనే మాకు తెలియచేయంటి" షాడో పోలికల్ని వివరిస్తున్నాడు వచ్చే పోయే పౌరులకు రణధీర్. అతన్ని పట్టివ్వమని రిక్వెస్ట్ చేస్తున్నాడు.

చూడటానికి అతని పద్ధతి అతి పురాతనమైనది. అవుటాఫ్ డేట్ అయిపోయినదీ అని అనిపిస్తున్నా, మరో గంట గడిచేసరికి తన గురించి త్రీ టవున్ ఏరియాలోని పౌరులందరికీ తెలిసి పోతుందని గ్రహించి ఖంగారుగా పడ్డాడు షాడో.

పెద్ద పెద్ద అడుగులు వేస్తే ఆ పెద్ద మనిషి కంటపడటం తప్పనిసరి. అలాగే నిలబడిపోతే అతని ద్వారా తన పోలికల్ని తెలుసుకున్న పౌరుల దృష్టిలోకి వెళ్ళిపోవటం గ్యారెంటీ...

అటూ ఇటూ చూసి ప్యారీమా హోటల్‌కి కాస్తంత అవతలగా వున్న ఒక చిన్న కాకా హోటల్లోకి చొరబడ్డాడు షాడో.

"ఏమిటి సాబ్? ఏమిటి ఖంగారు పడుతున్నారు?" తను స్వయంగా తయారుచేసిన చాయ్‌ని ఆదరాబాదరాగా తాగుతున్న అతని ముఖంలోకి చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు ఆ కాకాహోటల్ యజమాని.

జీవం లేని నవ్వొకటి నవ్వి అతన్ని దగ్గిరికి పిలిచాడు షాడో... దూరం నుంచి కనిపిస్తున్న ఇన్స్‌పెక్టర్ సాబ్‌ని చూపించి నెత్తి కొట్టుకున్నాడు.

"నాలుగు నెలల గర్భిణీ నా భార్య... సంసారానికి సరిగ్గా పనికిరావటం లేదని చెప్పి ఇంకో చిన్న సెటప్‌ని ఏర్పాటు చేసుకున్నాను. బోర్డర్స్ దాటి భారతదేశంలో నాలుగు రోజులు సరదాగా గడిపి వద్దామని బయలుదేరాను. బస్ స్టేషన్లో కూర్చుని వున్నది నా సెటప్... ఆ విషయాన్ని గ్రహించి తన అన్న అయిన ఆ ఇన్స్పెక్టర్‌ని నా మీదికి ఉసికొల్పింది నా భార్య..." చేతిలో వున్న బ్రీఫ్‌కేసును టేబిల్ మీద పెట్టి, పాంటు జేబులో నుంచి ఒక కరెన్సీ నోటును తీసి అతనికి అందిస్తూ తన దీనగాధను వెళ్లబోసుకున్నాడు.

వచ్చేపోయే పౌరులందరికీ సూట్‌కేసును పట్టుకున్న చోర్ బద్మాష్‌ని గురించి చెపుతూ మధ్య మధ్యలో దిక్కులన్నీ పరికిస్తున్న రణధీర్ సాబ్‌ని గమనించేసరికి హోటల్ యజమాని పెదవుల మీదికి పరిగెత్తుకు వచ్చేసిందొక నవ్వు.

"ఎంత ఇన్స్పెక్టర్ ఉద్యోగం అయినా మరీ యింత ఇది పనికిరాదు సాబ్... గర్భిణీతో వున్న భార్య సంసారానికి సరిగ్గా పనికి రానప్పుడు చిన్న చిన్న సెటప్‌లను ఏర్పాటు చేసుకోవటంలో తప్పు ఏమున్నదో నాకు అర్థం కావటంలేదు. ఆ మాత్రం దానికి ఎవరో హంతకుడి కోసం వెతుకుతున్నట్లు ఇలా అల్లరి చేయటం నాకు ఎంత మాత్రము నచ్చలేదు" అంటూ లోపలికి పోయి, నల్లటి బురఖా నొకదాన్ని తీసుకువచ్చి షాడోకి యిచ్చాడు.

"ఒడ్డు పొడుగుల్లో కాస్తంత మగవాడి మాదిరిగా వుండే మా ఇంటావిడ ఉపయోగిస్తుంది దీన్ని. ఇందులో వుండగా మిమ్మల్ని ఆ దేవుడు కూడా గుర్తించ లేడు. తీసుకుపొండి సాబ్... నాకు కూడా ఏద్దైనా మంచి సెటప్ లభించాలని భగవంతుడిని నాకోసం ప్రార్థించండి..." అంటూ తన కాష్ టేబిల్ దగ్గరికి వెళ్ళిపోయాడు.

మోకాళ్ళకు కాస్తంత క్రింది వరకే వచ్చిందా బురఖా. కాలిబూట్లను తీసి చేతిలో పట్టుకున్నాడు షాడో. ముఖం కనిపించకుండా ముసుగును ముందుకు లాక్కుని సాద్యమైనంత వయ్యారంగా అడుగులు వేస్తూ వీధిలోకి పోయాడు.

మగవాళ్ళ మాదిరిగా పాంటును ధరించి, ముఖం కనిపించకుండా వయ్యారాలు ఒలకబోస్తున్న ఆ బురఖాలో ఎటువంటి అందగత్తె వుండి వుంటుందో ఊహించటానికి ప్రయత్నించారు ఎదురైన పౌరులు అందరూ.

రణధీర్ సాబ్‌కి పాతిక అడుగుల దూరంలో నుంచి పోయి,ఖాళీగా వస్తున్న టాక్సీని ఆపాడు షాడో... అంతకు ముందు ఆటో ఎక్కిన మార్కెట్ ఏరియాలో దిగి ఖాళీగా వున్న ఒక చిన్న కార్నర్‌లో బురఖాని వదిలించుకున్నాడు.

సిగరెట్ వెలిగించుకొని టైగర్ జాన్ భవంతిలోకి అడుగు పెడుతుండగా వినవచ్చింది అతనికి ఒక ఆర్తనాదం.

కనిపించకూడని దృశ్యం ఏదో కనిపించబోతున్నదనీ, సుఖంగా, సాఫీగా సాగిపోతున్న తన నాటకానికి ఫుల్ స్టాప్ పడబోతున్నదనీ అనిపించి, అతి నెమ్మదిగా ముందు గదిలోకి పోయాడు.

ఆయుధాలు ధరించి సర్వసన్నద్ధంగా నిలబడి వున్నారు భవం లోపలి భాగంలో వుండే టైగర్ జాన్ బాడీగార్డులు.

వారందరి మధ్యలో పెద్దపులుల మందకు చిక్కుబడిన జింకపిల్ల మాదిరి నిలబడి వున్నది మరియా...

లావుపాటి హేండ్ స్టిక్‌తో షబ్బూపాషా కొడుతున్న దెబ్బల్ని తట్టుకోలేక బాధగా శబ్దాలుచేస్తున్నది.

*****

షాడో చూస్తుండగానే విసురుగా పాదాన్నిఎత్తి బలంగా ఆమె తొడ మీద తన్నాడు షబ్బాపాషా.

కెవ్వున అరిచి కాళ్ళు విరిగిపోయినట్లు క్రిందికి పడిపోయింది మరియా. తల నేలకు పొడుచుకోవటంతో స్పృహ తప్పి కనుల్ని తేలవేసింది.

తనకంటె అధికమైన బలం కలిగిన శత్రువుని ఒకే ఒక దెబ్బతో పడగొట్టినట్లు విజయ గర్వాన్ని ప్రదర్శిస్తూ ప్రక్కకు తిరిగి, షాడోని గమనించాడు షబ్బూపాషా.

"నీ గురించి ప్యారీమా హోటల్ యజమాని ఫోన్ చేశాడు... అతని దగ్గర్నించి డబ్బు తీసుకు వచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాను." షాడో చేతుల్లో నుంచి బ్రీఫ్‌కేసును అందుకుంటూ అన్నాడతను.

ఫరూకీ పార్కులో అతను దాచిపెట్టిన ప్లాస్టిక్ ఎక్స్‌ప్లోజివ్స్ పెట్టల మీద తను ప్రయోగించిన మెటల్ గోలీ లిటిల్ టామీని ఆపెట్టెల మీద కాకుండా సరాసరి అతని మీదికే విసిరి వుంటే ఎంతో బాగుండి వుండేదని భావిస్తూ, ముందుకు అడుగు వేశాడు షాడో. తనకు కేటాయించబడిన గది వైపు బయలుదేరాడు.

నాలుగు అడుగులు కూడా వేయకముందే అతన్ని ఆపేశాడు షబ్బూపాషా.

"ఈ పిల్ల నిన్న రాత్రి పది గంటల నుంచీ మన భవంతి చుట్టూ రౌండ్స్ కొడుతోందిట... సరయిన సమాధానం చెప్పకుండా హరాం చేస్తోందిట... ఈమెను నువ్వు ఎక్కడయినా చూశావా??" మరియా జుట్టు పట్టుకొని బలవంతంగా తలను పైకి లేపుతూ అడిగాడు.

లిటిల్ టామీని కాకపోయినా, తన డాగర్ నయినా అతని మీదికి విసిరి వుండాల్సింది అనుకుంటూ నిబ్బరంగా తల అడ్డం తిప్పాడు షాడో.

"ఈమెను ఇంటరాగేట్ చేసే బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను. ఈమె ఎవరో, ఎందుకు మనమీద నిఘా వేసిందో తెలుసుకోవాలి నువ్వు...." అంటూ బాడీ గార్డులకు సైగ చేశాడు షబ్బూపాషా.

అతనికి తనమీది అనుమానం పూర్తిగా సమసి పోలేదని అర్థమై గాఢంగా నిట్టూర్చాడు షాడో... తనకు కేటాయించబడిన గదిలోకి మరియాని నెట్టి తలుపుల దగ్గిర కాపలా నిలబడతారు టైగర్ జాన్ బాడీ గార్డులు... తమసంభాషణను పూర్తిగా ఆలకిస్తారు.

షబ్బూపాషా కోరుకున్నట్లు మరియాని హింసించి, అతను తృప్తిపడే సమాధానాల్ని ఆమె నోటి వెంట రప్పించక పోతే రట్టు అయిపోతుంది తన గుట్టు... ఏదో నాటకం ఆడి కాకమ్మ కథలు మరియా చెప్పించితే - పెదవి విప్పిన మరుక్షణం అనంత విశ్వంలోకి ఎగిరిపోతాయి ఆమె ప్రాణ వాయువులు..

తను సరిఅయిన మెస్సేజి అందించే వరకూ దూర దూరంగా వుండమని హెచ్చరించినా వినకుండా, ఆ నరరూప రాక్షసుల చేతికి చిక్కబడిన మరియా మీద ముంచుకు వచ్చేసింది అతనికి విపరీతమైన కోపం.

తన ముఖంలో కదలాడే భావాల్ని బట్టి తన నిజ స్వరూపాన్ని తెలుసుకోవటం కోసం సర్వసన్నద్ధంగా నిలిచి వున్న షబ్బూపాషాని

కనుచివరల నుంచి గమనించి, బలవంతంగా అదుముకున్నాడతను తన ఫీలింగ్స్‌ని.

"తీసుకుపదండి... తీసుకు పోయి నా గదిలోకి నెట్టి తలుపులు మూయండి." ఆడవాళ్ళను చిత్రహింసలు పెట్టటమంటే తనకు మహా సరదా అన్నట్లుగా టైగర్ జాన్ బాడీగార్డులను హెచ్చరించాడతను.

అచేతనంగా వున్న మరియాను అతని గదిలోకి దొర్లించి తలుపుల దగ్గిరే నిలుచున్నారు ఆ బాడీగార్డుల్లో ఇద్దరు. అతను ఊహించినట్లే కనురెప్పలు కూడా కదిలించకుండా కాపలా కాయటం మొదలు పెట్టారు.

చీకట్లు టైగర్ జాన్ భవంతిని చుట్టుముట్టే సమయం వరకూ గొంతు చించుకుని అరిచి కేకలు పెట్టింది మరియా.

"రక్షించండి... ఈ కసాయి మనిషి బారినుంచి నన్ను కాపాడండి..." అంటూ ఎవరెవరినో ఉద్దేశించి వేడుకున్నది.

"ఎవడొస్తాడో రమ్మను... నిన్ను కాపాడగల మొనగాడు ఎవడో గట్టిగా పిలుచుకో... " కరకు గుండెల కసాయి వాడి మాదిరిగా రంకెలు పెట్టాడు షాడో. పాంటు బెల్టును తీసి ఛణేల్ ఛణేల్మని మ్రోతలు చేశాడు.

"ఈ పూటకి ఇక చాలు మిస్టర్ షాడో... అరిచి అరిచి నా గొంతు రాచుకుపోయింది. శబ్దం బయటికి రావటం కష్టంగా వున్నది." చీకట్లు

దట్టం అవుతున్న సమయంలో అతి నెమ్మదిగా షాడోని బ్రతిమాలుకున్నది మరియా.

"చెప్పు... నువ్వెవరివో చెప్పు. ఎందుకు ఇక్కడికి వచ్చావో చెప్పు... మర్యాదగా చెప్పకపోతే నీ ప్రాణాలు నీకు దక్కవు..." గొంతు చించుకొని మరోసారి అరిచి, చేతుల్లోని బెల్టును అవతల పడవేశాడు షాడో. ఒక మూలగా వున్న వాటర్ టాప్ దగ్గరికి పోయి మంచినీళ్ళు తాగుదామని అనుకుంటుండగా - ఎటువంటి హెచ్చరికా లేకుండా లోపలికి వచ్చాడు షబ్బాపాషా.

"పొద్దుటి నుంచీ ప్రయత్నిస్తూనే వున్నావ్... ఒక ఆడదాన్ని మాట్లాడించటం చేతకాక మంచినీళ్ళు తాగుతున్నావ్..." వ్యంగ్యంగా అంటూ షాడో వదిలేసిన బెల్టును తను తీసుకున్నాడు.

రక్తం లేనట్లు తెల్లగా పాలిపోతున్న మరియా ముఖాన్ని చూడలేక తల ప్రక్కకు తిప్పుకున్నాడు షాడో... చల్లగాలిని పీల్చుకోవటం కోసం వెళ్ళినట్లు కిటికీ దగ్గిరికి పోయాడు.

షబ్బాపాషాని చూసి భయంతో బెంబేలెత్తి పోతూ వుండాలి మరియా అతని లెక్క ప్రకారం. తలకు చేతుల్ని అడ్డు పెట్టుకొని గది మూలకు జరుగుతూ వుండాలి.

అటువంటి పనులు ఏవీ చేయలేదామె... ఉన్నట్లుండి "మైగాడ్! లుకౌట్ మిస్టర్ షాడో... లుకౌట్..." అని ఖరారుగా హెచ్చరించింది.

అదిరిపడి తల తిప్పిన షాడోకి బెల్టుని గిరగిరా తిప్పుతూ తన మీదికి ప్రయోగించబోతున్న షబ్బూపాషా కనిపించి మతి పోయినంతన పని అయింది.

మట్టిబెట్ట మీదబడిన తాచుపాములా తల తిప్పిన షాడోని చూసి వికటంగా నవ్వుతూ ఒక అడుగు ప్రక్కకు వేశాడు షబ్బూపాషా.

"అసలు రహస్యం యిప్పటికి బయట పడింది మిస్టర్ షాడో... నీ ఐడెంటిటీని బయట పెట్టడానికి నేను వేసిన ఎత్తు ఫలించింది" అంటూ వెనుతిరిగి మూసి వున్న తలుపుల వైపు జంప్ చేశాడు.

షాడోని దెబ్బ తీయబోతున్నట్లు నటించి తన నోటి నుంచి తమ గుట్టును బయట పెట్టించిన అతని తెలివి తేటలకు విస్తుబోయి, శిలా విగ్రహంలా బిగుసుకుపోయింది మరియా.

"భారతదేశానికి ఆయుధాన్ని సప్లయి చేయటంప్రారంభించిన నాడే నువ్వు మమ్మల్ని వెతుక్కుంటూ వస్తావని ఊహించాం మేము... సామాన్యులెవరూ మా రహస్యాన్ని కనిపెట్టేలేరనే ధైర్యంతో కాస్తంత జాగ్రత్తగా వుండటం వల్ల దారుణంగా దెబ్బతిన్నాం... ఇక ముందు అలా జరగదు మిస్టర్ షాడో... మా పథకాల్ని పాడుచేయటానికి నువ్వు

ప్రాణాలతో వుండవు..." అంటూ దుస్తుల్లో చేయి పెట్టి నల్లగా నిగనిగలాడుతున్న రివాల్వర్‌ని బయటికి తీశాడు షబ్బూపాషా.

అతని తెలివితేటల్ని తక్కువగా అంచనా వేసినందుకు, మరియా రెసిస్టెన్స్ కెపాసిటీని గురించి ముందుగా ఆలోచించుకోనందుకు తనను తాను నిందించుకుంటూ, మెరుపు కంటే వేగంగా కదిలాడు షాడో.

కుడి మోకాలి మీదికి వంగి బూటుకు అడ్డంగా బిగించి వున్న డాగర్‌ని బయటికిలాగాడు.

ట్రిగ్గర్ రాడ్ మీద బిగుసుకోబోతున్నది షబ్బూపాషా చూపుడు వ్రేలు... నిప్పుల్ని వర్షించటానికి సిద్ధంగా వున్నట్లు అతని గుండెల కేసి చూస్తోంది ఆ రివాల్వర్.

గురి చూసే వ్యవధి లేకపోవటం వల్ల, మోకరించిన వాడు మోకరించి వున్నట్లుగానే అండర్ హేండ్ త్రోలో డాగర్‌ని విసిరాడు షాడో.

కందిరీగల మాదిరి ఝుంకారం చేస్తూ పోయి, షబ్బూపాషా కుడి మణికట్టుకు తగిలిందది.

ఎర్రగా కాలిన నిప్పు కణిక తన చేతిమీద పడినట్లు అదిరిపడ్డాడు ఆ జంటిల్మన్... రివాల్వర్‌ని వదిలేసి చేతిని గుండెలకు అదుముకున్నాడు.

అదే సమయంలో ఎడమ పాదాన్ని నేలకు అదిమి అమాంతంగా గాలిలోకి లేచాడు షాడో... శరీరంలోని శక్తినంతా కుడిపాదంలోకి రప్పించుకుంటూ డెలివర్ చేశాడు భయంకరమైన ఫ్లయింగ్ కిక్‌ని.

నోరు తెరిచి బిగ్గరగా అరిచే వ్యవధికూడా షబ్బాపాషాకి లభించలేదు. బలమైన కాంక్రీట్ దిమ్మ ఏదో వచ్చి ముఖానికి తగిలినట్లు నజ్జు నజ్జు అయిపోయింది అతని వదనం. ప్రాణంలేని శరీరం వెనక్కి తూలి తలుపులకు కొట్టుకున్నది.

ఆ శబ్దం విని తలుపుల్ని తెరిచారు బయట వున్న బాడీ గార్డులు ఇద్దరూ.

చాపచుట్టలా క్రిందికి జారుతున్న షబ్బాపాషాను చూసి నిర్వణ్ణులై పోయారు.

ఆ షాక్ నుంచి వారు తేరుకుని తమ ఆయుధాల్ని పైకెత్తినా, అరిచి కేకలు పెడుతూ అవతలికి పరిగెత్తినా కొంపలు అంటుకుపోవటం తప్పనిసరి అని గ్రహించి, అంతకు ముందుకంటే వేగంగా కదిలాడు షాడో. తలుపుల దగ్గిరికి జంప్ చేసి, లోపలికి తొంగిచూసిన ఆ ఇద్దరు బాడీగార్డుల్ని బలవంతంగా ముందుకు లాగాడు. అరవటానికి వాళ్ళు ప్రయత్నించక ముందే పటకాకత్తి మాదిరి స్టిఫ్‌గా పైకి లేచింది అతని ఎడమ చేయి.

బాధగా శబ్దం చేస్తూ పాషా శరీరం మీద పడిపోయాడు ఒక గార్డు... తన దగ్గిర వున్న ఆటోమేటిక్ రైఫిల్‌ని అతని గుండెల కేసి తిప్పబోతూ, మొదలు నరికిన చెట్టులా విరగదీసుకుపడిపోయాడు రెండో వ్యక్తి.

తలుపుల దగ్గిర్నించి ఆ శరీరాల్ని గది మధ్యలోకి లాగి చేతులు దులుపుకుంటున్న షాడోని వెనుక నుంచి గట్టిగా కౌగలించుకున్నది మరియా.

"అవసర సమయంలో షాడో వేగం ఆకాశంలో మెరిసే మెరుపుల కంటే అధికం అని నీ గురించి వివరించే సమయంలో మాకు చెప్పబడింది. ఆ మాటలన్నీ వట్టి కల్పితాలని అనుకునే దాన్ని నేను... యదార్థం ఏమిటో ఇప్పుడు తెలిసింది. నీ వేగాన్ని వర్ణించటానికి ఆ మాటలు చాలవు మిస్టర్ షాడో.. కొత్త మాటను కనిపెట్టాల్సిందే" అంటూ అతని మెడను చుంబించింది.

చేతిని వెనక్కి పోనిచ్చి ఆమె జుట్టు పట్టుకోవాలని, ముందుకు లాగి చెంపలు పగిలిపోయేటట్లు ఎడా పెడా కొట్టాలని అనుకున్నాడు షాడో.

షబ్బూపాషా కోసం ఎవరయినా అటుగా వస్తే ఖతం అయిపోయినట్లే తమ పని. తలుపుల దగ్గిర వుండవలసిన గార్డులు ఏమైపోయారోనని ఎవరయినా వెతకటం మొదలు పెడితే నీళ్ళు వదులుకోవాల్సిందే తాము వచ్చిన పనికి...

"శత్రువుల మధ్యలోకి చేరుకోవటం గొప్ప కాదు బేబీ! సురక్షితంగా అవతలికి పోవటం చాలా ముఖ్యం... షబ్బూపాషా వేసిన ఒకే ఒక ఎత్తుకు లోబడిపోయి, మన నాటకాన్ని సర్వనాశనం చేసేశావు నువ్వు... ఆటో ఇటూ తేల్చుకోవాల్సిన సమయం వచ్చేసింది. అనవసరమైన మాటలతో నా కాన్‌సన్‌ట్రేషన్‌ని చెడగొట్టకుండా నా వెనకాలే అడుగులు వేయి..." కరుకు కంఠంతో హెచ్చరిస్తూ,గదిలో నుంచి బయటికి వచ్చాడు.

ఆ భవంతిలోకి వచ్చిన క్షణం నుంచీ అతనికి అర్థం అయిన విషయం ఒక్కటే ఒక్కటి వున్నది.

ఆఫీస్ రూమ్‌గా వ్యవహరించే గదిలో కూర్చోవటం, తన బాడీగార్డులతో కబుర్లు చెప్పటం, అప్పుడప్పుడు అడవిలోకి వేటకు పోవటం తప్ప టైగర్ జాన్ చేస్తున్న పనులు ఏమంత ఎక్కువగా కనిపించటంలేదు.

ఉన్నచోటి నుంచి కదలకుండా, బంగ్లాదేశ్‌ని ఏ విధంగా స్వాధీనపరుచుకోవాలని అనుకుంటున్నాడు అతను? తనను ఎవరైనా ఎదిరిస్తే దేశం మొత్తాన్ని సముద్రంలో కలిపే ఆయుధాల్ని ఎక్కడినుంచి ప్రయోగించాలని భావిస్తున్నాడు?

తాను నివశించే ఆ భవంతిలో అటువంటి ఏర్పాట్లు లేనప్పుడు, ప్రహరీ గోడల మీద కరెంట్ వైర్లు దేనికి? తోటలో బగ్గర అలారంలు ఎందుకు??

"మనకు అర్థంకాని విషయం ఏదో డెఫినిట్‌గా ఈ భవంతిలోనే వుండి వుంటుంది మిస్టర్ షాడో... అందులో సందేహం లేదు" షాడో మనసులో మెదులుతున్న ఆలోచనల్ని తేలికగా పసికట్టి, వెంటనే అన్నది మరియా.

టైగర్ జాన్ ఆఫీస్‌రూమ్ దగ్గిరికి పోయి, అక్కడ ఏదైనా క్లూ లభిస్తుందేమో అన్వేషించటం మంచిదని అనిపించింది షాడోకి.

అటుకేసి అడుగులు వేస్తుండగా - వినవచ్చాయి అతనికి అడుగుల చప్పుళ్లు.

వెనకాల వున్న మరియా చేయి పట్టుకొని, ప్రక్కకు జంప్ చేశాడతను. ఓరగా వేసి వున్న ఒక గది తలుపుల్ని తెరుచుకొని ఖాళీగా అగుపించిన ఒక గదిలోకి పోయాడు.

"మనం షబ్బాపాషాని వదిలి వచ్చిన గది దగ్గిరికి పోతున్నారు ఇద్దరు గార్డులు... మన బండారం బయట పడేందుకు ఎంతో వ్యవధి లేదు" తలుపుల వెనుక నిలబడి బయటికి తొంగిచూస్తూ లోగొంతుకతో అతన్ని హెచ్చరించింది మరియా.

ఆమె చేతిని వడిసి పట్టుకొని ఆ గదికి రెండో వైపున వున్న ద్వారం వైపు కదిలాడు షాడో.

విశాలమైన హాలు వంటి ఇంకో గది ఎదురయింది అతనికి.

ఆ బంగ్లాలో వుండే గార్డులకు, మెయిన్ గేటును కాపలా కాచే అనుచరులకు ఆహారాన్ని తయారు చేసే కిచెన్ అది...

"తిప్పితిప్పికొడితే యాభైమంది కంటె ఎక్కువ లేరు ఇక్కడ... వంట మాత్రం రెండు వందల మందికి పైగా చేయబడుతోంది.. గమనించావా మిస్టర్ షాడో..." కిచెన్ లోకి చూసిన మరుక్షణం స్త్రీ సహజమైన పరిశీలనగా శక్తిని ఉపయోగించి లోగొంతుకతో అక్కడ వున్న విచిత్రాన్ని షాడోకి తెలియచేసింది మరియా.

తమ గది దగ్గిరికి పోయిన గార్డులు అరిచి కేకలుపెడితే ఆ కిచెన్‌లోకి వినిపించకుండా వుండేందుకు, తాము వదిలి వచ్చిన గది తలుపుల్ని గట్టిగా దగ్గిరికి లాగాడు షాడో.

ఎర్ర ఎర్రగా కాల్చిన రొట్టెల్ని,సువాసనలు వెదజల్లే అన్నపానాల్ని పెద్ద పెద్ద కంటెయినర్స్‌లో పెట్టి, చేతులు దులుపుకుంటున్నారు వంటవాళ్ళు.

"ఇక్కడి వాళ్ళకి అడ్డం లేకుండా వెంటనే తీసుకుపొండి వీటిని... ఆలస్యం చేయవద్దు..." అంటూ కిచెన్‌కి అవతలి పక్కన నిలబడిన పదిమంది గార్డుల్ని హెచ్చరిస్తున్నారు.

నిలువెత్తున పేర్చి వున్న గోధుమ పిండి బస్తాల చాటునమోకరించి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు షాడో, మరియా.

తాము విన్న మాటలకు అర్థం ఏమిటో వారికి అవగతం కాక ముందే వంటవాళ్ళు రెడీ చేసిన కంటెయినర్స్ భుజాల మీదికి ఎత్తుకుని అవతలి ప్రక్కన వున్న ఇంకో పెద్ద గదిలోకి పోయారు రెడీగా వున్న గార్డులు.

"వాళ్ళని అనుసరించాలి మనం... అందుకు ఈ వంటవాళ్ళు అభ్యంతరం పెట్టకుండా చూసుకోవాలి..." గోధుమ పిండి బస్తాల చాటు నుంచి లేచి నిలబడుతూ మరియాని హెచ్చరించాడు షడో.

తన తొందరపాటు మూలకంగా షాడో ఐడెంటిటీ బయటపడి, అంతవరకూ పడిన కష్టం అంతా వృధా అయిందన్న బాధ మనసును తొలుస్తున్నది కాబోలు, ఆడ చిరుతలా లేచింది మరియా. అందుబాటులో వున్న ఒక ఆయిల్ డబ్బాని ఎత్తి ఇద్దరు వంట మనుష్యుల మీదికి విసిరింది.

అదిరిపడి బిగ్గరగా అరవటానికి ప్రయత్నించారు వాళ్ళు. ఆయిల్ డబ్బాతో పాటు కదిలి వారిమీదికి జంప్ చేసింది మరియా... రెండే రెండు దెబ్బలతో వారిని స్పృహ తప్పించి మిగిలిన మరో ఇద్దరి వైపు తిరిగింది.

తమ దగ్గిర వున్న కత్తుల్ని, కత్తిపీటల్ని పట్టుకుని పరుశురాముల మాదిరి ఆమె మీదికి ఎగబడ్డారు వాళ్ళు.

అంతవరకే చేయగలిగారు... ప్రక్కనుంచి వచ్చి షాడో డెలివర్ చేసిన పిడిగుద్దుల ధాటికి తట్టుకోలేక తల్లక్రిందులు అయిపోయారు.

వారి శరీరాల మీది నుంచి జంప్ చేసి, కంటెయినర్స్ పట్టుకున్న గార్డుల్ని అనుసరించాడు షాడో.

అవతలి గది చివరి భాగంలో వున్న పెద్ద ట్రాప్ డోర్ ని ఎత్తి ఒక సొరంగం వంటి గోతిలోకి దిగారు ఆ గార్డులు...అతి జాగ్రత్తగా అడుగులు వేస్తూ అర నిముషంలో కనుమరుగయ్యారు.

"శత్రువులు... శత్రువులు మన భవంతిలోకి ప్రవేశించారు... షబ్బూపాషాని ఖతమ్ చేసేశారు... శత్రువులు..." మూసివున్న కిచెన్ తలుపుల్ని దాటి అస్పష్టంగా వినవస్తున్న అరుపుల్ని ఆలకిస్తూ మరియాతో సహా ఆ గోతిలోకి దిగాడు షాడో.

పది అడుగులు వేసిన వెంటనే అర్థం అయింది అతనికి.

బ్రహ్మాండమైన రహస్య మార్గం వున్నది ఆ పురాతన కాలపు భవంతి క్రింది భాగంలో. తన యాక్టివిటీస్ బయటికి అగుపించకుండా వుండేందుకు అతి చక్కగా ఆ మార్గాన్ని ఉపయోగించుకుంటున్నాడు టైగర్ జాన్.

పాంటు బెల్టు వెనుక వున్న రివాల్వర్‌ని చేతిలోకి తీసుకుంటూ ముందుకు సాగాడు షాడో. అరగంట గడిచిన తరువాత ఉన్నట్లుండి ఏటవాలుగా పైకి లేవటం మొదలు పెట్టింది ఆ సొరంగ మార్గం.

మరో పది నిముషాల తరువాత, ఢాకా పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో వుండే ఒక పాడుబడిన ఖిల్లా మధ్యభాగంలో భూమి మీదికి చేరుకుంది అది.

కంటెయినర్లను పట్టుకున్న గార్డులు కనిపించక పోయినా, కంటెయినర్ల లోనుంచి వస్తున్న ఆహార పదార్థాల వాసనల్ని బట్టి మరికొంచెం ముందుకు పోయాడు షాడో.

అడవి తీగెలతో , ముళ్ళపొదలతో కప్పబడి వున్న ఒక పాడుబడిన భవంతి కనిపించింది అతనికి. తీగెల్ని ప్రక్కకు నెట్టి ముందుకు చూసేసరికి అగుపించింది అధునాతనమైన అనేక రకాల యంత్రాలతో నిండి వున్న పెద్ద లేబరేటరీ.

# 12

తెల్లటి దుస్తులు ధరించిన సైంటిస్టులు, ఇంజనీర్లు అనేకమంది హడావుడిగా తిరుగుతున్నారు ఆ ప్రదేశంలో.

రకరకాల యంత్రాల ముందు నిలబడి చిత్ర విచిత్రమైన ప్రయోగాలు చేస్తున్నారు.

పనిచేయటం మానుకున్న ఒక పెద్ద యంత్రం చాటుకు పోయి మోకరించి కూర్చున్నాడు షాడో.. అక్కడి తతంగాన్ని పరిశీలనగా చూసి, ఆతరువాత తన కర్తవ్యాన్ని నిర్ణయించుకోవచ్చని అనుకున్నాడు.

అంతలోనే గరగరమని శబ్దం చేస్తూ జీవం పోసుకున్నది, పనిచేయటం మానుకున్నదని అతను భావించిన యంత్రం.

"ఈ పరిసరాల్లో వుండటానికి అర్హుడు కాని పరాయి వ్యక్తి ఈ ప్రదేశంలోకి అడుగుపెట్టాడు... పరాయి వ్యక్తి మన మధ్యకు వచ్చాడు..." మాటలు నేర్చిన చిలుక మాదిరి అదే పనిగా వల్లించటం మొదలు పెట్టింది అది.

చేస్తున్నపనుల్ని ఆపివేసి విచిత్రంగా వెనుతిరిగి చూస్తున్న సైంటిస్ట్‌లను, ఇంజనీర్లను గమనించేసరికి ఎండుకుపోయింది షాడో గొంతు.

కూర్చున్న చోటి నుంచి లేచి, వచ్చిన దారినే వెనక్కి పారిపోదాం అనుకుంటూ వుండగానే, బుస్సుమని శబ్దం చేస్తూ తెల్లటి పొగను వదిలింది అతని ముందున్న యంత్రం.

ఊపిరి ఆడకఉక్కిరిబిక్కిరి అవుతూ వెనక్కి జంప్ చేయబోయాడు షాడో. ఇనుప ముద్దలు ప్రేలాడ దీయబడినట్లు బరువెక్కి పోయాయి పాదాలు... మైకం కమ్ముతున్నట్లు మూతలు పడిపోయాయి కనులు. నిలుచున్నవాడు నిలుచున్నట్లుగానే విరుచుకు పడిపోయాడు...

*****

మంచు కంటె చల్లగా వున్న నీళ్లు ముఖం మీద పడేసరికి తెలివి వచ్చి కనులు తెరిచాడు షాడో.

"నన్ను మోసం చేయాలని ప్రయత్నించిన వారెవరూ ఇక్కడి నుంచి ప్రాణాలతో ప్పించుకోలేరు మిస్టర్ షాడో... పొట్ట చేత్తో పట్టుకొని పనికోసం వచ్చిన వాడి మాదిరిగా నటిస్తూ నన్ను ఏమార్చావు నువ్వు... "

నడుము మీద చేతులు వేసుకుని క్రూరంగా చూస్తూ అన్నాడు టైగర్ జాన్.

ఢాకా పట్టణంలో వుండే అతని భవంతిలోని బాడీగార్డులు అందరూ, అతని వెనక నిలబడి వుండటాన్ని గమనించి తల విదిలించాడు షాడో.

"కిల్లర్స్ గాంగ్ సుప్రీమ్ కమాండ్ ఆదేశాలనే ధిక్కరించిన వాడిని నేను. నీవంటి ఒక ఆర్డినరీ ఏజెంట్ ఏదో చేయాలని వస్తే భయపడి లొంగిపోతాననో, నా కార్యక్రమాల్ని ఆపేస్తాననో అనుకోవటం నీ భ్రమ.. అతి కొద్దిరోజుల్లోనే ఈ దేశాన్ని ఆక్రమించుకుంటాను. ఆ తరువాత భారతదేశాన్ని జయిస్తాను... నా దారికి అడ్డు రావటం ఎవరి తరమూ కాదు..." విపరీతమైన ఆత్మ విశ్వాసంతో మీసాలు దువ్వుతూ అన్నాడు టైగర్ జాన్.

"నీ వెనక వున్న ఆ బాడీగార్డుల సహాయంతో వశపరుచుకోగలవా ఈ దేశాన్ని? ఇటువంటి వాళ్ళు కోటిమంది నీవెంట వున్నా భారతదేశపు సరిహద్దుల్ని దాటటం నీ తరం అవుతుందా??" వద్దు వద్దని అనుకుంటూనే వెక్కిరించకుండా వుండలేక పోయాడు షాడో.

ఒక్కసారిగా అరుణ వర్ణాన్ని పులుముకొని, అంతలోనే మామూలుగా మారిపోయాయి టైగర్ జాన్ కనులు.

"వొట్టొట్టి మాటలు చెపితే నీవంటి వాడికి అర్థం కాదు..." అంటూ ముందుకు వచ్చి, షాడో జుట్టు పట్టుకొని బలవంతంగా పైకి లేపాడు టైగర్ జాన్. తెల్ల దుస్తులు ధరించిన సైంటిస్ట్లను, ఇంజనీర్లను తప్పుకోమని సైగ చేస్తూ, ఆ ప్రదేశంలో వున్న యంత్రాల దగ్గరికి తీసుకుపోయాడు.

జానెడు పెడల్పున, రెండు అంగుళాల మందం వుండేటట్లుగా గుండ్రంగా తయారు చేయబడుతున్నాయి కొన్ని ఆయుధాలు అక్కడ.

"ఆర్డినరీ ఎక్స్‌ప్లోజివ్స్ కంటె వందరెట్లు శక్తివంతమైన ప్రేలుడు పదార్థాలను కలిగి వుంటాయి ఇవి... ఢాకా పట్టణం నలుమూలలా భూమిలో నిక్షిప్తం చేయబడ్డాయి వాటిలో కొన్ని... సముద్ర తీరాన్ని ఆనుకుని వున్న చిత్తడి భూముల్లో కూడా పాతిపెట్టబడ్డాయి..." అంటూ కంప్యూటర్ మాదిరిగా వున్న యంత్రాన్ని షాడోకి చూపించాడు... ఆ యంత్రం మీద వున్న ఒక బటన్‌ని వ్రేలితో సూచించాడు.

"నా దారికి ఎవరైనా అడ్డు రావటానికి సాహసించిన మరుక్షణం ప్రెస్ చేయబడుతుంది ఈ బటన్... భూమిలో జాగ్రత్త చేయబడిన ప్రేలుడు పదార్థాలను యాక్టివేట్ చేసి సర్వనాశనాన్ని సృష్టిస్తుంది..." సగర్వంగా చూస్తూ చెప్పాడు.

బటన్‌ని ప్రెస్ చేసిన మరుక్షణం భీభత్సాన్ని సృష్టించి, అందర్నీ భీతావహుల్ని కావించే ఆయుధాలు, ఆ దేశాన్ని వశపరచుకోవటంలో అతనికి ఎలా సహాయపడగలవో అవగతం కాక కనుబొమ్మల్ని ముడివేసి చూశాడు షాడో.

"వందలు వేల సంఖ్యలో తయారు చేయబడుతున్నాయి ఈ ఆయుధాలు. ఈ దేశంలోని ప్రతి గ్రామంలోను, ప్రతి పట్టణంలోను

ప్రయోగించబడతాయి... నా ఆజ్ఞలకు ఎదురు చెప్పిన వారందరి కనుల ముందు వారి స్వస్థలాన్ని నాశనం చేస్తాను... నన్ను నాయకుడిగా అంగీకరించేటంత వరకూ ప్రళయాన్ని సృష్టిస్తాను..." అటూ వెను తిరిగి తన బాడీ గార్డులకు సైగ చేశాడు టైగర్ జాన్.

అన్నెం పున్నెం ఎరుగని అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడి, అధికారంలోకి రావాలని కోరుకునే అతని రాక్షసు ప్రవృత్తిని పూర్తిగా అర్థం చేసుకునే సరికి చలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం.

తనను పట్టుకోవటానికివచ్చిన బాడీగార్డులను అవతలికి విదిలించి, ఆ పాడుబడిన భవనంలో నుంచి బయటికి పారిపోదామని అనుకునేలోగా అతని చేతుల్ని విరిచి పట్టుకున్నారు ఆ గార్డులు.

"నీ టైమ్ పూర్తిగా అయిపోయింది మిస్టర్ షాడో... కనిపించకూడని ప్రదేశంలో కనిపించటం వల్ల ముందుగానే నీ ఐడెంటిటీని గుర్తించలేక, నా కుడిభుజం వంటి షబ్బూపాషాని పోగొట్టుకున్నాను... అందుకు ఫలితం నువ్వు అనుభవించాల్సిందే" అంటూ తన దుస్తుల్లో వున్న రివాల్వర్‌ని తీసి అతనికేసి గురి పెట్టాడు టైగర్ జాన్.

తనను పట్టుకున్న గార్డుల్ని విదిలించి కొట్టటం అసంభవమని గ్రహించి కనులు మూసుకున్నాడు షాడో. నిప్పుల్ని వెదజల్లుతూ వచ్చే

బుల్లెట్ కోసం వూపిరి బిగపట్టి ఎదురు చూడబోతుండగా ధన్‌మని గర్జించింది ఆ ప్రదేశం వెలుపల నుంచి ఒక పిస్టల్.

కంటికి కనిపించని మనిషి ఎవరో కాలితో తన్నినట్లు ఎగిరి అవతల పడింది టైగర్ జాన్ చేతిలోని రివాల్వర్.

వద్దు వద్దన్న కొద్దీ తనకు సమీపంలో సంచరించటానికి ప్రయత్నించి దారుణంగా దెబ్బతిన్న మరియా, ఈసారి కాస్తంత తెలివి ఉపయోగించి దూరంగానే వుండిపోయిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, అమాంతంగా పక్కకు డైవ్ చేశాడు షాడో.

"పట్టుకోండి... ఆ బద్మాష్‌ని పట్టుకోండి" అని కమాండ్ చేస్తూ గాలిలోకి విసిరిన తన ఆయుధం కోసం వెతుక్కోవటం మొదలుపెట్టాడు టైగర్ జాన్.

సడన్‌గా వినవచ్చిన పిస్టల్ మ్రోతను విని నిశ్చేష్టులైన బాడీగార్డులు అందరూ తేరుకుని తన మీదికి లంఘించకముందే దగ్గర్లో వున్న ఒక యంత్రం దగ్గిరికి పోయాడు షాడో.

ఉపయోగించటానికి రెడీ చేయబడిన ఎక్స్‌ప్లోజివ్ మీద అమర్చబడి వున్న మీటను ప్రెస్ చేసి దూరంగా విసిరేశాడు.

"మీరు తయారు చేసిన పరికరం మీ ప్రాణాల్ని తీయటానికి సిద్ధంగా వున్నది... పారిపొండి... పారిపోయి మీ ప్రాణాలను కాపాడుకోండి..." అని అక్కడివారందర్నీ హెచ్చరించాడు.

నోళ్ళు తెరుచుకుని శిలావిగ్రహాల మాదిరి నిలబడి వున్నారు సైంటిస్టులు, ఇంజనీర్లు. ఆ అరుపులతో తెలివి తెచ్చుకొని గొల్లున అరుస్తూ ముందుకు దూకారు.

"ఆగండి... ఆ ఇన్‌స్ట్రుమెంట్‌ని వెతికి స్విచ్‌ని ఆఫ్ చేయండి... ఆగండి" అంటూ వారిని ఆపటానికి ప్రయత్నించాడు టైగర్ జాన్.

తను తయారుచేసిన మారణాయుధాలతో అమాయకులైన ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి, దారుణమైన అరాచకాన్ని సృష్టించి, ఆ సందడిని ఆసరాగా చేసుకుని అధికారాన్ని చేజిక్కించుకుందామని తలపోశాడతను.

మారణాయుధాల భయం ఎటువంటిదో, భయభ్రాంతులైన వారు ఎలా ప్రవర్తిస్తారో ఆ క్షణంలో అవగతమయింది అతనికి.

అతని మాటల్ని పొరపాటున కూడా వినిపించుకోలేదా సైంటిస్టులు... ఒకరినొకరు నెట్టుకుంటూ, ఒకరి కాళ్ళకు ఒకరు అడ్డం పడుతూ బయటికి పరుగులు తీశారు.

"పారిపొండి... పారిపొండి..." అని గావుకేకలు పెడుతూ వారి భయాన్ని మరింత అధికం చేశాడు షాడో.

వారి పాదాల క్రింద పడి నలిగిపోకుండా జాగ్రత్త పడుతూ తను కూడా బయటికి పరిగెత్తుకు వచ్చాడు.

ఢాకా పట్టణంలోని బంగ్లా దగ్గిరికి దారితీసే సొరంగాన్ని చేరుకుంటుండగా ఉత్పన్నమయిందా ప్రేలుడు...

దిక్కులు దద్దరిల్లి పోయే శబ్దంతో, గాలిలోకి లేచింది లేబరేటరీ మాదిరిగా వుపయోగపడుతున్న పాడుబడిన భవనం.

ఎర్రటి మంటలు, నల్లటి పొగలు సుడులు తిరుగుతూ ఆకాశంలోకి లేస్తూ వుండటాన్ని అలాగే చూస్తూ నిలబడి పోయిన షాడోని సొరంగంలోకి లాగింది మరియా...

గింగిరాలు తిరుగుతూ వచ్చి అతని గుండెల్ని బ్రద్దలు చేయవలసిన కొండరాయి ఒకటి తలను అలవోకగా స్పృసిస్తూ అవతలికి పోయింది.

ఆ అదటుకు కనులు బైర్లు క్రమ్మి మరియా కౌగిలిలో అచేతనంగా వుండిపోయాడు షాడో.

తిరిగి తెలివి వచ్చేసరికి చల్లటి గచ్చు మీద పడి వున్నాడతను.

"పాడుబడిన కోట పూర్తిగా భూస్థాపితమై పోయింది... తన బాడీ గార్డులతో సహా అందులో సమాధి అయిపోయాడు టైగర్ జాన్. డబ్బుకు ఆశపడి అతనికి సహాయం చేసిన సైంటిస్టులు, ఇంజనీర్లు మూడొంతుల

మంది ఆ మంటల్లో మాడి మసి అయిపోయారు. ఆ దేశానికి సంభవించనున్న ప్రమాదం తప్పిపోయింది మిస్టర్ షాడో... మా గాంగ్ పరువు నాశనమై పోకుండా నిలబడింది..." అతను కనులు తెరిచిన మరుక్షణం దగ్గిరికి జరుగుతూ ఆనందంగా చెప్పింది మరియా.

గుండెల మీదినుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూరుస్తూ లేచి కూర్చున్నాడు షాడో.

"ఇప్పుడు మనం ఎక్కడ వున్నాం?" అని అడుగుతూ అదిరిపడి ఆ మాటల్ని మ్రింగేశాడు.

"సొరంగంలోకి దిగిన వెంటనే స్పృహ కోల్పోయావు నువ్వు. అతి కష్టంమీద టైగర్ జాన్ బంగ్లాలోకి తీసుకువచ్చాను... వంట వాళ్ళని మనం గాయపరచిన హాల్లో మనకోసమే ఎదురు చూస్తున్నట్లు సిద్ధంగా వున్నాడు ఇతగాడు" అంటూ ఒక ప్రక్కకు చూపించింది మరియా.

పొడుగాటి లాటీని పట్టుకుని విలాసంగా నిలబడి వున్నాడు ఇన్స్పెక్టర్ రణధీర్ సాబ్...

"నా జోలికి వచ్చిన వాడిని వదిలి పెట్టే ప్రసక్తి లేదని ఇది వరకు చాలాసార్లు చెప్పాను నీకు... అంతు చూడందే నాకు నిద్రపట్టదని కూడా చెప్పినట్లు కూడా గుర్తు..." అంటూ ముందుకు వచ్చాడతను.

మరో కొండరాయి వంటి వస్తువు ఏదైనా కంటపడితే ఇంకోసారి అతని ముఖం మీదికి విసరాలన్న కోరిక కలిగింది షాడోకి.

అంతలోనే కొంపలు అంటుకుపోయినట్లు గఃయ్‌మని అరుస్తూ లేచి నిలబడింది మరియా...

"రక్షించండి... ఈ ఇన్స్‌పెక్టర్ బారి నుంచి నన్ను రక్షించండి..." అని గొల్లుమంటూ అమాంతంగా అతన్ని వాటేసుకున్నది.

ఆమె పట్టునుంచి బయటపడటానికి విశ్వప్రయత్నం చేశాడు ఇన్స్‌పెక్టర్ రణధీర్ సాట్.

ఆ ప్రయత్నం ఫలించక ముందే రాకెట్ మాదిరి ప్రక్కనుంచి పరిగెత్తాడు షాడో. ముందు గదిలో నిలుచుని వున్న కానిస్టేబిల్స్‌ని భుజాలతో పొడిచి వెనక్కి పడవేస్తూ, స్టేషన్ వెనుక భాగంలో వున్న ప్రహరీని ఒక్క గంతులో అధిగమించాడు.

తన గోలకు బిత్తరపోయిన ఇన్స్‌పెక్టర్‌ని వదిలి,తను కూడా అతన్ని అనుసరించటానికి ప్రయత్నించింది కిల్లర్స్ గాంగ్ ప్రతినిధి మరియా...

ఎంత వెతికినా అగుపించలేదామెకు షాడో... నీడ మాదిరిగానే నిశ్శబ్దంగా మాయమై పోయాడు.

-:అయిపోయింది:-


KILLERS GANG
MADHU
BAABU
A.S.Murli